అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక


గురువారం 13-03-2025

సంపుటి : 11 | సంచిక : 21 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

డీలిమిటేషన్‌పై ఏకాభిప్రాయం అవశ్యం

హోలీ సందర్భంగా విద్వేషాలకు బీజేపీ యత్నం

కవ్వింపు చర్యల ఊబిలో పడొద్దని ప్రజలకు వినతి : సీపీఐ(ఎం)



న్యూఢిల్లీ : లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ (డీలిమిటేషన్‌) వల్ల దక్షిణాది రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య తగ్గే అవకాశాలు వున్న నేపథ్యంలో దీనిపై ఏకాభిప్రాయానికి రావాల్సిన అవసరముందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తెలిపింది. అలాగే హోలీ, శుక్రవారం ప్రార్థనలు ఒకే రోజు రావడంతో ముస్లింల పట్ల బీజేపీ నేతలు విద్వేషాన్ని రెచ్చగొట్టే ...3లో



రైతే రాజు

రూ.20,616.89 కోట్లు రుణమాఫీ

25.35 లక్షల మంది అన్నదాతలకు లబ్ది

తెలంగాణ అభివృద్ధికి సామాజిక న్యాయమే పునాది

మహిళా సాధికారతే తెలంగాణ శక్తి

న్యాయబద్ధ పురోగతి పొందడమే విజన్‌

అభివృద్ధి, సమృద్ధికి తెలంగాణ దిక్సూచి కావాలి

బడ్జెట్‌ భవిష్యత్‌కు రోడ్‌మ్యాప్‌ :

ఉభయసభలనుద్దేశించి గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ

బడ్జెట్‌ చర్చల్లో సభ్యులు ఆసక్తి, శ్రద్ధతో పాల్గొనాలని పిలుపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్‌

'తెలంగాణ రైతులు ఈ రాష్ట్రానికి ప్రాణం లాంటివారు. వారి స్వేదం, కష్టం మన ప్రజలను పోషిస్తున్నది. మన ఆర్థిక వ్యవస్థను అది స్థిరపరుస్తున్నది. మన సాంప్రదాయాలను నిలబెడుతున్నది. వారిని ప్రోత్సహించి, ఉద్ధరించి, సాధికారత కల్పించడమే ప్రభుత్వ నైతిక కర్తవ్యం' అని రాష్ట్ర గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ చెప్పారు. అందుకే రాష్ట్రంలో రూ.20,616.89 కోట్ల రూపాయలతో రైతులకున్న రూ.2 లక్షల లోపు రుణాలను మాఫీ చేశామనీ, దీని ద్వారా ఇప్పటి వరకూ 25.35 లక్షల మంది లబ్ది పొందారని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి సామాజిక న్యాయమే పునాది అని నొక్కి చెప్పారు. మహిళా సాధికారతే తెలంగాణ శక్తి అన్నారు. న్యాయబద్ధంగా పురోగతి సాధించడమే నిజమైన విజన్‌ అని నొక్కి చెప్పారు. బడ్జెట్‌ అంటే కేవలం ఆర్థిక కేటాయింపులు మాత్రమే కాదు..అది పటిష్ట, సుస్థిర తెలంగాణను రూపొందించడానికి, అభివృద్ధికి బాటలు వేసే రోడ్‌మ్యాప్‌ లాంటిదని వ్యాఖ్యానించారు. అభివృద్ధి, సమృద్ధికి తెలంగాణ దేశానికే దిక్సూచి కావాలని ఆకాంక్షించారు. డైనమిక్‌ సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రత్యేక విజన్‌తో తెలంగాణ ముందుకెళ్తున్నదని కొనియాడారు. రాష్ట్ర బడ్జెట్‌ సమావేశాల ప్రారంభం సందర్భం గా బుధవారం అసెంబ్లీకి ఆయన వచ్చారు.

అసెంబ్లీలోకి సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌, మండలి చైర్మెన్‌ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచా ర్యులుతో పాటు పలువురు మంత్రులు గవర్నర్‌ను సావదానంగా ఆహ్వానించారు. శాసనసభ, శాసనమండలి సభ్యులనుద్దేశించి 35 నిమిషాల పాటు ఆయన ప్రసంగించారు.

తెలంగాణ గుర్తింపు వారసత్వాన్ని గౌరవిద్దాం

తెలంగాణ ఒక భౌగోళిక ప్రాంతం మాత్రమే కాదనీ, భావోద్వేగాలకు, పోరాటాలకు, స్థిరత్వానికి, దృఢ సంకల్పానికి గుర్తుగా ఉందని జిష్ణుదేవ్‌ వర్మ అన్నారు. తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక ఉద్దండులైన గద్దర్‌, గూడ అంజయ్య, బండి యాదగిరి, ఇతర ప్రముఖులను గౌరవిస్తోందన్నారు. తెలంగాణ గేయం 'జయ జయ జయహే తెలంగాణ' రాష్ట్ర ఏర్పాటుకు కారణమైన పోరాటాలు, త్యాగాలను గౌరవించడమే కాకుండా ఐక్యమత్యానికి, స్థిరత్వానికి, సమిష్టి అభివృద్ధికి పిలుపునిస్తున్నదని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహం ఆత్మగౌరవానికి, సాధికారతకు చిహ్నంగా, పురోగమించే సమాజపు ఆకాంక్షకు ప్రతీకగా ఉందని కొనియాడారు.

వరి ఉత్పత్తిలో తొలి స్థానం

వరి ఉత్పత్తిలో దేశంలోనే రికార్డు స్థాయిలో అత్యధికంగా 260 లక్షల టన్నుల ఉత్పత్తిని సాధించినందుకు గవ్నరర్‌ సంతోషం వ్యక్తం చేశారు. రైతు భరోసా పథకం కింద రైతులకు ఏడాదికి రూ.12 వేల పెట్టుబడి సాయం అందిస్తున్న తీరును వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఏటా 12 వేల రూపాయలు ...3లో



19న రాష్ట్ర బడ్జెట్‌

27 వరకు అసెంబ్లీ సమావేశాలు

14, 16 తేదీల్లో సభకు సెలవు :

బీఏసీ సమావేశంలో నిర్ణయం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్‌

అసెంబ్లీ బడ్జెట్‌ సమావేశాలను 11 రోజులపాటు నిర్వహించాలని బిజినెస్‌ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) నిర్ణయించింది. కనీసం 20 రోజులు నిర్వహించాలని ప్రతిపక్షాలు పట్టుపట్టాయి. అయితే 27న ...2లో



అది కాంగ్రెస్‌ ప్రెస్‌మీట్‌

కొత్త విషయాలేమీ లేవు..అన్నీ అబద్ధాలే..

ఆరు గ్యారంటీల ప్రస్తావనే లేదు :

గవర్నర్‌ ప్రసంగంపై కేటీఆర్‌

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్‌

గవర్నర్‌ ప్రసంగంలో కొత్త విషయాలేమీ లేవని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ విమర్శించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన ...2లో

వాస్తవాలకు భిన్నంగా గవర్నర్‌ ప్రసంగం



ప్రజావ్యతిరేక విధానాలను ప్రభుత్వం కొనసాగించేలా ఉంది :

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ వివరాలు 2లో



ఊపర్‌ షేర్వానీ..అందర్‌ పరేషానీ

కేసీఆర్‌ మాకు ఆర్థిక క్యాన్సర్‌ ఇచ్చారు

అబద్ధాలు చెప్పి ఎన్ని రోజులు దాచిపెడతాం

ప్రభుత్వానికి సహకరించకుంటే

ఉద్యోగులకు జీతాలివ్వటం కష్టం

సమస్యలపై మాట్లాడితే రాష్ట్రం మరింత దివాళా

ఇది ప్రజా ప్రభుత్వం...నేను కస్టోడియన్‌ను మాత్రమే

సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడంపై ఆలోచించాలి

క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలి

పిల్లలకు నాణ్యమైన విద్యనందించే బాధ్యత మీదే :

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

1,532 మంది అధ్యాపకులకు నియామకపత్రాలు అందజేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్‌

'రాష్ట్రంలో కొన్ని సమస్యలున్నాయి. సమస్యల గురించి చర్చించుకుంటూ పోతే అవి పరిష్కారం కాలేదనే పేరుతో ప్రభుత్వానికి సహకరించబోమని ఉద్యోగులు అనుకుంటే మన పరిస్థితి ఇంకా దిగజారి పోతుంది. రాష్ట్రం మరింత దివాళా తీస్తుంది. నెలనెలా జీతాభత్యాలు ఇవ్వలేని పరిస్థితికి పడిపోతాం. ప్రభుత్వ ఉద్యోగులకు 2024, జనవరి నుంచి ప్రతినెలా ఒకటో తారీఖున జీతాలిస్తున్నాం. ఈనెల ఇబ్బంది వస్తే ఆర్బీఐ వద్దకెళ్లి రూ.నాలుగు వేల కోట్లు తెచ్చి ఇచ్చాను. డీఏ ఇతర ...3లో

చర్చిద్దాం రండి

నియోజకవర్గాల పునర్విభజనపై అఖిలపక్ష సమావేశం :

రాజకీయ పార్టీలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్‌ నేత జానారెడ్డి బహిరంగ లేఖ

వివరాలు 11లో

దీటుగా స్పందించాలి

సభలో సమన్వయంతో వ్యవహరించాలి 2లో..

సబ్జెక్టుల వారీగా బాధ్యతలు తీసుకుని మాట్లాడాలి :

సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

అమెరికా నోట మళ్లీ సుంకాల మాట

ఆల్కహాల్‌, వ్యవసాయ ఉత్పత్తులపై భారత్‌ అధిక పన్నులు : శ్వేతసౌధం

వాషింగ్టన్‌ : భారత్‌ తమ ఉత్పత్తులపై అధిక సుంకాలు వసూలు చేస్తోందని అమెరికా మరోసారి ఆరోపించింది. అమెరికా ఆల్కహాల్‌, వ్యవసాయ ఉత్పత్తులపై భారత్‌ ఎక్కువ సుంకాన్ని విధిస్తోందని శ్వేతసౌధం పత్రికా కార్యదర్శి కరోలిన్‌ లీవెట్‌ చెప్పారు. కెనడాపై విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ ఆమె ఈ విషయాన్ని ప్రస్తావించారు. కెనడా కొన్ని దశాబ్దాలుగా అమెరికాను, అమెరికా ప్రజలను నానా ఇబ్బందులు ...11లో





ఆరు నెలల్లో సమస్యలు పరిష్కరించండి

రెండేండ్లుగా పేరుకుపోయిన రూ.8 వేల కోట్ల బకాయిలు

కొంతమంది మంత్రులు, అధికారులు స్పందించడం లేదు :

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆవేదన వివరాలు 2లో

రాంకీలో సీఐటీయూ ఘనవిజయం

బీఎంఎస్‌పై 607 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపు

గుర్తింపు సంఘం అధ్యక్షులుగా పాలడుగు భాస్కర్‌

కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఎర్ర అశోక్‌,

ప్రధాన కార్యదర్శిగా ఐ.రమేశ్‌

వివరాలు 2లో





ప్రాణాలైనా ఇస్తాం.. భూములు ఇవ్వం

నిమ్జ్‌ పేరుతో మా జీవనాధారాన్ని గుంజుకోవద్దు :

భూ సేకరణ గ్రామసభలో రైతుల ఆవేదన

నవతెలంగాణ-న్యాల్‌కల్‌

'మా ప్రాణాలైనా ఇస్తాం కానీ.. జీవనాధారంగా ఉన్న భూములను మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ నిమ్జ్‌కు ఇవ్వలేం. అధికారులు బలవంతపు భూసేకరణ వెంటనే ఆపేయాలి' అని సంగారెడ్డి జిల్లా న్యాల్కల్‌ మండంలోని మామిడ్గి రైతులు అధికారులకు స్పష్టం చేశారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. నిమ్జ్‌ ప్రాజెక్టు భూ సేకరణలో భాగంగా నిమ్జ్‌ స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ రాజు, ...11లో

ఇది సంచలన రాజకీయ శకం. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ ట్రంప్‌, భారత ప్రధాని నరేంద్ర మోడీ ఈ విషయాన్ని బాగా వంటపట్టించుకున్నారు. ఇరువురు నేతలు తమ వాక్పటిమతో ప్రజలను ఆకర్షించడంలో సాటిలేని వారే. తరచూ వార్తల్లోని వ్యక్తులుగా నిలుస్తూ జనం నోళ్లలో నానుతుంటారు. కానీ వీరు అనుసరిస్తున్న విధానాలు, వైఖరుల కారణంగా రెండు దేశాలు ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా మోడీ పాలన కారణంగా భారత్‌ చాలా నష్టపోతోంది. ఆర్థిక స్తబ్దత, సామాజిక అశాంతి, దౌత్యపరమైన ఒంటరితనంతో ఇబ్బందులు పడుతోంది.

ప్రచారం జాస్తి...పని నాస్తి


ఆర్థిక రుగ్మతలను పట్టించుకోని మోడీ | తొందరపాటు నిర్ణయాలతో అనర్థాలు

నత్తనడకన హామీల అమలు

విమర్శకులు, ముస్లింలే లక్ష్యంగా ప్రతీకార చర్యలు

మరింత విస్తృతంగా తెర పైకి హిందూత్వ వాదం

న్యూఢిల్లీ : మోడీ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు విప్లవాత్మకమైనవని ఆయన మద్దతుదారులు కీర్తిస్తూ ఉంటారు. కానీ అవి నిరాశాజనకమైన ఫలితాలనే అందించాయి. దేశంలో నిరుద్యోగిత రేటు 8.1 శాతానికి పెరిగింది. ముఖ్యంగా యువతలో నిరుద్యోగం చాలా భయానకంగా ఉంది. పెద్దల్లో నిరుద్యోగిత రేటుతో పోలిస్తే యువతలో పది శాతం అధికంగా ఉంది. మన దేశంలోని కార్మికుల్లో సుమారు సగం మందికి వ్యవసాయ రంగమే ఉపాధి కల్పిస్తోంది. అయితే ఈ రంగంలో ఉత్పాదకత తక్కువగా ఉంటోంది. స్థిరమైన ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఇది వేలెత్తి చూపుతోంది. నెల నెలా జీతాలు పొందే ఉద్యోగుల వాస్తవ వేతనాలు తగ్గుతుండగా కార్పొరేట్‌ లాభాలు కొండలా పెరిగిపోతున్నాయి.



తొందరపాటు నిర్ణయాలతో చేటు

ప్రజలకు ఆకస్మిక షాక్‌లు ఇవ్వడమంటే మోడీకి ఎంతో ఇష్టం. 2016లో పెద్ద నోట్ల రద్దు ఈ కోవలోనిదే. అయితే ఇలాంటి ఉదంతాలన్నీ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా నష్టపరిచాయి. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలు వంటి నిర్ణయాల వెనుక ప్రణాళికలను సరిగా రూపొందించు కోకపోవడం, అమలులో తొందరపాటు స్పష్టంగా కన్పించాయి. ఈ చర్యలతో చిరు వ్యాపారులు, అన్నదాతలు బాగా ఇబ్బందులు పడ్డారు. రిజర్వ్‌బ్యాంక్‌ నిర్దేశించిన మధ్యకాలిక లక్ష్యం నాలుగు శాతం కంటే వినియోగ ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉంది. అమెరికా డాలరుతో పోలిస్తే రూపాయి విలువ రికార్డు స్థాయిలో తగ్గిపోయింది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు భారతీయ మార్కెట్‌ నుంచి రికార్డు ...11లో

హిందూత్వమే శరణ్యం

దేశంలో మోడీకి ప్రజాదరణ క్రమేపీ తగ్గిపోతోంది. 2024లో పార్లమెంటరీ మెజారిటీకి బీజేపీ ఆమడ దూరంలో నిలవడమే దీనికి తార్కాణం. దీంతో ఆ పార్టీ మళ్లీ హిందూత్వ వాదాన్ని విస్తృతంగా ముందుకు తెస్తోంది. అయితే ఇది వ్యవస్థాగత వివక్ష, మత అసహనానికి దారి తీస్తోంది. ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేష ప్రసంగాలు చేయడం, హింస వంటివి నిత్యకృత్యమయ్యాయి. ముస్లింల ఇళ్లను బుల్డోజర్లతో నేలమట్టం చేస్తున్నారు. గో రక్షణ పేరుతో ముస్లిం మైనారిటీలపై దాడులు చేస్తూ హతమారుస్తున్నారు. మోడీ ప్రభుత్వం భారతదేశాన్ని మత ప్రాతిపదికన ఎలా విభజిస్తోందో దీనిని బట్టి అర్థమవుతోంది. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక, రాజకీయ, దౌత్యపరమైన సవాళ్లను పరిష్కరించడంలో విఫలమవుతున్న మోడీ ప్రభుత్వం ఇప్పుడు పూర్తిగా హిందూత్వపై ఆధారపడుతోంది. ఇలాంటి కీలక తరుణంలో 140 కోట్ల మంది భారతీయుల భవిష్యత్తు ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది.

గాంధీ హత్యపై పాఠ్యాంశం అనవసరం

కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌

రాజ్యసభలో విద్యా మంత్రిత్వశాఖ పనితీరుపై చర్చకు ప్రతిస్పందనగా వివరణ

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనపై ప్రతిపక్షాల విమర్శలు

భారత్‌-పాకిస్తాన్‌ భద్రతా ఏర్పాట్లను దెబ్బతీసేలా అదానీ గ్రూప్‌కు ప్రాజెక్టా?



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

జాతిపిత మహాత్మా గాంధీ హత్యపై పాఠ్యాంశం అవసరం లేదని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ అన్నారు. గాంధీ ఎలా చనిపోయారో దేశంలోని ప్రతి ఒక్కరికీ తెలుసునని, దానిని మళ్లీ మళ్లీ బోధించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. "గాంధీ హత్యను సిలబస్‌ నుంచి తొలగించారని ఆరోపణలు వచ్చాయి. ఈ సంఘటనను 2005లో సిలబస్‌లో చేర్చారు. మీరు దాని గురించి ఆలోచిస్తే, వారు ఎందుకు అలా చేశారో మీకు అర్థమవుతుంది. గాంధీజీ ఎలా హత్యకు గురయ్యారో అందరికీ తెలుసు. దాన్ని మళ్ళీ ఒక సబ్జెక్ట్‌గా చేయడం సరైనదేనా?" అని అన్నారు. రాజ్యసభలో విద్యా మంత్రిత్వ శాఖ పని గురించి జరిగిన చర్చలకు ప్రతిస్పందనగా విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ నుంచి ఈ వింతైన వివరణ వచ్చింది. దేశ సమగ్రతకు లేదా పాలక ప్రభుత్వానికి విరుద్ధమైనదేదీ సిలబస్‌లో ఉండదని విద్యా మంత్రి అన్నారు. హిందీ భాషను రుద్దడానికి కేంద్ర ప్రభుత్వం ఎప్పటికీ ప్రయత్నించదని ధర్మేంద్ర ప్రధాన్‌ పేర్కొన్నారు. "భాషా వైవిధ్యాన్ని తిరస్కరించే వారు ఇటువంటి ఆరోపణలు చేస్తారు. ప్రభుత్వం షెడ్యూల్‌ చేయబడిన 22 భాషలనూ సమానంగా చూస్తుంది. భారత్‌ పుస్తక యోజన కింద 22 భాషల్లో 1,000 పాఠ్యపుస్తకాలను ప్రచురించాలని ప్రణాళిక చేశాం. దీన్ని ఏ భాషపైనా ఎలా రుద్దవచ్చో నాకు అర్థం ...11లో

సహాయక చర్యల్లో రోబో

డేంజర్‌ జోన్‌గా మారిన ఘటనాస్థలం

మల్లెల తీర్థం, నల్లవాగు నుంచి పారుతున్న నీరు

టన్నెల్‌లో సహాయక చర్యలకు ఆటంకంగా టీబీఎం మిషన్‌

కనిపించని మిగతా కార్మికుల ఆచూకీ

ఆందోళనలో బాధిత కుటుంబాలు

నవతెలంగాణ - మహబూబ్‌నగర్‌ ప్రాంతీయ ప్రతినిధి/ అచ్చంపేట

ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో గల్లంతైన కార్మికులను అటానమస్‌ హైడ్రాలిక్‌ పవర్డ్‌ రోబో సాంకేతిక యంత్రాల ద్వారా వెలికితీసే పనులను ముమ్మరం చేశారు. చివరన పైకప్పు నుంచి వాటర్‌ ఫాల్స్‌ మాదిరి నీరు వచ్చి చేరుతోంది. నీటితోపాటు రాళ్లు, మట్టి రెస్క్యూ టీంకు ఆటంకంగా మారాయి. టీబీఎం మిషన్‌ దగ్గర డేంజర్‌ జోన్‌గా ఉంది. ముఖ్యంగా మల్లెల తీర్థం, మల్లెవాగు, నల్ల కాలువ నుంచి నీటి ఊట అధికమై పనులకు ఆటంకం కలిగిస్తోంది. విద్యుత్‌కు అరగంట అంతరాయం ఏర్పడినా సొరంగం చెరువును తలపిస్తోంది. ఇనుప టీబీఎం మిషన్‌ ఉండటం వల్ల ముందుభాగంలో కార్మికుల ఆచూకీకి కష్టతరమవుతోంది. ఈ నేపథ్యంలో అటానమస్‌ హైడ్రాలిక్‌ పవర్డ్‌ రోబో యంత్రాలను మంగళవారం సాయంత్రం నుంచి వినియోగిస్తున్నారు. మట్టిని కన్వేయర్‌ బెల్ట్‌కు వేయడం, కార్మికుల ఆచూకీ కనుకోవడంతోపాటు బలమైన రాళ్లను వెలికి తీయడం వంటి పనులు రోబో చేస్తోంది. మరోవైపు 19 రోజులైనా మిగతా కార్మికుల ఆచూకీ కనబడకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



దేంజర్‌జోన్‌గా మారిన ప్రమాద స్థలం..

ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో ప్రమాద స్థలం డేంజర్‌ జోన్‌గా మారింది. ఉబికి ...11లో

వాస్తవాలకు భిన్నంగా గవర్నర్ ప్రసంగం

- ప్రజావ్యతిరేక విధానాలను ప్రభుత్వం కొనసాగించేలా ఉంది : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయసభలనుద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేసిన ప్రసంగం వాస్తవాలకు భిన్నంగా ఉందనిసీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించే విధంగా ఉన్నదని భావిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరు గ్యారెంటీల్లో మొదటిది మహిళలకు రూ.2500 అమలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, దళిత కుటుంబానికి రూ.12 లక్షలు, ఇల్లులేని పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి హామీలు ఈ ఏడాది కూడా అమలు కాని పరిస్థితి కనపడుతున్నదని తెలిపారు. ఈ ప్రసంగంలో రెండు లక్షల ఉద్యోగాల ప్రస్తావన లేదని పేర్కొన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ పూర్తికాలేదని వివరించారు. విద్యా వైద్యానికి రంగాల అభివృద్ధిపై స్పష్టత లేదని తెలిపారు. రాష్ట్రంలో గత దశాబ్ద కాలంగా 15 వేల పరిశ్రమలు మూతపడ్డాయని పేర్కొన్నారు. వాటిపై ప్రత్యేక దృష్టి పెడదామనీ, గతేడాది నుంచి కేంద్రం, రాష్ట్రం చెపుతున్నప్పటికీ అందుకు తగ్గ చర్యల్లేవని తెలిపారు. 13 లక్షల మంది రైతులు పాసు పుస్తకాల కోసం ఎదురుచూస్తున్నారనీ, భూ సమస్యల పరిష్కార అంశం వివరించలేదని పేర్కొన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వాటా, విభజన చట్టం అమలు, ఇచ్చిన హామీల అమలుపై కేంద్ర బడ్జెట్‌లో ఎలాంటి ప్రతిపాదనలు లేకపోయినా బీజేపీ ప్రభుత్వ వైఖరిపై గవర్నర్ ప్రసంగంలో ఎలాంటి ప్రస్తావన లేదని విమర్శించారు.ధరణిని భూమాతగా పేరు మార్చినా భూ సమస్యలు పరిష్కారం కాలేదని జాన్‌వెస్లీ తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో ఫ్యూచర్ సిటీ పేరుతో పెద్దఎత్తున మాయాజాలాన్ని సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. దావోస్ పర్యటన ద్వారా రూ.1.70 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వస్తాయని చెప్తున్నారని తెలిపారు. వాస్తవానికి ఫ్యూచర్ సిటీ పరిధిలోని రైతుల భూములన్నింటినీ కార్పొరేట్ సంస్థలకు అప్పగించి, రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా రూ.కోట్లు సంపాదించేట్టుగా ఉన్నదని వివరించారు. వారి భూములను ఆక్రమిస్తుంటే పెట్రోల్ పోసుకుని కలెక్టర్ కార్యాలయం ముందు రైతు ఆత్మహత్యాయత్నం వంటి ఘటనలు రైతుల వ్యతిరేకతను స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. అందుకే అబ్దుల్ కలాం గురించి చెప్తూ 'కలలు కనండి, అవి ఆలోచనలుగా మారుతాయి. అవి కార్యాచరణగా మారుతాయి'అని చెప్పి ముగింపు చేశారని వివరించారు. కానీ రాష్ట్రంలో పాలన చూస్తే కలలు కలలుగానే మిగిలిపోయే పరిస్థితి ఉంది తప్ప, శ్రామిక వర్గాలకు, సామాజిక తరగతులకు న్యాయం, అభివృద్ధి జరుగుతుందనే స్పష్టత గవర్నర్ ప్రసంగంలో లేదని విమర్శించారు. బడ్జెట్ ప్రవేశపెట్టే సందర్భంలోనైనా ఈ అంశాలన్నిటినీ పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బడ్జెట్ ప్రతిపాదనలను చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

19న రాష్ట్ర బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)

మరోసారి బీఏసీ సమావేశమై నిర్ణయం తీసుకుందామని అధికార పక్షం సూచించింది. ప్రభుత్వ వైఖరిని ప్రతిపక్షాలు తప్పుపట్టాయి. ప్రజా సమస్యలపై చర్చించేందుకు పనిదినాలను పొడిగించాలని కోరాయి. బుధవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన బీఏసీ సమావేశమైంది. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. బీఆర్ఎస్ నుంచి హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, బీజేపీ నుంచి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, సీపీఐ పక్షనేత కూనంనేని సాంబశివరావు, ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ హాజరయ్యారు. ఈ నెల 27 వరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. 19న ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. 14న హోలీ పండుగ, 16న ఆదివారం సెలవు దినాలుగా ప్రకటించారు. 17న ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధతపై చర్చించనున్నారు. 18న బీసీ కులగణన, రిజర్వేషన్లపై చర్చ జరగనుంది. 21న బడ్జెట్‌పై చర్చను ప్రారంభిస్తారు. మూడు రోజుల పాటు పద్దులపై చర్చ జరుగనుంది. 27న ద్రవ్యవినిమయ బిల్లుకు ఆమోదం తెలపనుంది. అయితే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు తొలిరోజు హాజరైన ప్రతిపక్ష నేత కేసీఆర్...ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించిన వెంటనే అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా కీలకమైన బీఏసీ సమావేశానికి హాజరు కావాల్సిన ఆయన ముఖం చాటేశారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయాక కేసీఆర్ కేవలం మూడే సార్లు అసెంబ్లీకి హాజరయ్యారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయడానికి ఒకసారి...గత ఏడాది బడ్జెట్ సందర్భంగా మరోసారి హాజరైన కేసీఆర్.. ఇప్పుడు బడ్జెట్ సందర్భంగా హాజరయ్యారు.

అది కాంగ్రెస్ ప్రెస్‌మీట్

(మొదటిపేజీ తరువాయి)



మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగంలో ప్రజలకిచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీల ప్రస్తావన లేదని తెలిపారు. గాంధీభవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా గవర్నర్ ప్రసంగముందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పంటలు ఎండిపోతున్నాయనీ, రైతాంగం ఆందోళనలో ఉందన్నారు. 480 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారనీ, వారికి భరోసా ఇచ్చే మాట ఆ ప్రసంగంలో లేకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో 25 శాతం నుంచి 35 శాతానికి మించి రైతు రుణమాఫీ కాలేదని చెప్పారు. రుణమాఫీ అయినట్టు ఆ ప్రసంగంలో చెప్పడం ద్వారా గవర్నర్ స్థాయిని దిగజార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలన కాలంలో ఉన్న రైతుబంధు ఆపేసి అబద్ధాలు చెప్పారని విమర్శించారు. కేసీఆర్ మీద ద్వేషంతో మేడిగడ్డను రిపేర్ చేయకపోవటంతో పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. చేతగాని రేవంత్ రెడ్డి పాలనలో రైతులు నీళ్ళు లేక అవస్థలు పడుతున్నారని విమర్శించారు. సాగునీటి సంక్షోభం, రైతుల ఇబ్బందుల ప్రస్తావన గవర్నర్ ప్రసంగంలో ఎందుకు లేదని ప్రశ్నించారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర సచివాలయంలో 20శాతం కమీషన్ లేనిదే బిల్లులు రావడంలేదని చెప్పారు. వీరికి విజన్ లేదు, మన్ను లేదు, ఓన్లీ 20శాతం కమిషనేనని ఎద్దేవా చేశారు. గురుకులాల్లో అధ్వాన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. దీని గురించి గవర్నర్ ప్రసంగంలో ఒక్కమాట లేదన్నారు. పదేండ్ల పాలనలో రూ. 4.17 లక్షల కోట్ల అప్పులు చేశారంటూ కేసీఆర్ ప్రభుత్వంపై ఎగిసిపడ్డారు కదా? మరి కాంగ్రెస్ సర్కార్ ఒకే ఏడాదిలో రూ. 1.62 లక్షల కోట్ల అప్పు చేయటాన్ని ఏమనాలని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి పాలన వల్ల వరి ధాన్యం ఉత్పత్తి పెరిగిందని అబద్ధాలు చెపుతున్నారన్నారు. కుంభకోణాలు, 30 శాతం ల్యాండ్ డీలింగ్‌లు, కాంట్రాక్టర్ల నుంచి 20శాతం కమీషన్లు దండుకోవటంలో అధికార పార్టీ నేతలు బిజీగా ఉన్నారని విమర్శించారు. పదవులు కాపాడుకోవటానికి ఢిల్లీకి మూటలు పంపుతున్నారని ఆరోపించారు. స్వయంగా కాంగ్రెస్ పార్టీ నాయకులే కమీషన్లు లేకుండా తమ నాయకులు పని చేయట్లేదని చెపుతున్నారని విమర్శించారు. దావోస్ నుంచి గతంలో చేసుకున్న ఒప్పందాలకు సంబంధించి శ్వేతపత్రం విడుదలకు సిద్ధంగా ఉన్నారా? అని సీఎంను ప్రశ్నించారు. స్వచ్ఛ బయో కంపెనీలో సీఎం సోదరుడు పెట్టుబడి పెడుతున్నారన్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ మొత్తం పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగమంతా పచ్చి అబద్ధమనీ, ఇది ఆయన్ను కూడా మోసం చేయడమేనని తెలిపారు. బీసీ కులగణనను ప్రశ్నించిన ఒక ఎమ్మెల్సీని కాంగ్రెస్ పార్టీ తొలగించిందని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ తల్లిని సెక్రటరియట్‌లో, రాహుల్ తండ్రి విగ్రహాన్ని సెక్రటేరియట్ ముందు పెట్టారనీ, వాటిని రెండేండ్ల తర్వాత ప్యాక్ చేసి గాంధీభవన్‌కు పంపుతామని చెప్పారు.

దీటుగా స్పందించాలి

- సభలో సమన్వయంతో వ్యవహరించాలి
- సబ్జెక్టుల వారీగా బాధ్యతలు తీసుకుని మాట్లాడాలి : సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

శాసనసభలో సమన్వయంతో వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికార పార్టీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్షాల విమర్శలకు ధీటుగా సమాధానం చెప్పాలని ఆయన సూచించారు. అందుకోసం సబ్జెక్టుల వారీగా పని విభజన చేసుకోవాలనీ, దానికి అనుగుణంగా స్పందించాలన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశంలో రేవంత్ మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యేలందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రతిపక్షాలు గందరగోళం చేసే ప్రయత్నం చేస్తాయనీ, సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజా ప్రభుత్వంలో ఇవి రెండో పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలని చెప్పారు. అత్యంత కీలకమైనవిగా గుర్తించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15నెలల్లో ప్రజాప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై పూర్తిగా చర్చించుకునేందుకు ఈ సమావేశాల్లో అవకాశముందని అన్నారు. అందువల్ల సభ్యులందరూ కచ్చితంగా సభకు రావాల్సిందేనన్నారు. అంశాల వారీగా ప్రిపేర్ అయి సభకు రావాలని తెలిపారు. హాజరుపై ప్రభుత్వ విప్‌లు పర్యవేక్షించాలని ఆదేశించారు. కొందరు ఎమ్మెల్యేలు అసెంబ్లీని నిర్లక్ష్యం చేస్తున్నారని ఈ సందర్భంగా సీఎం అసహనం వ్యక్తం చేశారు. హాజరైతేనే సభలో ఏం జరుగుతుందో తెలుస్తుందనీ, సోషల్ మీడియాలో ఎమ్మెల్యేలు యాక్టివ్‌గా ఉండాలని కోరారు. త్వరలోనే జిల్లాల వారీగా ఎమ్మెల్యేలతో సమావేశమవుతానని చెప్పారు.

ఎమ్మెల్యేలు, విప్‌లపై సీఎం సీరియస్

ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈసందర్భంగా సీరియస్ అయ్యారు. శాసనసభలో ప్రతిపక్షాలను ఎదుర్కొనే విషయంలో నిర్లక్ష్య వైఖరిపై ఆయన వారికి క్లాస్ తీసుకున్నట్టు తెలిసింది. గవర్నర్ ప్రసంగం తర్వాత సీఎం ఛాంబర్‌కు వెళ్లిన ఎమ్మెల్యేలు, విప్‌లు సీఎం ఆగ్రహానికి గురయినట్టు వినికిడి. గవర్నర్ ప్రసంగం సందర్భంగా బీఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తుంటే మీరేం చేస్తున్నారు? మనం లిక్కర్ పాలసీ తెచ్చాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లిక్కర్ పాలసీ లేకుండా చేసి, ఆ పార్టీ నేతలు కోట్ల రూపాయలను వెనకేసుకోవడానికి దోహదపడింది. ఈ విషయాన్ని శాసనసభలో ఎండగట్టాలని అని రేవంత్ సూచించారు. ప్రభుత్వ విప్‌లు పని తీరు మార్చుకోవాలనీ, సభ్యులకు అన్ని విషయాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. అందరూ అన్ని విషయాలు మాట్లాడాలనుకోకండి. ఒక్కొక్కరు ఒక్కో విషయాన్ని ఎంపిక చేసుకోండి. ఫ్లోర్ కో ఆర్డినేషన్ పకడ్బందీగా చేయండి' అని సూచించారు. ఈ సందర్భంగా బయటకు వెళ్లిన నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిపై సీఎం అసహనం వ్యక్తం చేశారు.

ఆరు నెలల్లో సమస్యలు పరిష్కరించండి

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆవేదన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగుల పెండింగ్ సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం బుధవారం హైదరాబాద్‌లోని నాంపల్లి కేంద్ర కార్యాలయంలో జరిగింది. కాంగ్రెస్ అధికారంలోకొచ్చిన ఏడాదిన్నర కాలంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ గతంలో లాగానే ఇప్పుడు కూడా రెండేండ్ల నుంచి మెడికల్, జీపీఎఫ్, లీవ్ జీతం తదితర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని ఉప ముఖ్యమంత్రి చెప్పిన నేపథ్యంలో 17 నెలలుగా ఓపిక పట్టామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి స్వయంగా చెప్పినా కొంతమంది మంత్రులు, ఐఏఎస్ అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము సర్కార్ వద్ద ఉంచిన 57 డిమాండ్లలో మెజార్టీ సమస్యలు ఆర్థిక అంశాలకు సంబంధం లేనివేనని గుర్తు చేశారు. అయినా ఆయా శాఖలకు చెందిన మంత్రులు, అధికారులు పరిష్కారానికి చొరవ చూపడం లేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో బదిలీ అయిన ఉద్యోగులను తిరిగి తమ తమ స్థానాలకు ఎందుకు పంపడం లేదని ప్రశ్నించారు. వీఆర్ఏ వ్యవస్థ రద్దయినప్పుడు వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిన వారిని తిరిగి నియమించే క్రమంలో వారికి రాత పరీక్ష నిర్వహించాలనడం సర్కార్ అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించి గత రెండేండ్లుగా రూ.8వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని ఆందోళన చేశారు. వారి సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన మంత్రి వర్గ ఉపసంఘం ఆరు నెలలు గడిచినా ఒక్క సారి కూడా ఎందుకు సమావేశం కాలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 186 జీవో ద్వారా 11 మంది సభ్యులతో ఏర్పాటు చేసిన ట్రస్ట్‌కు అతీగతి లేదని విమర్శించారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ 1 నుంచి 30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలు అందజేస్తామని ప్రకటించారు. అప్పటికీ సర్కార్ స్పందించకుంటే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా తాము సర్కార్‌కు అండగా ఉంటామనీ, అదే సందర్భంలో ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పదేండ్ల కష్టాల నుంచి విముక్తి కోసం కాంగ్రెస్ సర్కార్‌ను తెచ్చుకున్నా తమ సమస్యల పరిష్కారంలో ఎలాంటి మార్పు రాలేదని వాపోయారు. అన్ని ఆస్పత్రుల్లోనూ అమలయ్యేలా హెల్త్ కార్డులకు తాము కంట్రిబ్యూషన్ చెల్లిస్తామని చెప్పినా సర్కార్ స్పందించడం లేదని ఆరోపించారు. 19 నెలలైనా పీఆర్సీ రిపోర్టును ఎందుకు తెప్పించుకోవడం లేదని ప్రశ్నించారు. ఆర్థిక అంశాలతో సంబంధం లేని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మెన్లు చావ రవి, వి.దామోదర్‌రెడ్డి, జి.సదానందగౌడ్, జి.సురేష్ కుమార్, జి.జ్ఞానేశ్వర్, ఎన్. తిరుపతి, మధుసూదన్‌రెడ్డి, టి.లింగారెడ్డి, జి.దామోదర్‌రెడ్డి, కే.లక్ష్మణ్, ఎన్.శ్రీధర్, డిప్యూటీ సెక్రెటరీ జనరల్ ఎస్ఎం. హుస్సేని (ముజీబ్) ఏ.సత్యనారాయణ, జి.స్థితప్రజ్ఞ, వైస్ చైర్మెన్ చంద్రమోహన్, అంజిరెడ్డి తిప్పర్తి యాదయ్య, ఎం.చంద్రశేఖర్‌గౌడ్, పర్వ సత్యరాయణ, ఏ.సత్యనారాయణరెడ్డి, ఫైనాన్స్ సెక్రెటరీ కస్తూరి వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి శ్యాం, కార్యదర్శులు ఎం.సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యూకేజీ విద్యార్థిని స్కేల్‌తో కొట్టిన టీచర్

- ప్రశ్నించిన తల్లిదండ్రులను కులం పేరుతో దూషణ
- బోడుప్పల్‌లో ఘటన

నవతెలంగాణ-బోడుప్పల్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని ఓ ప్రయివేటు పాఠశాలలో యూకేజీ విద్యార్థి బి.ఇషాన్ భార్గవ్ వీపుపై టీచర్ స్కేల్‌తో కొట్టడంతో అతనికి గాయమైంది. బాలుడు ఇంటికి వెళ్లిన అనంతరం తల్లిదండ్రులకు చెప్పడంతో వారు స్కూల్ ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. అయితే జరిగిన విషయంపై చింతించాల్సిన ప్రిన్సిపాల్ రాజేందర్.. కులం పేరుతో తమను దూషించాడని విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపించారు. అంతేకాకుండా విద్యార్థి తండ్రి బొమ్మకు శ్రీశైలం కూడా అదే విద్యాసంస్థ (వేరే బ్రాంచ్)లో పని చేస్తుండటంతో అతన్ని ఇబ్బందులు పెట్టాలని ఆ బ్రాంచ్ హెడ్‌కు చెప్పాడని వారు తెలిపారు. దాంతో చేసేదేమీ లేక బాధితులు మీడియాను ఆశ్రయించారు.

ప్రిన్సిపాల్ వైఖరిని ఖండించిన విద్యార్థి, దళిత సంఘాలు

విద్యార్థులను కొట్టొద్దనే నిబంధనను పక్కన పెట్టి ఇలా దాడులు చేయడం ఏంటని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఆర్.సంతోష్ రాథోడ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్ ప్రశ్నించారు. పాఠశాల ప్రిన్సిపాల్‌పై అనేక సార్లు ఫిర్యాదులు వచ్చినా అతనిలో ఎలాంటి మార్పూ రావడం లేదన్నారు. పాఠశాలలో ఎలాంటి మౌలిక సదుపాయాలూ లేవని తెలిపారు.

కనీసం గ్రౌండ్ సౌకర్యం కూడా లేదని, వందలాది మంది విద్యార్థులకు సరిపడా బాత్‌రూమ్‌లు లేవని అన్నారు. ఇన్ని ఇబ్బందులున్నా విద్యా శాఖ అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. టీచర్ కొట్టడంపై తల్లిదండ్రులు అడిగితే కులం పేరుతో దూషించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మైసగళ్ల శివ డిమాండ్ చేశారు.





[redacted]

ఊపర్ షేర్వానీ.. అందర్ పరేషానీ

(మొదటి పేజీ తరువాయి)

అంశాలున్నాయి. ఈ ప్రభుత్వం మీది. నేను కస్టోడియన్‌ను మాత్రమే. సమన్వయం మాత్రమే చేస్తా. అందుకే ప్రభుత్వ ఉద్యోగ మిత్రులకు విజ్ఞప్తి చేస్తున్నా. పైసా పైసా లెక్క మొత్తం మీకే అప్పజెప్తా. ఏది ఎలా పంచాలో మీరే చెప్పండి. నా దగ్గర ఏమీ ఉంచుకోను. ఒక్క పైసా కూడా నా దగ్గర నా జేబులో పెట్టుకోను. నా నెల జీతం కూడా మీకే ఇస్తా. ఎలా పంచాలో మీరే చెప్పండి.'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 1,532 మంది అధ్యాపకులకు ఉద్యోగ నియామక పత్రాల అందజేత కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఎంపికైన అధ్యాపకులకు నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇవాళ ఉద్యోగ నియామక పత్రాలను అందుకుంటున్న అధ్యాపకులందరికీ అభినందనలు చెప్పారు. ఇది ఉద్యోగం మాత్రమే కాదనీ, భావోద్వేగమని అన్నారు. రాష్ట్ర సాధనలో నిరుద్యోగుల పాత్ర క్రియాశీలంగా ఉందన్నారు. కానీ గత ప్రభుత్వం నిరుద్యోగుల విషయంలో చిత్తశుద్ధి చూపలేదని విమర్శించారు. ఉద్యోగాల భర్తీలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. కేసీఆర్ కుటుంబ ఉద్యోగాలను ఊడగొడితే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయంటూ ఎన్నికల్లో తాను చెప్పానని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వ ఏర్పాటులో నిరుద్యోగుల కృషి, పట్టుదల ఉందని చెప్పారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 12 ఏండ్లు వథా అయ్యిందని అన్నారు. అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 57,946 ఉద్యోగాలను భర్తీ చేశామనీ, ఆ సంతృప్తి ఉందని వివరించారు. ఏడాదిలోనే ఇన్ని ఉద్యోగాలిచ్చిన రాష్ట్రం ఉందా?అని ప్రశ్నించారు.

ప్రపంచంతో పోటీ పడాలి

ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యాప్రమాణాలను పెంచేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మించబోతున్నామని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇటీవలే 55 యంగ్ ఇండియా సమీకృత గురుకులాల కోసం రూ.11 వేల కోట్లు కేటాయించామని వివరించారు. విద్యార్థులు, నిరుద్యోగుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించామన్నారు. విద్యార్థులకు నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం లేకుంటే ఉద్యోగాలు రాబోవని స్పష్టం చేశారు. చదువుతోపాటు నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం ఉండాలన్నారు. ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చి దిద్దాల్సిన అవసరముందన్నారు. వచ్చే ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతోపాటు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ అథారిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు.



చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. క్రికెట్‌లో రాణించిన సిరాజ్ కోసం నిబంధనలను సడలించి ఉద్యోగమిచ్చామనీ, బాక్సింగ్‌లో రాణించిన నిఖత్ జరీన్‌కు డీఎస్పీ ఉద్యోగం ఇచ్చామనీ, పారాలింపిక్స్‌లో రాణించిన దీప్తి జీవాంజీకి ఇంటి స్థలంతోపాటు ఉద్యోగం ఇచ్చామని గుర్తు చేశారు.

స్రేచర్ నుంచి స్ట్రెచర్‌కు పరిమితం

కొంతమంది స్టేచర్ గురించి అని మాట్లాడుతున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. స్టేచర్ ఉందని విర్రవీగినవారు స్ట్రెచర్ మీదకు వెళ్లారనీ, (పరోక్షంగా కేసీఆర్‌నుద్దేశించి) తర్వాత మార్చురీకి పోతారని చెప్పారు. స్టేచర్ అనేది స్థానానికి తప్ప వ్యక్తులకు ఉండబోదని స్పష్టం చేశారు. తమకు కేసీఆర్ వారసత్వంగా ఇచ్చింది అప్పులు, తప్పులు మాత్రమేనని అన్నారు. రాష్ట్రానికి ప్రతినెలా ఆదాయం రూ.18,500 కోట్లు వస్తుందన్నారు. అందులో ఉద్యోగుల జీతభత్యాలకు రూ.6,500 కోట్లు, కేసీఆర్ చేసిన అప్పులు, వడ్డీలకు రూ.6,500 కోట్లు ప్రతినెలా చెల్లించాలని వివరించారు. మిగిలిన రూ.5.500 కోట్లతో తాము ఇచ్చిన హామీలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఖర్చు చేయాలన్నారు. ఊపర్ షేర్వానీ, అందర్ పరేషానీ అన్నట్టుగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఉందని చెప్పారు. రాష్ట్రానికి కేసీఆర్ ఆర్థికంగా క్యాన్సర్ ఇచ్చారని ఆరోపించారు. వాస్తవాలు చెప్తే రాష్ట్రం దివాళా తీసిందంటూ బీఆర్ఎస్ నాయకులంటున్నారని చెప్పారు. క్యాన్సర్ ముదురుతుంటే వాస్తవాలను చెప్పకుండా ఎన్ని రోజులు దాచిపెట్టాలని ప్రశ్నించారు. తాను వాస్తవాలు చెప్తుంటే దిగిపో దిగిపో?అని మాట్లాడుతున్నారని అన్నారు. 65 సీట్లతో ఐదేండ్లు అధికారంలో ఉండాలని ప్రజలు ఆశీర్వదిస్తే పది నెలలకే దిగిపోవాలంటున్నారని చెప్పారు. రూ.22 వేల కోట్ల ఆదాయం వస్తే ఇచ్చిన హామీలతోపాటు పెండింగ్ బకాయిలు చెల్లించడానికి వీలవుతుందన్నారు. కేసీఆర్ కుటుంబం మొత్తం అబద్ధాలు మాట్లాడుతున్నదని అన్నారు. అబద్ధాల ప్రాతిపదికన తాను రాష్ట్రాన్ని నడపబోనని చెప్పారు. వాస్తవాలను చెప్పి రాష్ట్రాభివృద్ధికి తాను కృషి చేస్తానని వివరించారు. భావితరాల భవిష్యత్ నిర్మాణానికి ఉపాధ్యాయులు, అధ్యాపకులు పునరంకితం కావాలని కోరారు. దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా నిలపాలని విజ్ఞప్తి చేశారు.

కేరళతో పాటు తెలంగాణ అభివృద్ధి కావాలి

దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశ ఆర్థిక భవిష్యత్ విద్యాశాఖతో ముడిపడి ఉందని చెప్పారు. అలాంటి శాఖలో ఉద్యోగ నియామక పత్రాలు అందుకోవడం గొప్పవిషయమన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను గొప్పగా తీర్చిదిద్దాలని కోరారు. విద్యాశాఖకు రూ.21,621 కోట్లు కేటాయించామని వివరించారు. 55 రోజుల్లోనే ఉపాధ్యాయ నియామకాలను పూర్తి చేశామన్నారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల సమస్యను పరిష్కరించి విద్యాశాఖను ప్రక్షాళన చేశామని అన్నారు. విద్యారంగంలో కేరళతోపాటు అభివృద్ధి కావాల్సిన తెలంగాణ అట్టడుగున ఉండడం ఆందోళనకరమని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో 25.50 లక్షల మంది, ప్రయివేటు బడుల్లో 36.87 లక్షల మంది చదువుతున్నారని వివరించారు. సర్కారు బడుల్లో 1,48,449 మంది ఉపాధ్యాయులుంటే, ప్రయివేటులో 1,83,372 మంది పనిచేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులపై రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేస్తున్నామనీ, ప్రయివేటులో రూ.20 వేల నుంచి రూ.30 వేలు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ బడుల కంటే ప్రయివేటు స్కూళ్లు గొప్పవా? అని ప్రశ్నించారు. కానీ ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రమాణాలు పడిపోవడం ఆందోళన కలిగించే విషయమనీ, ఇది తెలంగాణకు అవమానకరమని అన్నారు. సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతున్నదనీ, తల్లిదండ్రుల్లో విశ్వాసం ఉండడం లేదని చెప్పారు. ఎక్కడ లోపం ఉందో ఆలోచించాలనీ, మూలాలను పరిశీలించాలని సూచించారు. విద్యార్థులపై పెట్టేది ఖర్చు కాదనీ, వారి భవిష్యత్‌కు పెట్టుబడి అని వివరించారు. విద్యా ప్రమాణాలను పెంచేందుకు భావోద్వేగంతో ఉద్యోగ బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులు, కళాశాలలను తీర్చిదిద్దాలని అన్నారు. పిల్లల బాధ్యతను ఉపాధ్యాయులు, అధ్యాపకులు చూసుకోవాలని కోరారు. సమస్యలను పరిష్కరించే బాధ్యత తనదని చెప్పారు.

విద్యావ్యవస్థ మార్పు కోసం చర్యలు తీసుకుంటున్నాం : పొన్నం

రాష్ట్రంలో విద్యావ్యవస్థ మార్పు కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పదేండ్లపాటు విద్యావ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఉద్యోగాలను భర్తీ చేయలేదనీ, సకాలంలో వీసీలను నియామించలేదని చెప్పారు. ఇటీవలే వీసీలను నియమించామని గుర్తు చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల పేరుతో ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామని వివరించారు.

వెనుకబడిన ప్రాంతాలకు చెందిన వారికి కొలువులు : సీఎస్ శాంతికుమారి

రాష్ట్రంలో ఇంటర్ విద్యకు సంబంధించి పురుషులు 794 మంది, మహిళలు 498 మంది కలిపి 1,292 మంది జూనియర్ లెక్చరర్లు, పాలిటెక్నిక్ కాలేజీలకు సంబంధించి పురుషులు 177 మంది, మహిళలు 63 మంది కలిపి 240 మంది అధ్యాపకులు కలిపి మొత్తం 1,532 మంది నియామక పత్రాలను అందుకున్నారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి చెప్పారు. వెనుకబడిన ప్రాంతాలకు చెందిన వారు అధ్యాపక కొలువులకు ఎంపికయ్యారని వివరించారు. ఆసిఫాబాద్, మహబూబాబాద్, ములుగు, ఆదిలాబాద్ జిల్లాల్లో మారుమూల ప్రాంతాలకు చెందిన వారు ఉద్యోగాలు పొందారని చెప్పారు. ఇది ఎంతో సంతోషకరమని అన్నారు. నూతన ప్రభుత్వం 57,946 ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు కె కేశవరావు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, మీర్జా రెహమత్ బేగ్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, శ్రీహరి, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బేటీ బచావో.. బేటీ పడావో నినాదం

ప్రచారానికేనా..?

మహిళలకు ఇచ్చిన హామీల అమలులో విఫలం : ఎన్పీఆర్డీ సదస్సులో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి



నవతెలంగాణ - ధూల్ పేట్

కేంద్ర ప్రభుత్వ బేటీ బచావో.. బేటీ పడావో.. నినాదం ప్రచారం కోసమేనా..? అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి ప్రశ్నించారు. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక గ్రేటర్ హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా గౌరవ అధ్యక్షులు పి.శశికల అధ్యక్షతన జియాగూడలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా టి.జ్యోతి మాట్లాడుతూ.. మార్చి 8 అనేది ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక మహిళా పోరాట దినంగా ప్రాచుర్యం పొందిందని చెప్పారు. ముందు తరాలను మరింతగా ప్రేరేపించి పోరాట జెండాను విడవకుండా సమాన హక్కులు, స్వేచ్ఛ కోసం.. ఎలుగెత్తేలా నిలిచిపోయిందని అన్నారు. ఎన్పీఆర్డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య మాట్లాడుతూ.. నూతన ఆర్థిక విధానాల అమలు నేపథ్యంలో ముడిసరుకులకు సహజ వనరుల వేటలో, మార్కెట్ విస్తరణలో భాగంగా మహిళ శ్రమను చౌకగా పొందే దోపిడీ యత్నాల్లోనూ మహిళా దినోత్సవం మరింత పలచగా అయిందన్నారు. సనాతనవాదులంతా పితృస్వామ్య, బ్రాహ్మణీయ విలువలు మరింత బలపడేలా వారి ఎజెండాకు పదును పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కోశాధికారి ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ.. మహిళల హక్కులు, చట్టాలను పాలకులు నిర్వీర్యం చేస్తున్నారన్నారు. హక్కుల సాధనకు మహిళలంతా సంఘటితంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జియాగూడ నవభారత్ సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, ఎన్పీఆర్డీ గ్రేటర్ హైదరాబాద్ సౌత్ జిల్లా ఉపాధ్యక్షులు ఉషా, రాజు, నర్సింగ్‌రావు, జిల్లా నాయకులు దీపికా, ఖాజాల్, అనంతమ్మ లక్ష్మమ్మ కావేరి, జగ్దేవి, సత్య నారాయణ, లక్ష్మణ్, మహిళా సమాఖ్య నాయకులు పునీత, భారతి, భారతీబాయి, భాగ్య, సునీత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా వికలాంగులకు సన్మానించి.. బహుమతులు అందజేశారు.



ప్రత్యేక ఆకర్షణగా

తండ్రి.. కొడుకు.. కూతురు

సైలెంట్‌గా గవర్నర్ ప్రసంగ కాపీ చదువుకున్న కేసీఆర్

అధినేతకు బీఆర్ఎస్ సభ్యుల ఘనస్వాగతం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రతిపక్షనేత కె.చంద్రశేఖర్‌రావు, ఆయన కుమారుడు కె.తారకరామారావు, కూతురు కె.కవిత.. బుధవారం ఒకేసారి శాసనసభలోకి అడుగుపెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 10:55 నిమిషాలకు కేసీఆర్ సభలో అడుగు పెట్టగా..ఆయన వెనకాలే బీఆర్ఎస్ సభ్యులంతా వచ్చారు. కేసీఆర్ ముందువరుసలో తన చైర్‌లో ఆశీనులు కాగా.. సబితా ఇంద్రారెడ్డి పక్కన కేటీఆర్..చివరి నుంచి రెండో వరుసలో కవిత కూర్చున్నారు. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఓవైపు ప్రసంగం చేస్తుండగా.. కేసీఆర్ తన సీట్లో కూర్చొని గవర్నర్ ప్రసంగ కాపీని ఏకాగ్రతతో పూర్తిగా చదివి పక్కన పెట్టేశారు. అంతకుముందు నందినగర్‌లోని ఇంటి నుంచి కేసీఆర్ అసెంబ్లీకి ఉదయం పది గంటలకే చేరుకున్నారు. దీంతో ఆయన ఆరు నెలల తర్వాత సభలో అడుగు పెట్టినట్టు అయింది. అసెంబ్లీలోకి వెళ్లే ప్రధాన ద్వారం వద్ద మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్, కవిత, ఇతర బీఆర్ఎస్ సభ్యులు పుష్పగుచ్ఛాన్ని అందజేసి సాదరంగా ఆహ్వానించారు. లోనికెళ్లాక తన చాంబర్‌లో కేసీఆర్ కూర్చున్నారు. అక్కడ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సభలో ఎలా వ్యవహరించాలనే దానిపై దిశానిర్దేశం చేశారు.



(మొదటి పేజీ తరువాయి)

రైతే రాజు

ఇస్తున్నట్టు తెలిపారు. రైతులకు సాగులో ఉపయోగపడేలా అత్యాధునిక ఆడియో, వీడియో విజువల్‌ను సమకూరుస్తూ 566 రైతు వేదికలను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. సన్నరకం వరి ధాన్యానికి రూ.500 బోనస్ కింద రైతులకు రూ.1,206.44 కోట్లు విడుదల చేశామన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు రైతు సంక్షేమ కమిషన్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. కృష్ణా జలాల వాటా కోసం ట్రిబ్యునల్-2 సమక్షంలో వాదనలను రాష్ట్ర ప్రభుత్వం వినిపించిందన్నారు.

మహిళలకు సాధికారత, రక్షణ, సమాన అవకాశాలు

సమాజం పురోగతి సాధించాలంటే మహిళలకు సాధికారత, రక్షణ, సమాన అవకాశాలు అత్యావశ్యకమని గుర్తించి తమ ప్రభుత్వం ముందుకెళ్తున్నదని గవర్నర్ తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.5005.95 కోట్లు ఆదా అయ్యాయనీ, ఈ పథకం గేమ్ ఛేంజర్‌గా నిలిచిందని కొనియాడారు. మహిళా మిషన్ పాలసీ కింద లక్ష కోట్ల ఆర్థిక సహాయంతో కోటి మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను తయారు చేస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలకు క్యాంటీన్ల నిర్వహణ, స్కూల్ యూనిఫాం తయారీ, సోలార్ విద్యుత్ తయారీ వంటి బాధ్యతలను అప్పగించామనీ, ఆర్టీసీ అద్దె బస్సులకు ఓనర్లను చేశామని వివరించారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం 50 లక్షల పేద కుటుంబాలకు ప్రయోజనకరంగా ఉందని చెప్పారు. రూ.500కే గ్యాస్ పథకం కింద 43 లక్షల కుటుంబాలకు మేలు జరుగుతున్నదనీ, ఆ కుటుంబాలు ఇప్పటి దాకా రూ.433.2 కోట్ల సబ్సిడీని పొందాయని వివరించారు.

ఆరోగ్యం ప్రాథమిక హక్కుగా విశ్వసిస్తున్నాం

ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ అనేది సదుపాయం మాత్రమే కాదనీ, పౌరుల ప్రాథమిక హక్కుగా తమ ప్రభుత్వం విశ్వసిస్తున్నదని గవర్నర్ తెలిపారు. ఆర్థికంతో సంబంధం లేకుండా నాణ్యమైన వైద్యం అందించడమే తమ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే ఆరోగ్యశ్రీ పథకం కింద కవరేజీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. ఆరోగ్య శ్రీ కింద కొత్తగా 163 రకాల వైద్యసేవలను చేర్చామని తెలిపారు.

క్రీడల్లో గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతాం

యంగ్ ఇండియా యూనివర్శిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల(ఏటీసీ) ద్వారా ప్రపంచంతో పోటీపడేలా యువతలో నైపుణ్యాలను పెంపొందిస్తామని గవర్నర్ చెప్పారు. సివిల్ సర్వీస్‌కు ప్రిపేర్ అవుతున్న అర్హులైన పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఆర్థిక సహకారమందించేందుకు రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం తీసుకొచ్చామని చెప్పారు. నిష్పక్షపాత, సత్వర, సమర్థమైన రిక్రూట్‌మెంట్ విధానాలతో గతేడాది కాలంలోనే 55 వేల మంది కొత్తగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన విషయాన్ని గుర్తుచేశారు. క్రీడల్లో గ్లోబల్ లీడర్‌గా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదనీ, ప్రపంచస్థాయి అథ్లెట్లను తయారు చేయడానికి యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు బిల్లు ఆమోదం పొందిందని తెలిపారు. సమగ్ర స్పోర్ట్స్ పాలసీ రూపొందించామన్నారు. 36 క్రీడా విభాగాల్లో సీఎం కప్-2024ను నిర్వహించామనీ, 2.96 లక్షల మంది అథ్లెట్లు పాల్గొన్నారని తెలిపారు.

డైట్ చార్జీలు 40 శాతం, కాస్మెటిక్ చార్జీలు 200 శాతం పెంచాం

గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు డైట్‌చార్జీలను 40 శాతం, కాస్మెటిక్ చార్జీలను 200 శాతం పెంచిన విషయాన్ని గవర్నర్ గుర్తుచేశారు. మెనూ చార్జీలను గణనీయంగా పెంచి పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ద్వారా అత్యున్నత విద్య అందించబోతున్నామని చెప్పారు. విద్యావ్యవస్థను మరింత మెరుగుపర్చేందుకు విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించేందుకే అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, పర్యవేక్షణలో మహిళా సంఘాలు కీలక భూమిక పోషిస్తున్నాయన్నారు.

సామాజిక న్యాయం అభివృద్ధికి పునాది

సామాజిక న్యాయం తెలంగాణ అభివృద్ధి విధానానికి పునాదిగా ఉందని గవర్నర్ నొక్కి చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే నిర్వహించామని తెలిపారు. ఆ సర్వే ద్వారా వచ్చిన సమగ్రమైన డేటాతో న్యాయబద్ధ, సమ్మిళిత సమాజాన్ని నిర్మించే దిశగా అడుగులు వేస్తామని చెప్పారు. రాజకీయ, సామాజిక అసమానతలను తొలగించడంలో ఈ సర్వే దోహదపడుతుందని ఆకాంక్షించారు. ఆ సర్వే ఆధారంగానే సామాజిక న్యాయం అందించే దిశగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కోసం బిల్లును ప్రతిపాదించామన్నారు. దీనిద్వారా బీసీలకు విద్యా, ఉపాధి, పాలనలో మెరుగైన అవకాశాలు లభిస్తాయన్నారు. జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ సిఫారసుల ఆధారంగా ఎస్సీ ఉపకులాల వర్గీకరణ బిల్లును సైతం ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. దీని ద్వారా అత్యంత అణగారిన వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ ఎస్సీ కులాలకు రిజర్వేషన్ ప్రయోజనాలను మరింత న్యాయోచితంగా, సమతుల్యంగా అందించడమే బిల్లు లక్ష్యమని స్పష్టం చేశారు. ఫిబ్రవరి నాలుగో తేదీని తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవంగా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం, చేనేత కార్మికుల కోసం తెలంగాణ చేనేత అభయ హస్తం పథకాలను అమలు చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. ప్రతి సామాజిక తరగతిని పరిగణనలోకి తీసుకోవడమే భవిష్యత్ తెలంగాణ విజన్‌గా ఉందని చెప్పారు.

ఐటీ, ఎలక్ట్రానిక్స్ ఆవిష్కరణల్లో తెలంగాణ అగ్రగామి

ప్రపంచ పెట్టుబడుదారులను ఆకర్షించడం, మౌలిక సదుపాయాలు కల్పించడం, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధాన్ని సులభతరం చేయడం వంటి అంశాలకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నొక్కి చెప్పారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ)పై ప్రత్యేక దృష్టి సారించామనీ, వాటి కోసం ప్రత్యేక ఎకో సిస్టమ్‌ను తీసుకు రాబోతున్నామని తెలిపారు. వాటికి అనుబంధంగా ఫార్మాసూటికల్స్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, పునరుత్పాదక ఇంధనం, ఆహార ప్రాసెసింగ్ యూనిట్ల కోసం ప్రత్యేక పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక ఫోరమ్‌లో పాల్గొనడం ద్వారా రూ.1,78,950 కోట్ల పెట్టుబడులను ఆకర్షించామనీ, వాటి ద్వారా 49,500 మందికి ఉద్యోగాలు రాబోతున్నాయని వివరించారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ ఆవిష్కరణలలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా కొనసాగుతున్నదని సగర్వంగా చెప్పారు. ఏఐ, డేటా సెంటర్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా తన హోదాను తెలంగాణ సుస్థిరం చేసుకుంటున్నదని కొనియాడారు. జౌళి పరిశ్రమను పటిష్టపరిచేందుకు, మరమగ్గాల కార్మికుల అభ్యున్నతి కోసం రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడలో రూ.50 కోట్లతో యార్న్ డిపోను ఏర్పాటు చేశామన్నారు. స్వయం సహాయ సంఘాల్లోని 64.70 లక్షల మంది మహిళలకు ఏటా రెండు చీరలను ఇస్తున్నదని తెలిపారు.

తెలంగాణను పర్యాటక గమ్యస్థానంగా మారుస్తాం

తెలంగాణను పర్యాటక గమ్యస్థానంగా రూపొందించడానికి చాలా అవకాశాలున్నాయని గవర్నర్ తెలిపారు. పర్యాటక సర్క్యూట్‌లను అభివృద్ధి చేసి ఎకో, హెరిటేజ్, అడ్వెంచర్ టూరిజాలను ప్రోత్సహిస్తామన్నారు. దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి, స్థానికులకు ఉపాధి కల్పించేందుకు తెలంగాణ పర్యాటక అభివృద్ధి పాలసీ రూపొందించామని తెలిపారు. ప్రయివేటు భాగస్వాములతో ఒప్పందం కుదుర్చుకుంటామని చెప్పారు. టెంపుల్, ట్రైబల్, వెల్‌నెస్ టూరిజాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ఆధ్యాత్మిక, చారిత్రక, సహజ అందాల విశిష్ట మేళవింపును పర్యాటకులకు అందిస్తామన్నారు.

2025-స్వచ్ఛ, హరిత ఇంధన పాలసీ ఇంధన భద్రతకు, స్థిరత్వానికి ప్రాధాన్యత ఇస్తుందనీ, రాబోయే దశాబ్దంలో సౌర, పవన, ఇంధన నిల్వలను పెంచడం కోసం ప్రణాళిక రూపొందించామని గవర్నర్ తెలిపారు. భవిష్యత్తు డిమాండ్లను తీర్చడానికి పునరుత్పాదక రంగం, పంప్డ్ స్టోరేజ్ హైడ్రోపవర్, గ్రీన్ హైడ్రోజన్ రంగాలలో వ్యూహాత్మక పెట్టుబడులను పెడుతున్నట్టు చెప్పారు. 2029-30 నాటికి రాష్ట్రంలో ఆరు వేల ఈవీ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

భూపరిపాలనను క్రమబద్ధీకరించడానికీ, పౌరులందరికీ భూ భద్రత కల్పించడానికి తమ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తెచ్చిందని తెలిపారు. ఈ చట్టం భూ రికార్డులలో పారదర్శకతను పెంపొందిస్తుందనీ, యజమాని భూమికి రక్షణ కల్పిస్తుందని వివరించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారుల పాత్రను పునరుద్ధరించేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. పోలీసు సిబ్బంది పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి రంగారెడ్డి జిల్లాలో ప్రపంచస్థాయిలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు ఇప్పటికే శంకుస్థాపన చేసిన విషయాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో విపత్తుల నుంచి రక్షించేందుకు అగ్నిమాపక శాఖ నుంచి వెయ్యి మందిని, ప్రత్యేక పోలీసు బెటాలియన్ల నుంచి మరో వెయ్యి మంది సిబ్బందిని నియమించి తెలంగాణ విపత్తు ప్రతిస్పందన దళం(ఎస్‌డీఆర్ఎఫ్)ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విపత్తు ముప్పుల తగ్గింపు కోసం పెండమ్ ఫ్రేమ్ వర్క్‌ను అమలు పరచడానికి జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ(ఎన్‌డీఎంఏ)తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నదని తెలిపారు.

తెలంగాణ నిర్మాణానికి కలిసి ముందుకు సాగుదాం

మెట్రో రైల్ విస్తరణ, మూసీ నది పునర్జీవన ప్రాజెక్టు, ఫ్యూచర్‌సిటీ నిర్మాణంతో పట్టణ జీవితం మరింత మెరుగవుతుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ శ్రేణి నగరంగా తీర్చిదిద్దడానికి ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం యోచిస్తున్నదని తెలిపారు. ఏడు మండలాలు, 56 గ్రామాలు, 756 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ సిటీ తెలంగాణ పట్టణ, పారిశ్రామిక అభివృద్ధిలో పరివర్తనాత్మక చర్యగా మారబోతున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ రహదారుల మధ్య ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ఉందన్నారు. మల్టీ మోడల్ మొబిలిటీ, మెట్రో అందుబాటుతో ఏఐ సిటీ, ఫార్మా, మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ల సహకారంతో ఆర్థిక కార్యకలాపాలను పెంపొందించడానికి, ఉపాధి అవకాశాలు కల్పించడానికి, జీవన నాణ్యతను పెంపొందించడానికి ఫ్యూచర్ సిటీ రూపొందించబడిందని వివరించారు. పునరుత్పాదక ఇంధనం, ఏఐ, హైటెక్ పరిశ్రమలలో తెలంగాణను అగ్రగామిగా చేయడం తమ లక్ష్యమన్నారు. ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదం, సమ్మిళిత పాలన పట్ల మనకున్న అచంచల అంకిత భావమే అభివృద్ధి చెందుతున్న తెలంగాణకు మూలస్తంభంగా ఉండి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చి దేశానికి ఆదర్శ రాష్ట్రంగా ఉండేలా ముందుకెళ్తున్నామని నొక్కి చెప్పారు. తెలంగాణ నిర్మాణానికి సంఘటితంగా, విశ్వాసంతో, స్థిరమైన నిబద్ధతతో అందరం కలిసి ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. జైహింద్..జై భారత్..జై తెలంగాణ అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

డీలిమిటేషన్‌పై ఏకాభిప్రాయం అవశ్యం



(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రజలు ఇలాంటి కవ్వింపు చర్యల ఊబిలో పడకుండా శాంతియుతంగా వేడుకలు జరుపుకోవాలని పిలుపునిచ్చింది. ఈ నెల 11, 12 తేదీల్లో సమావేశమైన సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో పలు అంశాలపై చర్చలు జరిపింది. అనంతరం ఒక ప్రకటన జారీ చేసింది. ఆ వివరాలు..

శాంతియుతంగా హోలీ

హోలీ ఉత్సవాలకు సంబంధించి యుపి, బీహార్, మధ్యప్రదేశ్‌కు చెందిన మంత్రులు, ఎంఎల్‌ఎలు సహా పలువురు బీజేపీ నేతలు చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్యలను పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. హోలీ పండుగ శుక్రవారం వచ్చింది. రంజాన్ సందర్భంగా ముస్లింల ప్రార్ధనలు కూడా అదే రోజు జరగనున్నాయి. ఈ విషయమై శాంతి భద్రతలను చక్కగా నిర్వహిస్తామని హామీ ఇవ్వడానికి బదులుగా యుపి ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ కూడా ముస్లింలను బెదిరించారు. ఇటువంటి వ్యాఖ్యలు ముస్లింల్లో ఉద్రిక్తతలు సృష్టించడానికి, వారిని భయపెట్టడానికి ఉద్దేశించినవేనని పొలిట్‌బ్యూరో పేర్కొంది. శాంతియుతంగా హోలీ పండుగ జరిగేలా కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. ఎలాంటి కవ్వింపు చర్యల ఊబిలో పడరాదని అన్ని కమ్యూనిటీలకు విజ్ఞప్తి చేసింది.

డీలిమిటేషన్‌తో ఏ రాష్ట్రమూ ఇబ్బంది పడకూడదు

డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల ఏ రాష్ట్రమూ ఇబ్బంది పడకూడదని సీపీఐ(ఎం) పేర్కొంది. 2026 తర్వాత నిర్వహించిన జనగణన ప్రాతిపదికగా శాసనసభా, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను చేపట్టాల్సి వుంది. తాజా జనాభా గణాంకాల ప్రకారం పునర్విభజన నిర్వహిస్తే పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తగ్గిపోనుంది. అలాంటి తగ్గింపు రాజకీయంగా, ప్రజాస్వామికంగా అన్యాయమైనది, పైగా సమాఖ్య సూత్రాన్ని దెబ్బతీస్తుంది. అందువల్ల ఈ పునర్విభజన ప్రక్రియపై ఏకాభిప్రాయానికి రావాలని పొలిట్‌బ్యూరో కోరుతోంది. ఈ ప్రక్రియలో ఏ రాష్ట్రమూ కూడా సీట్ల వాటా దామాషాలో కుదింపుతో ఇబ్బంది పడకూడదని తెలిపింది.

పార్టీ మహాసభ

24వ పార్టీ మహాసభ కోసం పార్టీ నిర్మాణ కార్యకలాపాలపై ముసాయిదా నివేదికను పొలిట్‌బ్యూరో చర్చించింది. మార్చి 22, 23 తేదీల్లో జరిగే కేంద్ర కమిటీ సమావేశంలో ఈ ముసాయిదాను ప్రవేశపెట్టి, చర్చించిన అనంతరం ఆమోదిస్తారు.

అమెరికా టారిఫ్‌ల బెదిరింపు

అమెరికాకు ఎగుమతి చేసే భారత ఉత్పత్తులపై టారిఫ్‌లను పెంచుతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరిస్తున్నారు. ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలు విధిస్తామని ఇప్పటికే ప్రకటించారు. కానీ మోడీ ప్రభుత్వం ఈ అంశంపై మౌనం పాటిస్తోంది. దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి ట్రంప్‌తో రాజీ పడేందుకు ప్రయత్నిస్తోంది. భారత పరిశ్రమల ప్రయోజనాలపై భారత ప్రభుత్వం దృఢమైన వైఖరి తీసుకోవాలని, తగు ప్రతీకార చర్యలు తీసుకోవాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.

సంపాదకీయం

ముంచుకొస్తున్న కాలుష్య ముప్పు

దేశం కాలుష్య కాసారంగా మారుతున్న తీరు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. స్విస్ ఎయిర్ టెక్నాలజీకి చెందిన ప్రతిష్టాత్మక సంస్థ 'ఐక్యు ఎయిర్' తాజాగా విడుదల చేసిన 'ది వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్-2024' ప్రకారం ప్రపంచంలోని ఇరవై అత్యంత కాలుష్య నగరాల్లో పదమూడు మన దేశంలోనే ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యంత కాలుష్య రాజధాని నగరంగా ఢిల్లీ కొనసాగుతూనే ఉంది. అస్సాం -మేఘాలయ సరిహద్దుల్లోని బైర్నిహట్ పట్టణం వాయు కాలుష్యంలో ఢిల్లీని మించిపోయి, అత్యంత కాలుష్య నగరాల జాబితాలో ప్రపంచంలోనే మొట్టమొదటి స్థానంలో నిలవడం మరింత ఆందోళనకరం! మేఘాలయకు చెందిన ఈ చిన్న నగరంలో అభివృద్ధి పేరుతో విచ్చలవిడిగా పరిశ్రమలు ఏర్పాటు చేయడమే ఈ పరిస్థితికి కారణం. ఈ నివేదిక ప్రకారం ఆస్ట్రేలియా, న్యూజి లాండ్, బహమాస్, బార్బడోస్, గ్రెనడా, ఎస్టోనియా, ఐస్‌లాండ్ దేశాలు మాత్రమే ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశాల మేరకు వాయు కాలుష్యాన్ని నియంత్రించగలిగాయి.



భారత్ 2023తో పోలిస్తే అత్యధిక కాలుష్య ర్యాంకుల్లో మూడవ స్థానం నుండి ఐదవ స్థానానికి చేరి కొంత మెరుగైన ఫలితాలు సాధించినట్టు నివేదిక పేర్కొంది. పి.ఎం 2.5 స్థాయిని ఏడు శాతానికి తగ్గించగలిగింది. అయినప్పటికీ, పాకిస్తాన్, బంగ్లాదేశ్ తదితర దేశాల సరసన డేంజర్ జోన్‌లోనే కొనసాగుతుండటం, కాలుష్య నగరాల సంఖ్య పెరుగుతుండటం పొంచి ఉన్న ముప్పునకు నిదర్శనం. చికాగో విశ్వవిద్యాలయానికి చెందిన ఎనర్జీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ 2023లోనే కాలుష్య స్థాయి ఇదే మాదిరి కొనసాగితే ఢిల్లీ ప్రజానీకం తమ జీవితకాలంలో 11.9 సంవత్సరాలు కోల్పోతారంటూ హెచ్చరిక చేసింది. ఆ నివేదిక ప్రకారం ప్రపంచ ఆరోగ్య సంస్థ జారీ చేసిన మార్గదర్శకాలకు మించిన కాలుష్యంలో దేశంలోని మొత్తం జనాభా మగ్గుతోంది. ప్రతి క్యూబిక్ మీటర్‌కు నలభై మైక్రో గ్రాముల కాలుష్యానికి అనుమతి ఇస్తూ మన దేశం రూపొందించుకున్న సొంత నాణ్యతా ప్రమాణాలు సైతం ఆచరణలో అమలు కావడం లేదు. జాతీయ పరిమితి కన్నా అధికంగా కాలుష్యం ఉన్న ప్రాంతాల్లో దేశంలోని 67.4 శాతం జనాభా జీవనం సాగిస్తోంది. 2023లోనే విడుదలైన 'ది లాన్‌సెట్ ప్లానెటరీ హెల్త్' నివేదిక ప్రకారం మన మహానగరాలన్నీ వాయు కాలుష్యంతో అతలాకుతల మౌతున్నాయి.

కాలుష్యంతో నిండిన గాలిని పీల్చడం ద్వారా దేశం మొత్తం మీద ప్రజానీకం సగటున 5.2 సంవత్సరాల జీవితాన్ని కోల్పో తున్నారు. వాయు కాలుష్య సంబంధిత రోగాల ద్వారా ప్రతి సంవత్సరం పదిహేను లక్షల మంది మరణిస్తున్నారు. దేశ వ్యాప్తంగా అత్యధిక మరణాలకు కారణమవుతున్న వాటిలో వాయు కాలుష్యం ఐదవ స్థానంలో నిలుస్తోంది. ఈ కారణంగా ఢిల్లీలో 50 శాతం మంది చిన్నారుల ఊపిరితిత్తులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నాయి. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉంది కాబట్టే 2019 నవంబర్‌లో అత్యున్నత న్యాయస్థానం 'నరకానికన్నా అధ్వాన్నంగా ఢిల్లీ నగరం తయారైంది' అని వ్యాఖ్యానించింది. ఆ సమయంలోనే సుప్రీంకోర్టు న్యాయమూర్తి అరుణ్ మిశ్రా 'పేలుడు పదార్థాలు అమర్చి ప్రతి ఒక్కరినీ చంపేయడం మంచిది.' అని అన్నారంటే అప్పటికే పరిస్థితి ఏ స్థాయికి దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. అయినా, పాలకులలో స్పందన లోపించడంతో, ఆ దుస్థితి దేశమంతా విస్తరిస్తోంది.

వాయు కాలుష్యానికి, వాతావరణ మార్పులకు దగ్గర సంబంధం ఉన్న విషయాన్ని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ల పేరుతో కార్పొరేట్లకు ఎర్రతివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు దేశ వ్యాప్త వాయు కాలుష్యంలో యాభై ఒక్క శాతానికి పరిశ్రమలు వెదజల్లే విష వాయువులే కారణమని తెలినా నియంత్రణకు చర్యలు తీసు కోవడం లేదు, ప్రజా రవాణా వ్యవస్థను మెరుగు పరచడం ద్వారా వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించే అవకాశం ఉన్నప్పటికీ స్పందన శూన్యం.కార్పొరేట్ల లాభాల కోసం సామాన్యుల ప్రాణాలను సమిధలుగా చేసే ఈ తరహా విధానాలను ప్రభుత్వాలు ఇప్పటికైనా విడనాడాలి. తక్షణం కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టాలి. అడవులను పరిరక్షించడంతో పాటు, వీలైన అన్ని ప్రాంతాల్లోనూ చెట్లను పెంచాలి. ఈ తరహా చర్యలే కాలుష్య కోరల నుండి ప్రజానీకాన్ని కాపాడుతాయి.

దేశ వ్యాప్తంగా అత్యధిక మరణాలకు కారణమవుతున్న వాటిలో వాయు కాలుష్యం ఐదవ స్థానంలో నిలుస్తోంది. ఈ కారణంగా ఢిల్లీలో 50 శాతం మంది చిన్నారుల ఊపిరితిత్తులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నాయి. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉంది కాబట్టే 2019 నవంబర్‌లో అత్యున్నత న్యాయస్థానం 'నరకానికన్నా అధ్వాన్నంగా ఢిల్లీ నగరం తయారైంది' అని వ్యాఖ్యానించింది. ఆ సమయంలోనే సుప్రీంకోర్టు న్యాయమూర్తి అరుణ్ మిశ్రా 'పేలుడు పదార్థాలు అమర్చి ప్రతి ఒక్కరినీ చంపేయడం మంచిది.' అని అన్నారంటే అప్పటికే పరిస్థితి ఏ స్థాయికి దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. అయినా, పాలకులలో స్పందన లోపించడంతో, ఆ దుస్థితి దేశమంతా విస్తరిస్తోంది.

సుంకాలపై అమెరికాకు చైనా హెచ్చరిక! మన వైఖరేంటి?

- సత్య

అమెరికా వాంఛిస్తున్న మాదిరి యుద్ధమే కోరుకుంటే అది సుంకాల పోరు, వాణిజ్య పోరు లేదా మరేదైనా యుద్ధాన్ని కోరుకుంటే కడవరకు పోరాడేందుకు తాము సిద్ధమని చైనా ప్రకటించింది. ఈ మేరకు అమెరికాలోని చైనా రాయబార కార్యాలయం 'ఎక్స్' పోస్టులో సవాలు విసిరింది. రెండవసారి అధికారానికి వచ్చిన తర్వాత తొలిసారి అమెరికా పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి మంగళవారం నాడు ప్రసంగించిన ట్రంప్ ఏప్రిల్ రెండవ తేదీ నుంచి చైనా, భారత్‌లపై ప్రతి సుంకాలు అమల్లోకి వస్తాయని చెప్పాడు. తాను విధించే సుంకాలు మరోసారి అమెరికాను ధనవంతురాలిగా, గొప్పదానిగా చేస్తాయని చెప్పుకున్నాడు. మోటారు వాహనాలపై భారత్ వంద శాతానికి మించి పన్నులు విధిస్తున్నదని, అమెరికా వేస్తున్నదాని కంటే రెట్టింపు చైనా పన్నులున్నాయని, తాము మిలిటరీ సాయం చేస్తున్నప్పటికీ దక్షిణ కొరియా నాలుగు రెట్లు ఎక్కువగా సుంకాలు విధిస్తున్నదని ట్రంప్ ఆరోపించాడు. దశాబ్దాల తరబడి ఇతర దేశాలు తమ మీద పన్నులు విధిస్తున్నాయని ఇప్పుడు తమ వంతు వచ్చిందన్నాడు. లేడిపిల్ల కన్నీళ్లను చూసి వేటగాడి మనసు మారుతుందా? మారదు గనుకనే అమీతుమీ తేల్చుకొనేందుకు చైనా నిర్ణయించింది.

మరి మన దేశం! ట్రంప్ ప్రకటించిన మేరకు నిజంగానే సుంకాలు అమల్లోకి వస్తే ఏటా మన దేశానికి 700 బిలియన్ డాలర్లు నష్టమని సిటీ పరిశోధన సంస్థ విశ్లేషకులు ప్రకటించారు. 2030 నాటికి ఉభయ దేశాల వాణిజ్య లావాదేవీలను 500 బిలియన్ డాలర్లకు పెంచాలని ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా పర్యటనకు వెళ్లినపుడు ఒక అవగాహనకు వచ్చారు. ఆ మేరకు అక్టోబరులో ఒప్పందం కుదరవచ్చని వార్తచ్చాయి. కానీ దాన్ని దెబ్బతీసే విధంగా ట్రంప్ సుంకాల ప్రకటన వెలువడ నుందని ఉప్పందిందేమో మార్చి ఎనిమిదో తేదీవరకు ఉన్న కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకుని మన వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ ఆకస్మికంగా వాషింగ్టన్ బయలుదేరి వెళ్లారు. అక్కడి వాణిజ్య మంత్రితో మాట్లాడారు. అయినప్పటికీ ఆ తర్వాతే ట్రంప్ ప్రకటన వెలువడింది. వెళ్లటం తప్పని కాదు, ఉన్న కార్యక్రమాలన్నీ రద్దు చేసుకొని అంత ఆకస్మికంగా పరుగు పెట్టాల్సిన అవసరం ఏమిటన్నదే ప్రశ్న. అమెరికాలో సూపర్ అధ్యక్షుడిగా పేరు తెచ్చుకున్న ఎలన్‌మస్క్ మన దేశంలో తన కార్లను అమ్ముకోవాలంటే దిగుమతి పన్ను తగ్గించాల్సిందే అని ఒత్తిడి తెస్తున్నాడు. అతగాడి కోసమే ట్రంప్ పన్నుల ప్రకటన అన్నది స్పష్టం. తగ్గిస్తే మన దేశంలోని టాటా, ఎంజి, మహీంద్రలకు కోపం, లేకపోతే ట్రంప్‌కు ఆగ్రహం. ఎవరిని వదులుకోవాలన్నది ఇప్పుడు నరేంద్ర మోడీ ముందున్న ప్రశ్న. ఒకవేళ ఒత్తిడికి లొంగి కార్ల మీద పన్ను తగ్గించిన తర్వాత మిగతావాటి సంగతేమిటని మెడపట్టుకు కూర్చుంటే..!

తమపై వాణిజ్య యుద్ధం ప్రారంభించిన అమెరికా అధినేత డోనాల్డ్ ట్రంప్ మీద తగ్గేదేలే అంటున్నాయి దేశాలు. కెనడా, మెక్సికోలపై పన్ను విధింపులో ట్రంప్ పునరాలోచన చేయవచ్చన్న సూచనలు అమెరికా వాణిజ్య మంత్రి నుంచి వెలువడినప్పటికీ అది జరగలేదు. పన్ను పోరు ఎటువైపు దారితీస్తుందో, దాని పర్యవసానాలు ఏమిటో చర్చగా మారాయి. చైనా, కెనడా ప్రతి పన్ను ప్రకటన చేయగా మెక్సికో ఏక్షణంలోనైనా పోరులో పాల్గొనవచ్చని వార్త. చైనా మీద రెండు సార్లుగా పది శాతం చొప్పున పన్ను విధించగా మిగతా రెండు దేశాల మీద 25 శాతం ముందుగానే ప్రకటించిన సంగతి తెలిసిందే.



ట్రంప్ ప్రకటన వెలువడగానే ఈ నెల పది నుంచి అమల్లోకి వచ్చే విధంగా మంగళవారం నాడు పలు వస్తువులపై పది నుంచి పదిహేను శాతం మేరకు చైనా అదనంగా ప్రతి పన్ను ప్రకటించింది. వాటిలో కోడి, పంది, గొడ్డు మాంసం, పలు వ్యవసాయ ఉత్పత్తులు ఉన్నాయి. తైవాన్‌కు ఆయుధాలను విక్రయించే 15 సంస్థలపై ఆంక్షలను విధించింది. మరో పదింటిని నమ్మకూడని వాటి జాబితాలో చేర్చింది. కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడోవ్ కూడా ట్రంప్ ప్రకటన వెలువడగానే అదే రోజు అర్ధరాత్రి నుంచి 155 బిలియన్ డాలర్ల విలువగల అమెరికా వస్తువులపై 25 శాతం ప్రతి పన్ను విధించినట్లు ప్రకటించాడు. అమెరికా వెనక్కు తగ్గేంతవరకు అవి కొనసాగుతాయన్నాడు. అమెరికాలోని 30 రాష్ట్రాలకు సరఫరా చేస్తున్న విద్యుత్, చమురు సరఫరాలపై కూడా ఆంక్షలు విధించే అవకాశం ఉంది. దశలవారీగా ఇతర వస్తువులు, పది కోట్ల డాలర్ల ఎలన్ మస్క్ స్టార్‌లింక్ ఇంటర్నెట్ ఒప్పందంపై ఆంక్షలు ప్రకటించే దిశగా కెనడా ఉంది. మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షెయిన్ బామ్ విలేకర్లతో మాట్లాడుతూ ట్రంప్ పన్నులను ఎదుర్కొనేందుకు తమ దగ్గర నాలుగు పథకాలున్నాయని, సహనం పాటిస్తున్నట్లు, ఆదివారం నాడు మెక్సికో సిటీలో జరిపే ఒక బహిరంగ సభలో వెల్లడిస్తామని చెప్పారు. అమెరికాతో ఎంతో అనుభవం ఉందని, వారి చర్య కొంత మేరకు యుద్ధం తప్ప మరొకటి కాదని పెట్టుబడిదారు వారెన్ బఫెట్ అన్నాడు.

తొలిసారి అధికారానికి వచ్చినపుడు ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధంతో 2018 నుంచి అమెరికా దిగుమతులపై ఆధారపడటాన్ని చైనా క్రమంగా తగ్గిస్తున్నది. స్వంతంగా ఉత్పత్తి లేదా ఇతర దేశాల నుంచి తెచ్చు కుంటున్నది. అంతకు ముందుతో పోలిస్తే 2023లో 20 శాతం తగ్గితే 2024లో 14 శాతం తగ్గించి 29.25 బిలియన్ డాలర్ల మేర వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంది. అయినప్పటికీ అమెరికా రైతాంగానికి చైనా అతి పెద్ద మార్కెట్‌గా ఇప్పటికీ కొనసాగుతున్నది. అక్కడ పండే సోయాలో 2016లో 40 శాతం చైనాకు ఎగుమతి చేయగా గతేడాది 21 శాతానికి తగ్గాయి. మొక్కజొన్నల దిగుమతి 260 కోట్ల డాలర్ల నుంచి 2024లో 56 కోట్ల డాలర్లకు పడిపోయింది. కోళ్ల దాణాకు ఉపయోగించే వీటిని దేశీయంగా ఉత్పత్తి పెంచటం, కొంత మేరకు బ్రెజిల్ నుంచి దిగుమతి చేసుకుంటున్నది. అమెరికాలో కోడి కాళ్లు, పంది చెవులు, పంది తలను తినరు, వాటిని 2021లో 411 కోట్ల డాలర్ల మేర దిగుమతి చేసుకోగా గతేడాది 254 కోట్లకు తగ్గించింది. జొన్నల దిగుమతి పెరిగింది. అమెరికా 2023లో మొత్తం 3.1 లక్షల కోట్ల డాలర్ల విలువగల వస్తువులు, వ్యవసాయ పంటలు ఆహారాన్ని దిగుమతి చేసుకోగా, ఇప్పుడు కూడా అంతే మొత్తం దిగుమతి చేసుకుంటే ట్రంప్ విధించిన పన్నుల భారం 43 శాతం మీద పడనుందని అంచనా. ఆ మేరకు అమెరికా వినియోగదారులపై దాదాపు ప్రతి రోజువారీ వస్తువుపై అదనపు భారం మోపినట్లే. అమెరికాలోని ఆటో పరిశ్రమ తీవ్ర సమస్యలను ఎదుర్కొనే అవకాశం కనిపిస్తోంది. సగానికి పైగా ఇంజన్లు, విడిభాగాలు కెనడా, మెక్సికోల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. వాటి మీద 25 శాతం పన్నులు అంటే ఒక్కో కారు ధర పన్నెండు వేల డాలర్లు పెరిగే అవకాశం ఉందని అంచనా. కాస్త బాధ ఉన్నప్పటికీ అమెరికాను అగ్రభాగాన నిలిపేందుకు ఆ మాత్రం మూల్యం చెల్లించాల్సిందే అని ట్రంప్ అన్నాడు.


గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు చూస్తే మన ఉక్కు దిగుమతులు రికార్డులను బద్దలు కొడితే ఎగుమతులు ఏడేళ్ల కనిష్టానికి పడిపోయాయి. ప్రపంచంలో ముడి ఇనుము ఉత్పత్తిలో రెండవ స్థానంలో ఉన్న మన దేశం అంతిమంగా తయారైన ఉక్కు ఉత్పత్తులను దిగుమతి చేసుకొనే దేశంగా నరేంద్ర మోడీ ఏలుబడిలో మారింది. దక్షిణ కొరియా, చైనా, జపాన్ నుంచి దిగుమతులు గణనీయంగా పెరిగాయి. మన మొత్తం దిగుమతుల్లో 78 శాతం ఈ దేశాల నుంచే జరుగుతున్నాయి. దిగుమతులు పెరగటంతో 15 నుంచి 25 శాతం వరకు దిగుమతి పన్ను విధింపు గురించి ఆలోచిస్తున్నట్లు ఉక్కుశాఖా మంత్రి కుమారస్వామి గత నెలలో చెప్పారు. మన దేశంలో తయారైన ఉక్కు ఎగుమతులు ఎక్కువగా ఇటలీ, బెల్జియం, నేపాల్, స్పెయిన్లకు జరుగుతుండగా గణనీయంగా పడిపోయాయి.

అమెరికా పన్ను విధింపునకు కట్టుబడి ఉంటే పీటమెక్కి రెండు నెలలు కూడా గడవక ముందే తాను రాజునని ప్రకటించుకున్న డోనాల్డ్ ట్రంప్ తనకు లొంగరు అనుకున్నవారి మీద ఎడాపెడా కొరడా ఝళిపిస్తున్నాడు. సుంకాలు, ప్రతి సుంకాలు విధిస్తూ బస్తీ మే సవాల్ అంటున్నాడు. తల వంచేట్లు చేసేందుకు బెదిరింపులా, బేరమాడేందుకు వేస్తున్న పాచికలా చివరకు ఏం జరుగుతుంది, ఎలా ముగుస్తుందన్నది ఎవరూ చెప్పని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో సుంకాల్ని పెంచుతూ ఎలాగైనా కెనడాను తన దారిలోకి తెచ్చుకోవాలని ట్రంప్ ముమ్మర ప్రయత్నం చేస్తుంటే దానికి ప్రతిదాడిగా కెనడా కూడా అంతే సుంకాలు విధిస్తూ తామేం తక్కువ కాదన్నట్లు ప్రతిఘటిస్తూ ముందుకెళ్తోంది. చిన్నదేశమైన కెనడానే అలా స్పందిస్తే మరి నూట నలభై కోట్ల జనాభా గల మన దేశ ప్రధాని మౌనంగా ఉండటాన్ని ఎలా అర్థం చేసుకోవాలి. అమెరికా విధించిన సుంకాలకు లొంగి నట్టా లేదంటే వ్యతిరేకిస్తున్నట్టా? అనేది దేశ ప్రజలకు తెలియాల్సి వుంది. ప్రధాని నోరు విప్పేదాకా ఇది సస్పెన్స్‌గానే ఉంటుంది. ■

గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు చూస్తే మన ఉక్కు దిగుమతులు రికార్డులను బద్దలు కొడితే ఎగుమతులు ఏడేళ్ల కనిష్టానికి పడిపోయాయి. ప్రపంచంలో ముడి ఇనుము ఉత్పత్తిలో రెండవ స్థానంలో ఉన్న మన దేశం అంతిమంగా తయారైన ఉక్కు ఉత్పత్తులను దిగుమతి చేసుకొనే దేశంగా నరేంద్ర మోడీ ఏలుబడిలో మారింది. దక్షిణ కొరియా, చైనా, జపాన్ నుంచి దిగుమతులు గణనీయంగా పెరిగాయి. మన మొత్తం దిగుమతుల్లో 78 శాతం ఈ దేశాల నుంచే జరుగుతున్నాయి. దిగుమతులు పెరగటంతో 15 నుంచి 25 శాతం వరకు దిగుమతి పన్ను విధింపు గురించి ఆలోచిస్తున్నట్లు ఉక్కుశాఖా మంత్రి కుమారస్వామి గత నెలలో చెప్పారు. మన దేశంలో తయారైన ఉక్కు ఎగుమతులు ఎక్కువగా ఇటలీ, బెల్జియం, నేపాల్, స్పెయిన్లకు జరుగుతుండగా గణనీయంగా పడిపోయాయి.

అధ్యయనమే మార్క్స్‌కు నివాళి

ప్రపంచంలో అత్యంత గొప్ప ఆలోచనాపరుడు, మేధ ఆలోచించడం ఆగిపోయినరోజు. కోట్లాది కార్మికులతో ప్రేమించబడి, ఆరా ధించబడి, అభిమానించబడి వాళ్లకు దు:ఖం మిగిల్చి భౌతికంగా మన మధ్య నుండి వెళ్లిపోయాడు. ఆయనే కారల్ మార్క్స్.1883 మార్చి 14న తుదిశ్వాస విడిచారు. మార్క్స్ చెప్పినట్టుగా మానవులకు మానవ సమాజం గురించి తెలుసుకోవడానికి మించిన జ్ఞానం ఉండదనే సత్యాన్ని తెలిపే గ్రంథమే దాస్ కాపిటల్. అది నేటికీ కూడా నిర్ధారణ అయింది. ఆ సిద్ధాంత జ్ఞానం ద్వారానే మానవ సమాజాన్ని, దానిలో దాగున్న శ్రమదోపిడీ రహస్యాలను తెలుసుకోగలమని, దాన్ని అర్థం చేసుకోగలరని మార్క్స్ కాపిటల్‌లో చెప్పారు. ఆయనకు పూర్వం చెప్పిన తత్వవేత్తలు, ఆర్థికవేత్తలు గమనించని, చెప్పని అంశాలు, శ్రమదోపిడీకి మూలమైన 'అదనపు విలువ సిద్ధాంతం', గతితార్కిక భౌతికవాదం ప్రపంచ శ్రామిక ప్రజలకు బోధించిన తత్వవేత మార్క్స్ మాత్రమే. మార్క్సిజాన్ని



ప్రపంచానికి అందించి 142 సంవత్సరాలు అవుతుంది. మార్క్స్ ఆలోచనలు కొనసాగింపులో భాగంగానే రష్యా, చైనా తదితర దేశాల్లో విప్లవాలు తేగలిగారు. కొన్ని దేశాల్లో ఆ వ్యవస్థ దెబ్బతినింది.

నిర్దిష్ట పరిస్థితుల అధ్యయనం

1867లో వెలుగులోకి వచ్చిన కాపిటల్ ప్రపంచంలోనే అనేక గ్రంథాలకంటే ఎక్కువ ప్రచారం పొందింది.అనేక గ్రంథాల కంటే ఎక్కువ సంఖ్యలో కార్మికులకు, ప్రజలను ప్రభావితం చేసిన గ్రంథం కాపిటల్ ఒక్కటే. ఈ గ్రంథం వెలుగులోనే అనేక దేశాలు విప్లవ మార్గాన నడిచాయి. ప్రధానంగా మార్క్స్ సిద్ధాంతం ఆధారంగా రష్యా, చైనా, క్యూబా, లావోస్, వియత్నాం దేశాల్లో కార్మిక విప్లవాలు సాధించబడ్డాయి. మార్క్స్, ఎంగెల్స్ బతికున్న కాలంలో బాగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారి దేశాలైన అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ లాంటి దేశాల్లో విప్లవాలు వస్తాయన్న అంచనా వేశారు. రష్యా విప్లవనేత లెనిన్ మార్క్సిజాన్ని సామ్రాజ్యవాద దశలో మరింత లోతుగా అర్థం చేసుకుని రష్యాలో విప్లవం సాధించారు. ఆనాటికి రాచరిక వ్యవస్థలుగా ఉన్న రష్యా లాంటి దేశాల్లో ఆయా దేశాల నిర్దిష్ట ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులకు అను గుణంగా మార్క్సిజాన్ని అన్వయించారు. కాలానుగుణంగా ఆలోచనలు చేసి విప్లవ పోరాటాల్ని విజయవంతం చేశారు. ఆ సమాజాల్లో కార్మిక,కార్షకుల్లో చైతన్యం తీసుకురావడం, విప్లవం జయప్రదం కావడానికి ప్రధాన కారణం. మహత్తరమైన విప్లవాలు సాధించడానికి మార్క్స్ అందించిన సిద్ధాంతం కరదీపికగా పనిచేసింది. ఆ సిద్ధాంతం అధ్యయనం ద్వారా ఆయా దేశాలకు అనుగుణమైన ఎత్తుగడలు వేసి లక్షలాది ప్రజలను పోరాటాల్లోకి కదిలించారు. లెనిన్ చెప్పినట్లుగా ప్రజలకు సంబంధించిన విషయాలు నినాదాలుగా ఉండాలని, ఒక నినాదం ప్రజలను ఆవహిస్తే అది ఒక భౌతిక శక్తిగా మారుతుందని చెప్పారు. అలా నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషణ చేయడంతోనే మార్క్సిజం సఫలమైనది.

భారతదేశ పరిస్థితి

భారతదేశంలో కులం, మతం, ప్రాంతం, జాతుల వంటి సమస్యలు ప్రధాన ఎజెండాగా కొనసాగుతున్నవి. దేవుళ్ల, మత విశ్వాసాలు, సంప్రదాయాలు నిండుగా, మెండుగా ప్రజల్లో గూడుకట్టుకుని ఉన్నవి. ఇక్కడ కుల సమస్య ఒక కీలకపాత్రగా పోషిస్తోంది. దీన్ని మరింత విశ్లేషణ చేసి వాటికి తగిన స్థాయిలో పోరాటాలు రూపొందించాలి. ప్రజల వద్దకు చేరువ కావటంలో వామపక్ష పార్టీలు ఇంకా కృషిని తీవ్రం చేయాలి. భారతదేశంలో ఆరెస్సెస్-బీజేపీ అనుబంధ సంఘాల ఫాసిస్టు పోకడ ప్రమాదకరంగా ఉన్నది. మరోపక్క భారత రాజ్యాంగాన్ని మార్చాలని, దాని స్థానంలో మనువాదాన్ని తీసుకురావాలని కుట్రలు, కుయుక్తులు చేస్తున్నది. దానికి అనుగుణంగానే ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నది.అందులో భాగంగానే లౌకిక శక్తులపై దాడులు చేస్తూ ప్రశ్నించే గొంతుకులపై అక్రమంగా కేసులు పెడుతున్నది. అణగారిన కులాలైన దళితులు, గిరిజనులపై దాడులు చేస్తున్నది. బడా పెట్టుబడిదారులకు, కాంట్రాక్టర్లకు అటవీ సంపదను వాళ్ల పెరటి దొడ్డిగా మార్చేందుకు ఆదివాసి, గిరిజనుల గూడెలను ఖాళీ చేసేందుకు పూనుకుంటున్నది. ఈ మతోన్మాద కార్పొరేట్ పద్ధతులకు వ్యతిరేకంగా, దాని ముసుగులో సాగుతున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాటం తీవ్రం చేయాలి.

- పైడికత్తుల నాగేశ్వరరావు, 9866867392

(మార్చి 14 కారల్‌మార్క్స్ వర్ధంతి)


డీలిమిటేషన్‌తో దక్షిణాదికి మొండిచేయి



నాదెండ్ల శ్రీనివాస్
9676407140

'ఉత్తరాన బీజేపీ ఎత్తుగడలు నెగ్గినాయి. దేశంలో కొన్ని లౌకిక పార్టీలు చీకటి లోకంలో మగ్గినాయి' అన్న అభ్యుదయ కవి గజ్జెల మల్లారెడ్డి మాటలు మళ్లీ గుర్తొస్తున్నాయి. తాము చేసే ప్రతీ పనిలో ఏదో ఒక మెలిక పెట్టడం బీజేపీకి అలవాటే. ఆ మెలిక కూడా మామూలుగా ఉండదు, దాని ప్రభావం చాలా పెద్దగానే ఉంటుంది. తనకు మాత్రమే ప్రయోజనం చేకూరి, ఇతరులు ఇరుకున పడేలా పకడ్బందీ వ్యూహంతో ముందుకు సాగుతుంది. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో కూడా అదే పనిచేసింది.ఆ బిల్లు లోక్‌సభ,రాజ్యసభలో ఆమోదం పొందింది కానీ అది అమలవ్వాలంటే మాత్రం కొన్ని మెలికలున్నాయి. అది జనాభా గణన, డీలిమిటేషన్. ఈ రెండింటిలో జనాభా గణన అంశాన్ని పక్కనపెడితే డీలిమిటేషన్ ప్రక్రియ మాత్రం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. పార్లమెంటరీ లేదా అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను పునర్నిర్మించే ప్రక్రియనే డీలిమిటేషన్ అంటారు. జనాభా ప్రాతిపదికన ప్రజాప్రతినిధులు ఉండేలా సీట్లు కేటాయించాలన్న ఆలోచనతో ఈ డీలిమిటేషన్‌ని తెరమీదకు తీసుకొచ్చారు. అంటే పార్లమెంట్ లేదా రాష్ట్ర శాసనసభలో ప్రతినిధి సభలో సమాన సంఖ్యలో జనాభాకు ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుంది.అయితే ఈ డీలిమిటేషన్ ప్రక్రియని అమలు చేయాలంటే ముందుగా రాజ్యాంగం ప్రకారం జనాభా గణన చేయాల్సి ఉంటుంది. నిజానికి 2021లో జనాభా గణన జరగాల్సి ఉంది. కానీ అప్పుడు కోవిడ్ మహమ్మారి కారణంగా అది జరగలేదు.మరో విషయం ఏమి టంటే మోడీ ప్రభుత్వం ఇంతవరకూ జనాభా గణన ప్రారంభించలేదు.ఉత్తర భారతంతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా రేటు చాలా తక్కువ.ఉత్తరాదిన జనాభా గణనీయంగా పెరిగిపోతుంటే దక్షిణాదిలో మాత్రం జనాభా నియంత్రణపై కేంద్రం నిబంధనల్ని పాటిస్తున్నారు. అందుకే జనాభా పెరుగుదల దక్షిణాది రాష్ట్రాల్లో ఒక క్రమంలో ఉంది. మొత్తంగా చెప్పాలంటే దక్షిణాది కన్నా ఉత్తరాది జనాభా ఎక్కువ. ఇలాంటప్పుడు డీలిమిటేషన్ ప్రక్రియ అనేది ఉత్తరాది రాష్ట్రాలకే ప్రయోజనం చేకూరుస్తుంది.

జనాభా ప్రాతిపదికన సీట్లు ఉండాలన్నది నియమం కాబట్టి ఉత్తరాదిన జనాభా ఎక్కువగా ఉండటంతో అక్కడ సీట్లు పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కానీ దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా తక్కువగా ఉండటంతో,ఉన్న సీట్లలో కోత పడే ప్రమాదం ఉంది. రాజ్యాంగం ప్రకారం జనాభా లెక్కింపు తర్వాత కేంద్రం కచ్చితంగా చేయాల్సిన పనుల్లో నియోజకవర్గాల పునర్విభజన ఒకటి. జనాభా ప్రాతిపదికన దేశవ్యాప్తంగా లోక్‌సభ,అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నియోజక వర్గాలను విభజించి, సరిహద్దులు గుర్తిస్తారు.అలాగే ఏయే నియోజక వర్గాలకు ఎస్సీ, ఎస్టీ ప్రాతినిధ్యం అవసరం ఉందనే లెక్కలు కూడా తేలుస్తారు. పార్లమెంట్ చట్టం ప్రకారం కేంద్రం ఒక డీలిమి టేషన్ కమిషన్‌ని ఏర్పాటు చేస్తుంది. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి ఈ కమిటీకి చైర్మన్‌గా ఉంటారు.కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌తో పాటు అన్ని రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్స్ ఇందులో సభ్యులుగా ఉంటారు.1952లో తొలి డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటైంది.1951 జనాభా లెక్కల ప్రకారం 36 కోట్ల 10 లక్షల జనాభాకు 494 లోక్‌సభ స్థానాలను గుర్తించారు.1963లో రెండో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటైంది.1961 జనాభా లెక్కల ప్రకారం 43 కోట్ల 90 లక్షల జనాభాకు లోక్‌సభ స్థానాల సంఖ్యను 522కు పెంచారు.అలాగే 1973లో 54 కోట్ల 80 లక్షల జనాభాకు గాను ఆ సంఖ్యను 543కు పెంచారు.ఆ తర్వాత 2002 కూడా మరోసారి నియోజకవర్గాల పునర్విభజన జరిగింది.2001 జనాభా లెక్కల ప్రాతిపదికన కాకుండా 1973 నాటి జనాభా లెక్కల ప్రకారమే లోక్ సభ స్థానాల సంఖ్యను పెంచకుండా, తగ్గించకుండా 543 స్థానాలనే కొనసాగించారు. అంతేకాదు మరో 25 ఏళ్ల వరకు అంటే 2026 వరకు డీలిమిటేషన్ ప్రక్రియను చేయరాదని 84వ సవరణ ద్వారా పార్లమెంట్‌లో ఒక చట్టం చేశారు.



1952లో అప్పటి భారత ప్రభుత్వం జనాభా పెరుగుదలను అదుపులో పెట్టడం కోసం ఫ్యామిలీ ప్లానింగ్ ప్రోగ్రామ్‌ను తెరపైకి తీసుకొచ్చింది.1976 తర్వాత ఈ కార్యక్రమం ఉధృతంగా కొనసాగింది.కేంద్రం ఆదేశాల ప్రకారమే దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను అమలు చేయడంలో చాలా చురుకుగా వ్యవహరించాయి. జనాభా పెరగకుండా చూసుకోవడంలో విజయం సాధించాయి.దీంతో ఉత్తరాది రాష్ట్రాల జనాభాతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల జనాభా పెరుగుదల చాలా వరకు తగ్గింది. కానీ దక్షిణాది రాష్ట్రాలు సాధించిన ఈ విజయమే ఇప్పుడు తమ పాలిట శాపమైంది.ఎందుకంటే జనాభా ప్రాతిపదికనే నియోజకవర్గాల పునర్విభజన జరగనుండటంతో ఎక్కువ జనాభా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ లోక్‌సభ స్థానాలు పెరుగుతాయి.తక్కువ జనాభా ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు లోక్ సభ స్థానాల సంఖ్య తగ్గుతుంది.ఇది కేవలం లోక్‌సభలోనే కాదు రాజ్యసభలో రాష్ట్రాలకు కేటాయించే రాజ్యసభ సభ్యుల సంఖ్యపై కూడా అంతే ప్రభావం చూపిస్తుంది.దీంతో భవిష్యత్‌లో పార్లమెంట్‌లో అన్ని రకాలుగా తమ రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోతుంది. దీని వల్ల పార్లమెంట్‌లో తమ డిమాండ్లను వినిపించే అవకాశాలు,హక్కులతో పాటు కేంద్రం ఇచ్చే నిధులను కూడా కోల్పోతుంది.ప్రస్తుతం లోక్‌సభలో మొత్తం 543 స్థానాలు ఉండగా అందులో దక్షిణాది రాష్ట్రాల నుండి 129 మంది లోక్‌సభ సభ్యులున్నారు.అంటే మొత్తం సంఖ్యలో ఇది కేవలం 24 శాతం మాత్రమే.1951,1961,1971 జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ స్థానాలు పెరిగిన తీరు చూస్తే ఇప్పుడున్న జనాభా ప్రకారం ప్రతీ ఇరవై లక్షల మందికి ఒక లోక్‌సభ స్థానం ప్రకారం విభజించే అవకాశం ఉంది. అలా చూసుకుంటే మొత్తం లోక్‌సభ స్థానాలు 543 నుండి 753కు పెరుగుతాయి. అప్పుడు తెలంగాణకు మూడు స్థానాలు పెరిగి 20,ఆంధ్రప్రదేశ్‌కు మూడు స్థానాలు పెరిగి 28 అవుతాయి. అలాగే తమిళనాడుకు 2 స్థానాలు పెరిగి 41, కర్నాటక 8 స్థానాలు పెరిగి 36కు చేరుతాయి. కేరళకు ఒక స్థానం తగ్గి 19 స్థానాలు ఉండను న్నాయి.పెరగబోయే మొత్తం 753 స్థానాల్లో దక్షిణాది రాష్ట్రాల వాటా కేవలం 144 మాత్రమే ఉంటుంది.అంటే మొత్తం పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల వాటా ఇప్పటి వరకు ఉన్న 24 శాతం నుండి 19 శాతానికి తగ్గుతుంది. ఇప్పటికే ఎనభై లోక్‌సభ స్థానాలతో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నెంబర్‌వన్ స్థానంలో ఉంది.అందుకే కేంద్రంలో అధికారంలోకి రావాలంటే ఏ పార్టీకైనా యూపీలో విజయం ఎంతో ముఖ్యం. 2026 డీలిమిటేషన్ తర్వాత యూపీలో లోక్‌సభ స్థానాల సంఖ్య 80 నుండి 128కి పెరిగే అవకాశం ఉంది. అదే కానీ జరిగితే ఈ నియోజకవర్గాల పునర్విభజనతో ఎక్కువ లాభం పొందే రాష్ట్రం యూపీ అవుతుంది.

ఇక ప్రస్తుతం యూపీలో ఎక్కువగా ఏ పార్టీ హవా నడుస్తుందో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పనిలేదు. ఆ తర్వాత మరింత లాభం పొందే రాష్ట్రాల్లో బీహార్. యూపీ తర్వాత ఎక్కువ జనాభా ఉన్న బీహార్‌లో ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల సంఖ్య 40 నుండి 70కి, మహారాష్ట్రలో ఇప్పుడున్న 48 లోక్‌సభ స్థానాల నుండి 68కి, మధ్యప్రదేశ్‌లో ఇప్పుడున్న 29 స్థానాల నుండి 47కు, అలాగే రాజస్థాన్‌లో 25 స్థానాల నుండి 44 స్థానాలకు పెరిగే అవకాశముంది. ఈ అంచనాల ప్రకారం దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం భారీగా తగ్గిపోనుండగా ఉత్తరాది రాష్ట్రాల ప్రాతినిధ్యం భారీగా పెరిగిపోనుంది. అంటే దక్షిణాది రాష్ట్రాలు భయపడుతున్నట్టు ఇక్కడి ఓట్లు, సీట్లతో సంబంధం లేకుండానే ఉత్తరాది సీట్లతోనే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయొచ్చు. బీజేపీ వాదన ప్రకారం సీట్లు పెరుగుతాయన్నది నిజమే. కానీ ఇదే సమయంలో ఉత్తరాదికి ఎన్ని సీట్లు పెరుగు తున్నాయో చెప్పడం లేదు.ఎందుకంటే ఉత్తరాదికి పెరిగే సీట్లతో పోల్చితే దక్షిణాదిన పెరిగే సీట్ల శాతం చాలా తక్కువ. ఒక్కముక్కలో చెప్పాలంటే దక్షిణాది ఎంపీ సీట్లు అక్కర్లేకుండానే ఉత్తరాదిన గెలిచే సీట్లతో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయొచ్చు.అలాంటప్పుడు దక్షిణాది రాష్ట్రాలకు రాజకీయంగా ఎలాంటి ప్రాధాన్యతా ఉండక పోవచ్చు.పైగా నియో జకవర్గాల సంఖ్యను బట్టే నిధులు విడుదలవుతాయి.దక్షిణాదికి వచ్చే నిధుల్లోనూ భారీ కోత పడొచ్చు. అంతిమంగా తాజా జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేస్తే మాత్రం దక్షిణాదికి అన్ని విషయాల్లో మొండిచెయ్యే అనేది రాజకీయ పార్టీలు,రాజకీయ విశ్లేషకుల మాట. అయితే ఈ డీలిమిటేషన్‌పై దక్షిణాదిన పెద్ద చర్చే జరుగుతోంది. కాకపోతే ఒక్క తమిళనాడు మినహా ఏ రాష్ట్రం కూడా దీనిపై సీరియస్‌గా పోరాడటం లేదు.కాబట్టి చైతన్యపూరితమైన చరిత్ర కలిగిన దక్షిణాది రాష్ట్రాలు ఇకనైనా ఈ అంశంపై ఐక్యంగా పోరాడితేనే కేంద్రం నుంచి రావాల్సిన వాటాలు దక్కుతాయి. ■

ప్రస్తుతం లోక్‌సభలో మొత్తం 543 స్థానాలు ఉండగా అందులో దక్షిణాది రాష్ట్రాల నుండి 129 మంది లోక్‌సభ సభ్యులున్నారు.అంటే మొత్తం సంఖ్యలో ఇది కేవలం 24 శాతం మాత్రమే. 1951,1961,1971 జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ స్థానాలు పెరిగిన తీరు చూస్తే ఇప్పుడున్న జనాభా ప్రకారం ప్రతీ ఇరవై లక్షల మందికి ఒక లోక్‌సభ స్థానం ప్రకారం విభజించే అవకాశం ఉంది. అలా చూసుకుంటే మొత్తం లోక్‌సభ స్థానాలు 543 నుండి 753కు పెరుగుతాయి. అప్పుడు తెలంగాణకు మూడు స్థానాలు పెరిగి 20,ఆంధ్రప్రదేశ్‌కు మూడు స్థానాలు పెరిగి 28 అవుతాయి. అలాగే తమిళనాడుకు 2 స్థానాలు పెరిగి 41, కర్నాటక 8 స్థానాలు పెరిగి 36కు చేరుతాయి. కేరళకు ఒక స్థానం తగ్గి 19 స్థానాలు ఉండనున్నాయి.

ఆటో డ్రైవర్ల సమస్యలపై యుగేందర్‌ని కలిసిన ఐఎన్టీయుసి నాయకులు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐఎన్టీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు తుమ్మల యుగేందర్‌ని కలిశారు. ఆటో కార్మికులకు తుమ్మల నాగేశ్వరరావు సహాయ సహకారాలు ఉంటాయని, ఎవరూ అధైర్య పడవద్దని యుగేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ విప్లవ కుమార్, పటేల్, పార్లమెంటరీ అధ్యక్షులు ఎస్కే సత్తార్మియా, నగర అధ్యక్షులు జంగిపల్లి ప్రసాద్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుక్కల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు డి మార్ట్ జానీ, జిల్లా కార్యదర్శి వల్లపు దేవ, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం వెంకట్ నాయుడు, నగర కార్యదర్శి నవీన్ భీమ్ రావు, పాల్గొన్నారు.

చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి పంపిణీ

నవతెలంగాణ-చింతకాని



చేతన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం చింతకాని మండల పరిధిలోని కొదుమూరు, ప్రొద్దుటూరు, నేరడలో చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చేతన్ ఫౌండేషన్ జాయింట్ సెక్రటరీ దొడ్డ సీతారామయ్య, ఫౌండేషన్ సభ్యులు చంద్రకాని నవీన్, షేక్ రషీద్ మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రోత్సహిస్తూ సామగ్రి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దొడ్డపనేని కృష్ణారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



ఖాళీగా ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ కుర్చీ



కార్యాలయానికి ఆలస్యంగా వస్తున్న సూపరింటెండెంట్



ముందెఇంటికి వెళ్తున్న ఉపాధి హామీ సిబ్బంది



ఖాళీగా ఉన్న సూపరింటెండెంట్ కుర్చీ



ఆలస్యంగా వస్తున్న సీనియర్ అసిస్టెంట్

కలెక్టర్ సాబ్.. ఇదర్ దేఖో..

సమయపాలన పాటించని అధికారులు

నవతెలంగాణ-కొణిజర్ల

ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు సమయపాలన పాటించడం లేదనేది విమర్శలు వస్తున్నాయి. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌కి కూతవేటు దూరంలో ఉన్న కొణిజర్ల మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది విధులకు ఆలస్యంగా రావడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 9.30 నుంచి 10 గంటల లోపు కార్యాలయానికి రావాల్సిన అధికారులు ఒకరి తర్వాత ఒకరు దర్జాగా 10.40కి వస్తుండటం విశేషం. మండల పరిషత్ కార్యాలయంలో కీలక అధికారులు సమయానికి కార్యాలయానికి వచ్చిన కొంతమంది సిబ్బంది సమయంతో మాకేంటి మాకు నచ్చిన టైం కి మేము వస్తామున్నట్లు మమ్మల్ని అడిగేవారు లేరన్నట్లు వ్యవహరిస్తుండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయం తోపాటు తహశీల్దార్, ఉపాధి హామీ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది కూడా విధులకు ఆలస్యంగా వస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని పలు కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది తరచుగా ఆలస్యంగా రావడం అనేది ఆనవాయితీగా మారిందని సమయపాలన పాటించకుండా వచ్చే కొంతమంది అధికారులు మాత్రం హాజరేసుకుని ఆఫీస్ టైం పూర్తికాకుండానే మధ్యలోనే వెళ్లిపోతున్నారని తోటి సిబ్బంది పేర్కొనడం విశేషం. పనులు వదులుకొని వివిధ పథకాలకు సంబంధించిన వివరాలు తెలుసుకొనేందుకు అధికారులను కలవడానికి కార్యాలయానికి వస్తున్న ప్రజలకు అధికారులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికార, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వికలాంగులు, వృద్ధులు వాపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలపై పర్యవేక్షణ లేక సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఇప్పటికైనా కలెక్టర్, జిల్లా అధికారులు స్పందించి సమయపాలన లేకుండా విధులు నిర్వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఎన్డీ కార్యకర్త మాలతి మృతి

నవతెలంగాణ-కొణిజర్ల

సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సీనియర్ కార్యకర్త రామనర్సయ నగర్ గ్రామానికి చెందిన అరుణోదయ నాయకురాలు బానోతు మాలతి అనారోగ్యంతో మంగళవారం అర్ధరాత్రి మృతి చెందారు. బుధవారం విషయం తెలుసుకున్న సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.వెంకటేశ్వరరావు, పిఓడబ్ల్యు జాతీయ నాయకులు ఝాన్సీ, ఐఎఫ్టియు రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న, లక్ష్మక్క మాలతికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంతాప వైరా సబ్ డివిజన్ కార్యదర్శి షేక్ ఖాసిం అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.రాజేంద్రప్రసాద్, సిఎల్సీ జిల్లా నాయకులకు విప్లవ కుమార్, ఎం.గిరి, కోలా లక్ష్మీనారాయణ మాస్ లైన్ జిల్లా నాయకులు అర్జున్ రావు, లాల్మియా పాల్గొన్నారు.

పెరిగిన ఇంటి పన్నుల భారం తగ్గించాలి





- కేరళ తరహాలో ఉపాధి హామీ అమలు చేయాలి
- ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపచేయాలి
- డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలి
- రేషన్ కార్డులు, పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి
- జర్నలిస్టులకు ఇండ్ల కోసం ఎన్ఎస్పీ క్వార్టర్స్ స్థలాన్ని కేటాయించాలి
- సీపీఐ(ఎం) నేతలు భూక్య వీరభద్రం, బొంతు రాంబాబు
- పార్టీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ఎదుట మహాధర్నా

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల స్థానిక సమస్యలను పరిష్కరించాలని ఎర్రదండు పోరుబాట పట్టింది. సీపీఐ(ఎం) వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గత 20 రోజుల నుండి మున్సిపాలిటీ పరిధిలో చేసిన సర్వేలో ప్రజలు తెలిపిన పలు రకాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం వైరా మున్సిపాలిటీ వద్ద వందల సంఖ్యలో ప్రజలు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో భారీగా పెంచిన ఇంటి పన్నులు తగ్గించాలని, ఇందిరమ్మ కాలనీ వద్ద వాగుకు కరకట్ట నిర్మాణం చేపట్టాలని, పల్లిపాడు డబల్ బెడ్రూమ్ ఇండ్ల వద్ద, గంధం టవర్స్ వద్ద శాశ్వత సైడ్ డ్రయినేజీ నిర్మాణం చేపట్టాలని, డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని, సత్రం బజార్ రోడ్డు డ్రయినేజీ పునః నిర్మించాలని, కేరళ తరహాలో పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ చట్టం అమలు చేయాలని, ఉపాధి హామీతో సంబంధం లేకుండా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలని, కరెంటు లైన్లకు మిడిల్ పోల్స్ ఏర్పాటు చేయాలని, పెండింగులో ఉన్న రేషన్ కార్డులు, వితంతు, వృద్ధాప్య వికలాంగుల పెన్షన్లు మంజూరు చేయాలని, ప్రధానమైన డ్రైనేజీలను, అంతర్గత రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సోమవరంలో స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని, గండగలపాడులో శ్మశాన వాటికను నిర్మించాలని, జర్నలిస్టులకు ఎన్ఎస్పి క్వార్టర్స్ స్థలాన్ని కేటాయించాలని, వైరాలో ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయాలని, నివాస గృహాలు అన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ప్రారంభించిన అభివృద్ధి పనులన్నింటినీ వేగంగా పూర్తి చేయాలని కోరారు. కోతులు, కుక్కల బెడదను నివారించాలని, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు తొలగించి పారిశుద్యం మెరుగు పరచాలని డిమాండ్ చేస్తూ మున్సిపాలిటీ కమిషనర్ వేణుకు వినతి పత్రాన్ని అందజేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే ప్రజలను సమీకరించి భారీ ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

అనంతరం కమీషనర్ వేణు మాట్లాడుతూ తన పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తానని, మిగిలిన సమస్యలను పై అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు, దుగ్గి కృష్ణ, మచ్చ మణి, తోట నాగేశ్వరరావు, చెరుకుమల్లి కుటుంబరావు, దొంతెబోయిన నాగేశ్వరరావు, బాణాల శ్రీనివాసరావు, తూము సుధాకర్, బొంతు సమత, గుడిమెట్ల రజిత, కొంగర సుధాకర్, హరి వెంకటేశ్వరరావు, గుడిమెట్ల మోహన్ రావు, పైడిపల్లి సాంబశివరావు, రాచబంటి భద్రిరన్న, అనుమోలు రామారావు, తోట కృష్ణవేణి, కామినేని రవి, మల్లెంపాటి రామారావు, కురుగుంట్ల శ్రీనివాసరావు, అమరనేని కృష్ణ, మల్లేంపాటి ప్రసాదరావు, సంక్రాంతి పురుషోత్తం, కంసాని మల్లికాంబ, ఒర్సు సీతారాములు, యనమద్ది రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.



పలు గ్రామాల్లో ఐద్వా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-కొణిజర్ల

అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండలంలోని తీగలబంజర, చిన్నగోపతి, కాచారం గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించి ఐద్వా జెండాలను ఎగరవేశారు. ఈ సందర్భంగా తీగలబంజరలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ, మండల కార్యదర్శి, అధ్యక్షురాలు తాతా పద్మ, బోలమాల సరోజినిలు మాట్లాడుతూ అప్పటి మద్రాసు నగరం ఇప్పటి చెన్నై నగరంలో జరిగిన మొట్టమొదటి మహాసభలోనే ఐద్వా ఏర్పడిందన్నారు. అంతకుముందు అనేక రాష్ట్రాల్లో వివిధ పేర్లతో సంఘం పనిచేస్తూ వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘంగా, పశ్చిమ బెంగాల్లో పశ్చిమబంగా గణతంత్ర మహిళా సమితిగా మహారాష్ట్రలో కామ్ మహిళ సమితిగా అలా కేరళ, తమిళనాడు, పంజాబ్‌తోపాటు అనేక రాష్ట్రాల్లో మహిళా సంఘం ఏర్పడి పనిచేస్తూ వచ్చిన 1981లో జరిగిన మొదటి మహాసభతో అఖిలభారతస్థాయి రూపం తీసుకుని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘంగా ఆవిర్భావించిందన్నారు. దేశంలో లో రాష్ట్రంలో మహిళ ల సమస్యలపై నికరంగా పోరాడేది ఐద్వా మాత్రమేనని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు తాళ్లపల్లి విజయ, మండల నాయకులు కట్టా విజయ, దండా వెంకటనర్సమ్మ, కొచ్చెర్ల కుమారి, కంటిపూడి రత్న, లింగాల కుమారి, లింగాల రాయేలు, సీపీఎం వైరా డివిజన్ నాయకులు బోయినపల్లి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలు షురూ

- సిరులు కురిపిస్తున్న 126 రకం ధాన్యం
- ఎకరానికి 60 నుండి 70 బస్తాలు దిగుబడి
- రైతన్నల హర్షం

నవతెలంగాణ-కల్లూరు

రబీ సీజన్ వరి పంట కోతలు రైతులు ప్రారంభించారు. మండలంలో సుమారు 30 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎర్రబోయినపల్లి గ్రామంలో నవంబర్‌లోనే రబీ వరి చేయడంతో ముందస్తుగానే కోతలుకొచ్చాయి. ఇప్పటి నుండి ఇక అన్ని గ్రామాల్లో రెండు నెలల పాటు వరి కోతలు జరుగుతాయి. రబీ సీజన్లో ఈసారి రైతులు 126 అనే రకం ధాన్యాన్ని ఎక్కువ మొత్తంలో సాగు చేయగా ఎకరానికి 60 నుంచి 70 బస్తాల దిగుబడి వస్తోంది. ఎర్రబోయినపల్లిలో పొట్రూ మధు అనే రైతు తనకున్న పది ఎకరాల్లో 126లు సాగు చేశారు. మొత్తం పది ఎకరాల్లో 700 బస్తాలు దిగుబడి వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. వరి కోసిన వెంటనే పచ్చిధాన్యాన్ని అమ్మితే 77 కేజీలు బస్తాను 1550 అమ్మడంతో రూ 10,85000 వచ్చాయని రైతు ఆనందంతో తెలిపారు. ఈ విధంగా మండలంలో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. మొదటిసారి కొత్త రకం ధాన్యం సాగు చేయటం వాతావరణం అనుకూలించడం వల్ల మంచి దిగుబడి వస్తుంది.



ఐద్వా ఐక్య పోరాటాలు ద్వారా ఎన్నో విజయాలు సాధించాం

- రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ
- ఘనంగా ఐద్వా ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ ఖమ్మం

ఐద్వా ఐక్య పోరాటాలు ద్వారా ఎన్నో విజయాలు సాధించామని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ అన్నారు. బుధవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఐద్వా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘం రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి జెండా ఆవిష్కరించారు. అనంతరం మెరుగు రమణ అధ్యక్షతన జరిగిన సభలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ మాట్లాడుతూ 1981లో ఐద్వా ఆవిర్భవించిందని, నాటికి దేశంలో మహిళలు హత్యలకు, అత్యాచారాలకు, హింసకు, శ్రమదోపిడీకి గురవుతుంటే వారిని మేల్కొల్పడం కోసం ఐద్వా ఆవిర్భావం జరిగిందన్నారు. నాటినుండి నేటి వరకూ అలుపెరగకుండా దేశవ్యాప్తంగా మహిళలపై ఎక్కడ అన్యాయాలు జరిగినా స్పందిస్తూ, వారికి సామాజిక స్పృహ అందిస్తూ పోరాటాలు నిర్వహిస్తుందని ఆమె అన్నారు. ఐద్వా పోరాట ఫలితంగా ప్రభుత్వాలు కొన్ని రాయితీలు ఇస్తున్నారని, హింసకు వ్యతిరేకంగా కొన్ని చట్టాలు సాధించామని, ఇవి ఐద్వా ఐక్య పోరాటాలు ద్వారా సాధించిన విజయాలని ఆమె అన్నారు.

సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలను వంటింటికే పరిమితం చేసే గత, ప్రస్తుత, పాలక ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తుందని చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేసినప్పుడే మహిళా సాధికారిక సాధ్యమవుతుందని ఆమె అన్నారు. కానీ నేటి బీజేపీ పాలకులకు మహిళలను మను ధర్మశాస్త్రం ఆధారంగా వంట ఇంటికి, కుటుంబానికి, సేవ చేయడానికి ఉండాలని మహిళలు స్వేచ్ఛగా తిరగరాదని ఆంక్షలు పెట్టి మూఢ విశ్వాసాలం, సనాతన సాంప్రదాయాలు ఆచారాలు, పెంచి వాటి మాటున మహిళల శ్రమ దోపిడీకి పాల్పడుతుందని ఆమె విమర్శించారు. నేటికీ 46 శాతం మహిళలు రక్తహీనతతో బాధపడుతుంటే వారికి ఆహార పదార్థాలు అందించడంలో గాని వైద్యం అందించడంలో గాని ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు. కేంద్ర బడ్జెట్లో ఏటేటా ఆహార భద్రతకు బడ్జెట్ తగ్గించి మహిళలకు అన్యాయం చేస్తున్నారని ఆమె అన్నారు. మహిళా సాధికారతకు చట్టసభల్లో రిజర్వేషన్లు అమలు చేయడం ఒక్కటే మార్గం అన్నారు. మహిళల హింసకు కారణమైన మద్యం అమ్మకాలను, పబ్బులను, సెక్స్ సాహిత్యాన్ని, పాలకులు ఆదాయ వనరులుగా చూస్తున్నారని వాటిని వెంటనే నివారించాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో 30 శాతం నిధులు కేటాయించాలని కేరళ తరహాలో రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను ప్రతి తెల్ల రేషన్ కార్డుదారులకు అందించాలని ఆమె డిమాండ్ చేశారు. ఉపాధి హామీ డిమాండ్‌కు కనుగుణంగా కేంద్ర బడ్జెట్లో 3 లక్షల కోట్లు కేటాయించాలని, గ్రామీణ ప్రాంతాల్లో 200 రోజులు పని కల్పించాలని, రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని, పట్టణ ప్రాంతాలకు విస్తరించాలని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం నేపథ్యంలో సరిపడా బస్సులు ఏర్పాటు చేయాలని, శివారు అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బండి పద్మ, జిల్లా నాయకురాలు పీ.నాగసులోచన, బీబీ, భాగం అజిత, ఎన్ కుమారి, నందిపాటి పావని, పి. ప్రమీల, పి.శరణ్య వెంకటలక్ష్మి, కోటేశ్వరి, భూలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్నం భోజన వర్కర్ల

సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా నాయకులు సుంకర సుధాకర్

నవతెలంగాణ-వైరాటౌన్

మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం పదివేల రూపాయల వేతనం అందించాలని సీఐటియూ వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వైరా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం సిబ్బంది పమ్మి అశోక్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా నాయకులు సుంకర సుధాకర్ మాట్లాడుతూ కిరాణం షాపులలో అప్పులు చేసి పిల్లలకు భోజనం వండి పెడుతున్నారని, కానీ ప్రభుత్వం భోజనం వర్కర్ల బిల్లులు చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం కోడి గుడ్ల బిల్లులు, 3 నెలల వేతనాలు పెండింగులో ఉన్నాయని, దీంతో కార్మికులు అప్పులపాలై పోతున్నారని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేటి రోజుల్లో నెలనెలా వేతనాలు అందించకుండా, బిల్లులు విడుదల చేయకుండా ఆపడం సరైన పద్ధతి కాదని, ప్రస్తుతం కేటాయించిన బడ్జెట్ పాత మెనూకే సరిపోదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడి సెంటర్ లాగానే మధ్యాహ్నం భోజనం వర్కర్లకు కూడా గుడ్లు అందించాలని, పెండింగు నెలల వేతనాలు, బిల్లులు అందించాలని, అన్ని పాఠశాలలకు గ్యాస్ ఉచితంగా సరఫరా చేయాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఎన్నికల సమయంలో మధ్యాహ్నం భోజనం వర్కర్లకు ఇస్తానన్న పదివేల రూపాయల వేతనం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు వైరా పట్టణ కన్వీనర్ అనుమోలు రామారావు, మధ్యాహ్న భోజన వర్కర్లు ప్రమీల, త్రివేణి, కరుణ, తదితరులు పాల్గొన్నారు.



నేటి నుండి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు ప్రదర్శన

నవతెలంగాణ-వేంసూరు

అంతరించిపోతున్న ఒంగోలు జాతి సంపదను మరొకసారి గుర్తు చేస్తూ నేటి సమాజానికి కనువింపు కలిగే విధంగా కందుకూరు శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా ముందుకు తీసుకొస్తున్నారు. గొర్ల సత్యనారాయణ రెడ్డి(బుల్లి బాబు) జ్ఞాపకార్థం జాతీయస్థాయి ఒంగోలు జాతి వృషభ రాజాల బండ లాగుడు ప్రదర్శన నేటి నుండి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు గొర్ల వెంకటప్ప రెడ్డి బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఒంగోలు జాతి వృషభ రాజామునకు మాత్రమే పోటీలలో ప్రవేశం ఉంటుందని ఒక విభాగంలో ప్రదర్శించిన వాటిని మరొక వాటిలో అవకాశం లేదని కందుకూరులో ఐదవ సారి నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనకు భారీ జన సమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. మహిళలకు ప్రత్యేకంగా గ్యాలరీలు ఏర్పాటు చేశామని, ఎండ తీవ్రత తగ్గట్టుగా టెంట్లు, మంచినీటి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఈ ప్రదర్శనకు రిఫర్ గా సూరపనేని రాధాకృష్ణ వ్యవహరిస్తారు తుది నిర్ణయం కమిటీ వారిదేనని అన్నారు. మూడు విభాగాల్లో నిర్వహించే ఈ ప్రదర్శనలకు మొదటి కేటగిరి జూనియర్స్, సీనియర్స్ విభాగంలో నిర్వహించనున్నారు. గెలిచిన వారికి బహుమతుల ప్రదానం ఉంటుంది.





స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి

- రైతు సంఘం రాష్ట్ర బాగం హేమంతరావు

నవతెలంగాణ-మధిర

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు తెలిపారు. బుధవారం మడుపల్లి సీపీఐ కార్యాలయంలో రైతు సంఘం మూడో మండల మహాసభలో బాగం హేమంతరావు మాట్లాడుతూ వైరాలో నిర్వహించే రైతు సంఘం జిల్లా మహాసభలు జయప్రదం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, మందడపు రాణి, మండల కార్యదర్శి ఓట్ల కొండల్‌రావు, జిల్లా సమితి సభ్యులు ఎంఏ రహీం, పెరుమాళ్ళపల్లి ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

నవతెలంగాణ-ఖమ్మం

విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించేదాని కోసం చేసే పోరాటంలో కలిసి వస్తామని వక్తలు అన్నారు. బుధవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రముఖ లెక్చరర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గ వీటి సరళ మాట్లాడుతూ విద్యా రంగ బలోపేతం కోసం పోరాటాలే మార్గమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తుందని, వారు ఏదైతే ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పారు. దానిని అమలు చేయాలని, అట్లాగే 15 శాతం నిధులతో విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కారం కావని, 30 శాతం నిధులను కేటాయించి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి నిధులను పెంచాలని, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్ రియంబర్స్మెంట్స్ విడుదల చేయాలని, అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలకు సంక్షేమ హాస్టళ్లకు సొంతభవనాలను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని, యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసి ఇంటిగ్రేటెడ్ కోర్సులను ప్రవేశపెట్టాలని, ముఖ్యంగా రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యారంగ బలోపేతం కోసం కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకురాలు మాచర్ల భారతి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, జార్జిరెడ్డి పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు మందా సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మెరుగు రమణ, బండి పద్మ, పిఎన్ఎమ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీనారాయణ, సదానంద్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.సుధాకర్, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి మస్తాన్, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్, పిడిఎస్యు నాయకులు అజయ్, నాయకులు వినోద్, మనోజ్, శ్రీనాథ్, లోకేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- దందాకు అడ్డుకట్ట వేసేదెవరు?
- రాత్రి సమయంలోనే రవాణా
- అధికారుల తీరుపై విమర్శల వెల్లువ

నవతెలంగాణ - బోనకల్



ఒకప్పుడు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వారు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడేవారు. గత కొన్ని నెలలుగా ఆ దందా కొంత తగ్గింది. తెలంగాణ ప్రాంతం నుంచి అక్రమ ఇసుక రవాణా తగ్గగా గత కొన్ని నెలలుగా ఆంధ్ర ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణా రాత్రి సమయంలో అడ్డు అదుపు లేకుండా యథేచ్ఛగా కొనసాగుతూనే ఉంది. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇసుక రవాణాపై నిబంధనలను విధించింది. అందులో భాగంగా మండల తహసిల్దార్ అనిశెట్టి పొన్నం చందర్ మండల పరిధిలోని కొన్ని గ్రామాల ఇసుక రీచ్‌లో ఉన్నట్లు ప్రకటించారు. ఆ ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక తీసుకెళ్లాలంటే ప్రభుత్వం జారీ చేసిన కూపన్ ఉండాలని, అది కూడా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకే వినియోగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో 70 నుంచి 80 శాతం వరకు అక్రమ ఇసుక రవాణా ఆగింది. కానీ అక్రమ ఇసుక రవాణాలో ఆరితేరిన ఓ ఇద్దరు ముగ్గురు మాత్రం ప్రభుత్వ అభివృద్ధి పథకాల పేరుతో ఇసుక అక్రమ రవాణా చేస్తూనే ఉన్నారు. దీనికి కారణం వారు అధికార పార్టీ వారు కావటంతో అధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. బోనకల్లు మండలంలో పరిస్థితి ఇలా ఉండగా ఆంధ్ర ప్రాంతంలోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండల పరిధిలోని లింగాల, పోలంపల్లి మున్నేరు నుంచి పెద్ద ఎత్తున ఇసుక బకాసురులు రాత్రి సమయంలో అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకను బోనకల్లు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు రూ.6వేల నుంచి 8 వేల వరకు, మరికొంత దూరం అయితే పదివేల వరకు వసూలు చేస్తున్నారు. ఒకవైపు మండల అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నప్పటికీ ఆంధ్ర ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణా మాత్రం ఆగటం లేదు. ఆంధ్ర ప్రాంతం నుంచి ప్రధానంగా మండల పరిధిలోని చొప్పకట్లపాలెం, చిరునోముల గ్రామాల మీదుగా రాత్రి సమయంలో ఈ ఇసుక అక్రమ రవాణా సాగుతుంది. ప్రధానంగా డబ్బాకుపల్లి, వత్సవాయి, పోలంపల్లి గ్రామాలకు చెందిన ఇసుక బకాసురులు అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారు. అయితే గత రెండు రోజులుగా బోనకల్ పోలీసులు మూడు ఇసుక అక్రమ ట్రాక్టర్లను పట్టుకున్నారు. ట్రాక్టర్ యజమాని, డ్రైవర్‌పై కేసు కూడా నమోదు చేశారు. ఆ మరుసటి రోజే మంగళవారం రాత్రి చింతకాని మండలం సీతంపేట నుంచి చొప్పకట్లపాలెం మీదుగా మండలంలోకి వస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న రెండు ఇసుక అక్రమ ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇది ఇలా ఉండగా అక్రమ ఇసుక రవాణా బకాసురుల మాత్రం తాము బోనకల్ మండల అధికారులతో మాట్లాడుకున్నామని ప్రచారం చేసుకోవడం విశేషం. తమ ట్రాక్టర్లు పట్టుకున్నా కేసులు నమోదు చేయరని, తాము మాట్లాడుకోవటానికే వెళుతున్నామని ఎవరి అవసరం తమకు అవసరం లేదని ఇసుక అక్రమ బకాసురులు చెప్పటం విశేషం. ఈ విధంగా ఇసుక అక్రమ బకాసురులు రెచ్చిపోవటంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని మండల ప్రజలు అంటున్నారు. ఆంధ్ర, తెలంగాణ సరిహద్దులో ఆంధ్ర ప్రాంతంలో అంతరాష్ట్ర చెక్ పోస్ట్ ఉండగా, బోనకల్ మండల కేంద్రంలో శ్రీ దుర్గా పిక్చర్ ప్యాలెస్ వద్ద వ్యవసాయ మార్కెట్ ఉంది. ఈ రెండు చెక్ పోస్టులను దాటి ఇసుక అక్రమ ట్రాక్టర్లు ఎలా వస్తున్నాయి అనేది ప్రశ్న. 24 గంటల పాటు ఈ రెండు చెక్ పోస్టులలో సిబ్బంది విధులు నిర్వహిస్తూ ఉండటం విశేషం. ఒకవేళ ఎవరైనా అక్రమ ఇసుక రవాణా గురించి ప్రశ్నిస్తే ఆంధ్ర ఇసుక అక్రమ రవాణా బకాసురులు బెదిరింపులకు పాల్పడుతున్నారని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా బోనకల్ మండల రెవిన్యూ, పోలీస్ శాఖల అధికారులు వెంటనే స్పందించి ఆంధ్ర ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టు వేయాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- సీపీఐ(ఎం) నేత పొన్నం వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-ఎర్రుపాలెం



మండల కేంద్రంలోని రామిశెట్టి పుల్లయ్య భవనంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశం బుధవారం నల్లబోతు హనుమంతురావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, పార్టీ డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాల్‌రావు మాట్లాడుతూ...ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, అర్హులందరికీ ఇల్లు, ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు, ఆరు గ్యారెంటీ పథకాలను అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సమస్యలను పట్టనట్లుగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. గ్రామాలలో ఇల్లు లేని పేదలు తమకు ఈ ప్రభుత్వంలోనైనా ఇల్లు వస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం ప్రకటించిన అర్హుల లిస్టులను తప్పులు తడకగా ఎంపిక చేస్తూ అర్హుల కంటే అనర్హులను ఎంపిక చేస్తూ గ్రామ సభలు నందు ప్రజా ఆగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వం కారణమైందని అన్నారు. అర్హత ఉన్న పేదలందరికీ ఎలాంటి రాజకీయ ప్రలోభాలు లేకుండా ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దివ్వేల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్, మండల కమిటీ సభ్యులు అంగోతు వెంకటేశ్వర్లు, గామసూ జోగయ్య, సగ్గుర్తి సంజీవరావు, దూదిగాం బసవయ్య, నాగులవంచ వెంకట్రామయ్య, షేక్ లాల్ సాహెబ్, పెసరమల్లి ఎమిల్లమ్మ, గొల్లపూడి పెద్ద కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలి

- సీపీఐ(ఎం) ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు హామీలను, వెంటనే అమలు చేయాలని కోరుతూ బుధవారం అన్నారుగూడెంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఇంటింటికి కరపత్రాన్ని పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి అయినాల రామ లింగేశ్వరరావు మాట్లాడుతూ రెండు లక్షల రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు, ఉచిత విద్యుత్తు, రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, 18 సంవత్సరాలు నిండిన విద్యార్థినిలకు స్కూటీలు అందజేస్తామని తదితర హామీలు ఇచ్చి ఎన్నికలలో గెలిచి హామీలను అమలు పరచడం లేదన్నారు. వంద రోజుల్లో పథకాలన్నీ అమలు చేస్తామని హామీ ఇచ్చి, 450 రోజులు అయినా అమలు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు నల్లమోతు మోహన్‌రావు, పార్టీ శాఖ కార్యదర్శి పులి వెంకట నరసయ్య, ముచ్చింతల చెన్నయ్య, ముచ్చింతల కోటమ్మ, అమర్లపూడి భవాని, తుశ్లూరు కృష్ణయ్య, తుమ్మలపల్లి వెంకటయ్య భాష, షేక్ షరీఫ్, పడాల సత్యం, షేక్ నాగులు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఐద్వా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ప్రభుత్వాలు సమాజంలో స్త్రీల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, మహిళల పట్ల వివిధ కార్యక్రమాల బాధ్యత తీసుకొని గ్రామాల్లో సదస్సులు పెట్టి అవగాహన కల్పించాలని ఐద్వా ఖమ్మం మండల కమిటీ సభ్యురాలు బాశెట్టి సుజాత అన్నారు. మండలంలోని నాయుడుపేట గ్రామంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సుజాత మాట్లాడుతూ...గత మూడు వేల సంవత్సరాలుగా మహిళలను వంటింటికే పరిమితం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. కులం, మతం పేరుతో పాలన సాగిస్తున్న మతోన్మాదులు ఈ దేశంలో మరల మనుస్మృతిని ప్రవేశపెట్టి మహిళలను వంటింటికే పరిమితం చేసేందుకు సిద్ధమవుతున్నారని విమర్శించారు. మహిళలందరూ ఐక్యంగా ఉండి మతోన్మాద శక్తులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మహిళకు నెలకు 2500 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు లింగాల విజయలక్ష్మి, శరణ్య, కొట్టే సరోజనమ్మ, కే.జయమ్మ, రాధిక, సుజాత, శోభ, చంద్రకళ, మమత, రజిని తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి : మహిళా రక్షణ కోసమే అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆవిర్భవించిందని, దేశంలో మహిళలకు ఎక్కడ అన్యాయం జరిగినా వారికి న్యాయం జరిగేంతవరకు ఐద్వా ముందుండి పోరాటం చేస్తోందని ఆ సంఘ సత్తుపల్లి మండల కార్యదర్శి జాజిరి జ్యోతి అన్నారు. ఐద్వా ఆవిర్భావ దినోత్సవ వేడుకను సంఘ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సిద్దారంలో నిర్వహించారు. ఐద్వా జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా జాజిరి జ్యోతి మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, హత్యలు, హింసలు, శ్రమదోపిడీలు జరుగుతున్న నేపథ్యంలో వారిని మేల్కొలిపేందుకు 1981లో ఐద్వా ఆవిర్భావం జరిగిందన్నారు. సంఘ నాయకురాలు ఎలగం పార్వతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు రేసు లక్ష్మి, వాసం నిర్మల, ఎలగం వెంకటలక్ష్మి, సుధారాణి, సమ్మక్క, చెన్నమ్మ, జయమ్మ, మంగ, రమాదేవి, కిరణ్మయి పాల్గొన్నారు.

మహిళా హక్కుల కోసం ఐద్వా నిరంతరోద్యమం: ఐద్వా పట్టణ అధ్యక్షురాలు పాకలపాటి ఝాన్సీ



మహిళా హక్కులు, రక్షణ కోసం ఐద్వా నిరంతరంగా పోరాటాలను నిర్వహిస్తోందని ఆ సంఘ సత్తుపల్లి పట్టణ అధ్యక్షురాలు పాకలపాటి ఝాన్సీ అన్నారు. బుధవారం ప్రజా సంఘాల కార్యాల యం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఝాన్సీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఐద్వా జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు చావా కవిత, సత్యవతి, బసవమ్మ, రేణుక, కల్పన, రాధిక, శ్రావణి, ఆమని, పాల్గొన్నారు.

వైరాటౌన్ : వైరా మండలం విప్పలమడక గ్రామంలో గడేపల్లి మాధవి అధ్యక్షతన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆవిర్భావ దినోత్సవం జరిగింది. ఐద్వా జెండాను వైరా మండల అధ్యక్షురాలు బాణాల వెంకట్రావమ్మ ఎగరవేశారు. కార్యక్రమంలో ఐద్వా గ్రామ నాయకులు గరిడేపల్లి స్వరూప, గరిడేపల్లి కళావతి, కావేరి తదితరులు పాల్గొన్నారు.

వైరా మండలం రెబ్బవరం గ్రామంలో భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామ కార్యదర్శి షేక్ సైదాబీ అధ్యక్షతన ఐద్వా జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ, మండల అధ్యక్షురాలు బాణాల వెంకట్రావమ్మ ప్రసంగించారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు షేక్ హుస్సేన్ బి.తిరుమలదాసు, రాములమ్మ, వెంకటలక్ష్మి, బండి ఉష, ఎంకమ్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి : దేశంలో అనేక రూపాలలో మహిళ అణచివేత సాగుతుందనిదానికి వ్యతిరేకంగా బలమైన ఐక్య ఉద్యమం అవసరమని ఐద్వా కారేపల్లి మండల ఐద్వా అధ్యక్షకార్యదర్శులు సూరబాక ధనమ్మ, కే.ఉమావతిలు అన్నారు. కారేపల్లి మండలం గాంధీనగర్, మాణిక్యారం, పాటిమీదిగుంపులో బుధవారం ఐద్వా అవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐద్వా పతాకాన్ని ఈసం లక్ష్మి, ఉమావతి, ధనమ్మలు ఎగరవేశారు. ఈసంధర్భంగా జరిగిన సభలో ఐద్వా నేతలు మాట్లాడుతూ మహిళలపై పెరుగుతు హింసోన్మాధం పెరిగిందని, మహిళా చట్టాలు, సమాన హక్కులు ఉన్నా సమస్యలు వేధిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు మహిళల ఓట్ల కోసం ఆకర్షనీయమైన హామీలు గుప్పించటం తర్వాత విస్మరించటం పరిపాటిగా మారిందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో మహిళలపై లైంగిక దాడులు హెచ్చుమిరాయన్నారు. రాష్ట్రంలో పేద మహిళలు రూ.2500 అమలుకు నోచుకోలేదని, బస్‌లను గ్రామీణ ప్రాంతాల్లో తిప్పకుండా, బస్‌ల సంఖ్య పెంచకుండా మహిళలకు ఉచిత బస్ సార్థకత లేదన్నారు. మహిళ సమస్యలపై ప్రజాసంఘాలతో కలిసి ఉద్యమాలు నిర్మించున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు కె.నీలిమ, సూరమ్మ, రామతార, అంబిక, నాగమణి, నిర్మల, రాంబాయి, లత తదితరులు పాల్గొన్నారు









చెరుకు సాగు విస్తీర్ణాన్ని పెంచాలి

- టన్నుకి 250 గ్రాములు ఉచిత చక్కెర పంపిణీ
- మధుకాన్ షుగర్స్ ఎమ్‌డి నామ కృష్ణయ్య

నవతెలంగాణ- నేలకొండపల్లి



మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో 2024-25 సీజన్‌లో ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేసిన రైతులకు టన్నుకి 250 గ్రాములు చొప్పున ఉచిత చక్కెర పంపిణీని బుధవారం మధుకాన్ షుగర్స్ ఎమ్‌డి నామ కృష్ణయ్య చేతుల మీదుగా రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా చెరకు సాగు వల్ల ఫ్యాక్టరీకి నష్టాలు వస్తున్నా రైతుల సంక్షేమం, శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని చెరుకు క్రసింగ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రాంత రైతుల అభివృద్ధి కోసమే నష్టాల్లో ఉన్న ఫ్యాక్టరీని కొనుగోలు చేశామన్నారు. అనేక రకాలుగా నష్టాలను భరిస్తూ రైతుల కోసమే అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. తాము చేస్తున్న సహకారానికి తోడుగా రైతులు కూడా మరింత విస్తీర్ణంలో చెరకు సాగు చేసి ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఇంటూరి అశోక్, తాళ్లూరి రవి, నెల్లూరి భద్రయ్య, సూరపనేని రామకృష్ణ, మంకెన వెంకటేశ్వరావు, తలశిల గోపాలరావు, చింతనిప్పు సైదులు, జటంగి వెంకన్న, బొనగిరిరి కిరణ్, దండా రంగయ్య, ఫ్యాక్టరీ అధికారులు ఏవిపి కోటయ్య, జీఎం వెంకటేశ్వర్లు, కేన్ డిజిఎం అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'సైలో' దీక్షల శిబిరానికి సింగరేణి డైరెక్టర్లు

- 31వ రోజుకు చేరిన సైలో నిరసన దీక్షలు
- డైరెక్టర్లు ఇచ్చే హామీలపై ఉత్కంఠ నెలకొంది

నవతెలంగాణ-సత్తుపల్లి



సింగరేణి ఏర్పాటు చేసిన కాలుష్య కారక సైలో బంకరును తీసెయ్యాలని డిమాండ్ చేస్తూ సత్తుపల్లి మండలం కిష్టారంలోని అంబేద్కర్‌నగర్, బీసీ కాలనీకి చెందిన సైలో బాధితులు చేపట్టిన నిరసన దీక్షలు ప్రారంభం నుంచి శాంతియుతంగా కొనసాగినప్పటికి మధ్యమధ్యలో రాస్తారోకోలు, మృతుల చిత్రపటాలతో ఆయా కుటుంబాల ప్రదర్శన, అర్ధనగ్న ప్రదర్శన ఇలా పలు విధాలుగా సైలో బంకరు బాధితులు ఆందోళన కార్యక్రమాలు కొనసాగినా సింగరేణి అధికారులు స్పందించకపోవడంతో తమను అనారోగ్యాల పాల్జేస్తున్న కాలుష్య కారక బంకరు ఏదైతే ఉందో దానినే స్తంభింపజేస్తేనే అధికారుల్లో కదలిక వస్తుందని నిర్ణయం చేసిన నేపథ్యంలో మంగళవారం ఆ బంకరును స్తంభింపజేశారు. రైలురోకో చేపట్టి బొగ్గు రవాణా జరక్కుండా, వ్యాగన్లలో బొగ్గును లోడింగు చేయకుండా బాధితులు అడ్డుకున్నారు. పట్టాలపై పడుకున్నారు. బంకరెక్కి దూకి చస్తామంటూ హెచ్చరించారు. పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకుంటామన్నారు. చిన్న పిల్లలు రైలు పట్టాలపై పడుకొని సైలో బంకరు నుంచి కాపాడాలంటూ సింగరేణి అధికారులను వేడుకున్నారు. బాధితుల ఆందోళన శిఖరాగ్రం చేరడంతో సింగరేణి అధికారుల్లో చలనం పుట్టింది. 13న ఇద్దరు సింగరేణి డైరెక్టర్లు, కొత్తగూడెం జీఎంతో మీ శిబిరం వద్దకు వచ్చి స్పష్టమైన హామీ ఇస్తారని జేవీఆర్ ఓసీ పీవో ప్రహ్లాద్ లిఖిత పూర్వకంగా రాసివ్వడంతో సైలో బంకరులో చేపట్టిన ఆందోళనను విరమించారు.

నేడు దీక్షల శిబిరం వద్దకు రానున్న సింగరేణి డైరెక్టర్లు

సైలో బంకరును తీసెయ్యాలని కోరుతూ కిష్టారంలోని అంబేద్కర్‌నగర్, బీసీ కాలనీ సైలో బాధితులు చేపట్టిన నిరసన దీక్షలు 31వ రోజుకు చేరుకోవడంతో పాటు బాధితుల ఉద్యమం పతాకస్థాయికి చేరుకుంటున్న క్రమంలో సింగరేణి దిగిరాక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే మంగళవారం సుమారు నాలుగున్నర గంటల పాటు రైలురోకోను బాధితులు చేపట్టడంతో బొగ్గు లోడింగ్, రవాణా నిలిచిపోయింది. దీంతో పై అధికారుల సూచనల మేరకు ఇక్కడి జేవీఆర్ ఓసీ పీవో ప్రహ్లాద్ సత్తుపల్లి సీఐ కిరణ్ సమక్షంలో 13న (గురువారం) సింగరేణి డైరెక్టర్లు, కొత్తగూడెం మీ శిబిరం వద్దకు వచ్చి స్పష్టమైన హామీ ఇస్తారని లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వడంతో సైలో దిగ్బంధన కార్యక్రమాన్ని బాధితులు తాత్కాలింగా విరమించారు. గురువారం సింగరేణి డైరెక్టర్లు శిబిరం వద్దకు వచ్చి సైలో బంకరు బాధితులకు ఏ విధమైన హామీ ఇస్తారనేది వేచిచూద్దాం.

31వ రోజుకు చేరిన సైలో నిరసన దీక్షలు

సైలో బంకరును తీసెయ్యాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే దీక్షల కార్యక్రమం బుధవారం నాటికి 31వ రోజుకు చేరింది. సైలో బంకర్నైనా తీయాలని, లేకుంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా 2013 భూసేకరణ చట్టం ప్రకారం పునరావాస ప్యాకేజీని ఇప్పించి తమను ఆదుకోవాలని సైలో బాధితులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మారోజు శ్రీను, పాలకుర్తి నాగేశ్వరరావు, మారోజు నాగేశ్వరరావు, కడారి మదీన, పాలకుర్తి ప్రభాకర్, పాలకుర్తి ప్రభుదాసు, వాడపల్లి కోటేశ్వరరావు, మారోజు అశోక్‌కుమార్, కిష్టపాటి కోటిరెడ్డి, వాడపల్లి అరుణ, కొత్తా లక్ష్మి, కొత్తా సాంబయ్య, వాడపల్లి అరుణ, రామాల నాగమణి, కొండా నాగరత్నం, వాడపల్లి నాగమణి, మారోజు నాగరాజు, పాలకుర్తి ప్రవీణ్, నరేంద్ర, ఏసమ్మ, కమలమ్మ, నిర్మల పాల్గొన్నారు.

ఆదివాసీ కమ్యూనిటీ హాల్ సాధనకై 15న చర్చా వేదిక

నవతెలంగాణ-దమ్మపేట

దమ్మపేటలో ఆదివాసీ కమ్యునిటి హాల్ సాధనకై ఈనెల 15వ తేదీన తుడుందెబ్బ ఆధ్వర్యంలో చర్చావేదిక నిర్వహిస్తున్నట్లు తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు బండారు సూర్యనారాయణ తెలిపారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 15వ తేదీ ఉదయం 9గంటలకు కమ్యునిటీ హాల్ స్థలం కొమరం భీమ్, సోయం గంగులు విగ్రహాల దగ్గరకు ఆదివాసీ పెద్దలు, యువత, అక్కలు, చెల్లెల్లు, అన్ని ఆదివాసీ సంఘాల నాయకులు హాజరు కావాలని పేర్కొన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ఆదివాసీ రా కదలి రా మన హక్కు సాధనకై కదలిరా అంటూ నినాదాలు చేస్తూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆన్‌లైన్‌లో 'నవమి' టికెట్లు బుకింగ్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఏప్రిల్ 6, 7 తేదీల్లో జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణం మహా పట్టాభిషేకం ఉత్సవాలకు బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో టికెట్లు అందుబాటులో ఉంటాయని అలయ ఈవో రమాదేవి తెలిపారు. కల్యాణానికి ఉభయదాతల టికెట్లు రూ.7,500, సెక్టార్ల టికెట్లు రూ.2,500, రూ.2,000, రూ.1,000, రూ.300, రూ.150, పట్టాభిషేక మహోత్సవానికి రూ.1,500, రూ.500, రూ.100 టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచామని వివరించారు. ఉత్సవాలకు రాలేని భక్తుల గోత్రనామాలతో కల్యాణం జరిపించే సేవల కోసం రూ.5,000, రూ.1,116 టికెట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. https://bhadradritemple.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా భక్తులు టికెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. వారు ఈనెల 20వ తేదీ ఉదయం 11 గంటల నుంచి ఏప్రిల్ 6వ తేదీ ఉదయం 6 గంటల వరకు దేవస్థానం సమీపంలోని తానీషా కల్యాణ మండపంలో ఒరిజినల్ గుర్తింపు కార్డు చూపించి టికెట్లు పొందాలని సూచించారు. నేరుగా విక్రయానికి ప్రత్యేక కౌంటర్లు ఈనెల 20వ తేదీ నుంచి భద్రాచలంలో నేరుగా సెక్టార్ టికెట్లు విక్రయించనున్నారు. రామాలయం వద్ద మెయిన్ కౌంటర్ తానీషా కల్యాణ మండపం సీఆర్వో కార్యాలయాల్లో కౌంటర్లు ఏర్పాటు చేశారు. భద్రాచలం ఆర్డీవో ఆఫీసు వద్ద వచ్చే నెల 1 నుంచి కౌంటర్ అందుబాటులో ఉంటుంది అని తెలియజేశారు.

కృత్రిమ మేధస్సుతో విద్యా బోధన ఎంతో ఉపయోగం

- చదువుల్లో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ
- ఐటిడిఏ పీఓ బి. రాహుల్

నవతెలంగాణ-బూర్గంపాడు



చదువులో వెనుకబడ్డ పిల్లలకు కృత్రిమ మేధస్సుతో విద్యాబోధన చేయడం పిల్లలకు ఎంతో ఉపకరిస్తుందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. బుధవారం మండలంలోని సారపాకలోని గాంధీనగర్ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కృత్రిమ మేధస్సుతో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చదువులో వెనుకపడ్డ పిల్లలను గుర్తించి విద్యార్థుల అభ్యాసన మెరుగుపడడానికి, విద్యార్థుల స్థాయిని అంచనా వేయడానికి ఇది ఎంతో ఉపకరిస్తుందని అన్నారు. అలాగే అభ్యాస కృ త్యాలు ప్రతి విద్యార్థికి నిర్వహించడం వలనవిద్యాభ్యాసం పట్ల పిల్లలలో మరింత ఉత్సాహం పెంపొందించవచ్చని ఆయన అన్నారు. కఠిన మైన పదాలు కాకుండా చిన్న తరగతుల వారికి ఇంగ్లీ షులో చిత్రాల ద్వారా కృత్యాలు నేర్పడం, గేమ్స్, లెసన్స్ సంబంధించిన వర్క్ బుక్ లాం టివి చిన్న చిన్న పదాలు అర్థమయ్యేలా నేర్పించాలని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బూర్గంపాడు మండలంలోని అంజనాపురం మోరంపల్లి బంజార, బూర్గంపాడు నాగినేని ప్రోలు, సారపాక లోని గాంధీనగర్ పాఠశాలలో పైలెట్ ప్రాజెక్టు కింద ప్రయోగాత్మకంగా ఈ కార్య క్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారని ఎంఈఓ ఎదు నరసింహారావు ప్రాజెక్ట్ అధికారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీని వాసరావు, ఫ్యాకల్టీలు లక్ష్మీ ప్రసన్న, గోపాలరావు, శ్రీనివా సరావు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర వ్యవసాయంతోనే అధిక దిగుబడులు

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-కొత్తగూడెం



సమగ్ర వ్యవసాయంతోనే అధిక దిగుబడులు సాధించవచ్చు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. బుధవారం రామవరంలోని రైతు వేదికలో వాలంతరి, రాజేంద్రనగర్ హైదరాబాద్ ట్రెనింగ్ ఇన్స్టిట్యూట్ బృందంతో ఏఈఓలకు, రైతులకు నీటి నిర్వహణ, మట్టి, నీటి సంరక్షణ, యాజమాన్య పద్ధతులపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర వ్యవసాయంతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని ఇందుకుగాను నీటి కుంటల నిర్మాణం, మునగ సాగు, ఆయిల్ ఫామ్, అజోల్ల పెంపకం, తిప్ప, కరక్కాయ వంటి ఔషధ మొక్కలను పుట్టగొడుగుల పెంపకం ద్వారా రైతులు అధనంగా ఆదాయం సంపాదించవచ్చని, ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని ఏఈఓ లను ఆదేశించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమంలో డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ ఇరిగేషన్, ప్రకృతి వ్యవసాయం, పంట మార్పిడి, జిల్లాలోని వ్యవసాయకు సంబంధించిన ప్రస్తుత పంటల సమస్యలు, పరిష్కారాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, వాలంతరీ డైరెక్టర్ విజయ గౌరీ, వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారావు, వాలంతరీ ఏడిఏ సునీత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-అశ్వారావుపేట

లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రంగా గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళ్తే ఆంధ్రప్రదేశ్, పోలవరం మండలం శివగిరికి చెందిన నిర్వాసితులు మండల సరిహద్దులో జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెం సమీపంలో ఆర్అండ్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఇక్కడ నివాసం ఉండే నడకుదురు గోపిరెడ్డి (36), కె.అర్జున్‌రెడ్డి అనే కొండ రెడ్లు మంగళవారం రాత్రి ఆంధ్రాలోని జీలుగుమిల్లిలో జరుగుతున్న జగదాంబ తల్లి జాతరకు వెళ్లారు. రాత్రి పదకొండున్నర గంటల సమయంలో ఇద్దరు ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వెళుతున్నారు. ఇదే క్రమంలో అశ్వారావుపేటలోని జంగారెడ్డిగూడెం రోడ్లో గల కాకతీయ గేట్ సమీపంలో కాకినాడ వైపు వెళుతున్న లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ప్రమాదంలో గోపిరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. అర్జున్ రెడ్డికి పలుచోట్ల గాయాలు అయ్యాయి. అర్జున్‌రెడ్డిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మృతుడు గోపిరెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఆత్మహత్యా యత్నం

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

పురుగు మందు తాగి ఓ యువతి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఆళ్ళపల్లి మండలంలో బుధవారం జరిగింది. స్థానిక వైద్యాధికారి కెవి.సంఘమిత్ర వివరాల ప్రకారం..మండలంలోని రాయిపాడు గ్రామానికి చెందిన యువతికి కుటుంబ సభ్యులు తనకి నచ్చని వివాహం చేస్తున్నారని, గత మూడు రోజులుగా అన్నం తినడం మానేసింది. బుధవారం మనోవేదనతో క్షణికావేశంలో మోనో పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఆళ్ళపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది నందినికి ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడి ఆసుపత్రిలో ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



అడవులు సంరక్షించుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత

- ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని

నవతెలంగాణ-పినపాక

అడవులను కాపాడుకోవలసిన బాధ్యత అందరిదని, ప్రతి పౌరుడు బాధ్యతగా అడవులను కాపా డుకోవాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని కోరారు. బుధవారం కరకగూడెం, మం డలంలోని పలు ఆదివాసి గ్రామాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా చెట్లను నరికి పోడు చేయకూడదన్నారు. వన్య ప్రాణులను కాపాడుకోవాలని, వన్యప్రాణుల వేట చేయవద్దని సూచించారు. అడవిలో నిప్పు పెట్టకూడదని అడవికి నిప్పు అడవులకే కాక వన్యప్రాణులకు ముప్పు తెస్తుందన్నారు. అటవీ హక్కుల చట్టాలను ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు అన్నారు. మంచి ప్రాణవయువు లభించాలంటే పచ్చదనం ఆవశ్యకత ఉందని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు సూరయ్య, ఏడుకొండలు, రాందాసు, బీట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటర్ల దొంగలు అరెస్టు

- వివరాలు వెల్లడించిన సీఐ సతీష్‌కుమార్

నవతెలంగాణ-మణుగూరు



మండలంలో బోరు మోటార్ల దొంగలను పట్టుకున్నామని సిఐ సతీష్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గత 15 రోజులుగా వరుస చోరీలకు గురవుతున్న బోరు మోటర్ల కేసులు మణుగూరు పోలీసులు చేదించారని తెలిపారు. గత 15 రోజులుగా ముత్యాలమ్మ నగర్, మద్దులగూడెం, వాగు మల్లారం పరిసర ప్రాంతాల్లో కొత్తగా నిర్మితమవుతున్న ఇండ్లలో అక్కడ వేసిన బోర్ల నుండి మోటార్లను కొంత మంది వ్యక్తులు దొంగిలించడం జరిగింది. మొదటగా వాగు మల్లారంలోని సతీష్ అనే యజమాని ఇంటి వద్ద నుంచి ఒక బోరు మోటర్‌ను తొంగించగా ఆ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అదేవిధంగా మరొక మూడు ఇండ్లలో కూడా ఇదేవిధంగా బోరు మోటర్లు చోరీకి గురి కావడం జరిగింది. వీటిపై ఎస్సై ప్రసాద్, కానిస్టేబుల్ వీర రామారావు, షమీం ఒక ప్రత్యేక బృందం ఏర్పడి సీసీ కెమెరాలు, కాల్ డేటా రికార్డ్ ఆధారంగా నిందితుల కోసం గాలిస్తుండగా నిందితులు నలుగురు రెండు బండ్లపై మోటార్లతో అమ్మడానికి వెళ్తుండగా రాజుపేట క్రాస్ రోడ్ వద్ద వారిని పట్టుకున్నారు. నిందితులను విచారించగా మణుగూరులోని ముత్యాలమ్మ నగర్ వాగు మల్లారం, మద్దలగూడెం వారు గత 15 రోజులుగా ఒక ముఠాగా ఏర్పడి ఉదయం పూట కొత్తగా నిర్మిస్తున్న ఇండ్లను ఎంచుకొని అక్కడ బోరు మోటర్ ఉన్నవా లేవా నిర్ధారించుకొని రాత్రిపూట వీరంతా కూడా అక్కడికి వెళ్లి ఈ నలుగురు వ్యక్తులు అటు మోటార్ పైపును బయటికి తీసి పైపు కోసేసి మోటార్నీ దొంగలించుకుని వెళ్లేవారు. తర్వాత మోటార్లను బయ్యారం, మంగపేట గ్రామాల్లో ఎవరికైనా అవసరం ఉన్నది అని తెలుసుకుని తక్కువ ధరలో వాటిని అమ్మేవారు. నిందితుల వివరాలు రాయల రాజు ప్రైవేట్ ఎలక్ట్రీషన్ నివాసం లంక మల్లారం, మణుగూరు, పుట్ట సందీప్ డ్రైవర్ నివాసం వాగు మల్లారం, పోలోజు నరసింహాచారి వృత్తి కార్పెంటర్, నివాసం వాగు మల్లారం, పొడుగు దయాకర్ వాగుమల్లారం, మణుగూరు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వివరించిన సీఐ సతీష్ కుమార్, ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది వీరా, రామారావు, షమీములను డిఎస్పి రవీందర్‌రెడ్డి అభినందించారు.

ఆమె పోరాటాలకు వందనం

- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డి.సీతాలక్ష్మికి సత్కారం
- టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో చైతన్య సదస్సు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం పట్టణంతో పాటు ఏజెన్సీ ప్రాంత మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ అతివలకు ఆదర్శంగా నిలవడమే కాకుండా ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో కళాకారులను తయారు చేస్తూ బహుముఖ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు డి.సీతాలక్ష్మి. ఆమె పోరాటాలకు వందనం తెలుపుతూ తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో సీతాలక్ష్మి సత్కరించారు. మహిళా దినోత్సవ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ మహిళ విభాగ ఆధ్వర్యంలో నిర్వహించిన చైతన్య సదస్సులో భద్రాచలం పట్టణానికి చెందిన వివిధ రంగాలలో రాణిస్తు ప్రతిభను చూపిస్తున్న మహిళలను గౌరవిస్తూ సత్కరించారు. అందులో భాగంగా నిరంతరం మహిళా సమస్యలపై పోరాటం నిర్వహిస్తూ మహిళా హక్కుల కోసం నినదీస్తున్న డి.సీతాలక్ష్మిని మహిళా ఉపాధ్యాయ నాయకులు శాలువాతో సత్కరించి మెమోటాని బహుకరించారు. ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ మహిళా విభాగం నేతలైన జి.స్వర్ణ జ్యోతి, బి.సునీత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలని కోరారు. ఆడపిల్లలను చదువులో ప్రోత్సహిస్తేనే దేశానికి భవిష్యత్తు ఉంటుందని వారు స్పష్టం చేశారు. భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో ఎంతోమంది మహిళలు రాజకీయంగా వ్యాపారవేత్తలుగా విద్య వంతులుగా వివిధ సాంస్కృతిక కళా రంగాలలో రాణిస్తున్నారని అలాంటి మహిళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్న లక్ష్యంతో టీఎస్ యుటిఎఫ్ మహిళ విభాగ ఆధ్వర్యంలో చైతన్య సదస్సు నిర్వహించి ప్రత్యేకతను చాటుకుంటున్న మహిళలను సత్కరించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం డి.సీతలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు అవకాశం ఇస్తే సాధించలేనిది ఏమీ లేదని ఉపాధ్యాయ ఉద్యమ మహిళ విభాగం నాయకులు రుజు చేస్తున్నారని, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం నిర్వహిస్తున్న యుటిఎఫ్ మహిళ విభాగం ఆధ్వర్యంలో ఎన్నో విజయాలు సాధించారని గుర్తు చేశారు. తోటి మహిళల ప్రతిభను గుర్తిస్తూ ఇటువంటి అభినందనల కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, ఈ ప్రోత్సాహంతో భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని సీతాలక్ష్మి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు వివిధ రంగాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నియమాలకు లోబడి ఆస్పత్రులు నిర్వహించాలి

- ఆస్పత్రులను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా వైద్య బృందం

నవతెలంగాణ-అశ్వారావుపేట



వైద్యారోగ్య శాఖ నిబంధనలకు లోబడే ప్రైవేటు ఆసుపత్రులు నిర్వహించాలని, రిజిస్ట్రేషన్ తప్పని సరిగా చేయించుకోవాలని డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ భాస్కర్ నాయక్ ప్రైవేటు వైద్యులకు సూచించారు. జిల్లా వైద్య బృందం బుధవారం అశ్వారావుపేట మున్సిపాల్టీ పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రులను, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీలు చేపట్టింది. ముందుగా ఏరియా ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహించి ఆరోగ్య మిషన్ ప్రమాణాలు ప్రకారం రోగులకు సేవలు అందుతున్నాయా? లేదా? రోగులకు సరిపడా సౌకర్యాలు ఉన్నాయా? లేవా? సరిపడా వైద్యులు ఉన్నారా? లేరా? అనే ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండార్డ్స్ (ఐపీహెచ్ఎస్) ఫార్మాట్‌ను నింపారు. రోగులు వద్దకు వెళ్ళి వారికి అందించే సేవలను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని వందన నర్సింగ్ హోమ్, శేషమ్మ నర్సింగ్ హోమ్, జీవన శ్రీ, వెన్నెల ఆసుపత్రులను తనిఖీ చేశారు. అనంతరం నవతెలంగాణతో మాట్లాడుతూ ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ ప్రకారం జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌లో భాగంగా ఆరోగ్య సంరక్షణ, కాన్పులు నాణ్యతను మెరుగుపరిచే ప్రమాణాలను రూపొందించడానికి ప్రణాళిక తయారు చేస్తున్నాం అని అన్నారు. ఈ బృందంలో డీఐఓ డాక్టర్ బాలాజీ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ రాందాస్, ప్రైవేట్ వైద్యులు డాక్టర్ బాబూరావు, డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ పూర్ణచందు పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టు నీరు చంద్రుగొండకు అందించాలి :సీపీఐ(ఎం)

నవతెలంగాణ-చంద్రుగొండ



సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నీళ్ళు చండుగొండ మండలానికి అందించాలని సీపీఐ(ఎం) మండల కన్వీనర్ పెద్దిన వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . బుధవారం సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో బెండలపాడు గ్రామ సమీపంలో ఉన్న సీతారామ ప్రాజెక్ట్ లిఫ్ట్ ఇరిగేషన్ కాలువను సందర్శించారు. ఈ ప్రాజెక్టు ద్వారా చంద్రుగొండ మండలానికి వెంటనే సాగునీరు అందించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ పెద్దిని వేణు మాట్లాడుతూ చంద్రుగొండ మండలానికి సీతారామ ప్రాజెక్టు ద్వారా డిస్ట్రిబ్యూషన్ కాలువలు ఏర్పాటు చేసి వెంటనే సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అనేక పోరాటాలు గత 20 సంవత్సరాల కాలంలో నిర్వహించడం జరిగిందని, పోరాట ఫలితంగా ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వాలు నిర్ణయం తీరుకున్నాయన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పేరుతోటి కొంతమేరకు ప్రాజెక్టు కాలువ నిర్మాణం చేయడం జరిగిందని అయినా కూడా మండలానికి నీరు అందించడంలో జాప్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కాలువలో ఇప్పటికే పూర్తయిన కాలువ ద్వారా సాగర్ ఆయకట్టుకు నీళ్ళ తీసుకెళ్లడం అనేది చాలా అన్యాయమైన విషయమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇప్పటివరకు శాశ్వతమైన సాగునీటి ప్రాజెక్టు లేకపోవడం ఈ పరిస్థితుల్లో జిల్లాలో నీళ్ళ ఇవ్వకుండా మిగిలిన రెండు పంటలకు ఆయకట్టు కలిగిన సాగరకు నీళ్ళ తీసుకోవడం సరైన విధానం కాదని, ఇలాంటి పరిస్థితుల్లో మండలంతో పాటు మిగిలిన మండలాల్లో రైతాంగం ఆందోళన చెందుతున్న పరిస్థితి ఉంది. కాబట్టి ప్రభుత్వం వెంటనే గమనించి ప్రాజెక్టు పూర్తయిన మేరకు డిస్ట్రిబ్యూషన్ కాలువలు ఏర్పాటు చేసి నీళ్ల అందించాలని, లేకపోతే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోరాట కార్యక్రమాలు భవిష్యత్తులో తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు ఐలూరు రామిరెడ్డి, విప్పర్ల పెద్ద వెంకటేశ్వర్లు, రామడుగు వెంకటాచారి, రాయి రాజా, ఎస్కే.నాగుల్ మీరా, గోగుల తిరుమలరావు, గ్రామశాఖ కార్యదర్శి చల్లపల్లి రాజా, చల్లా కృష్ణయ్య, దాసరి సీతారాములు, హనుమంతరావు, గుర్రం ప్రతాప్, బన్నె వెంకటేశ్వర్లు, బాలికుంట, గుర్రాయి గూడెం గ్రామ శాఖ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటిన గిరి పుత్రుడు..

- సన్మానించిన నేతాజీ వాకర్స్ టీమ్

నవతెలంగాణ-మణుగూరు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం మారాయి గూడెం గ్రామానికి చెందిన అపక సతీష్ జాతీయ స్థాయి అథ్లెటిక్‌లో సత్తా చాటాడు. కర్నాటక రాష్ట్రంలోని బెంగుళూరులో మార్చి 4 నుండి 9 వరకు మాస్టర్స్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎంఏఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన రన్నింగ్ పోటీలో 100 మీటర్ల రన్నింగ్ విభాగంలో మూడవ స్థాయిలో నిలిచి కాంస్య పతకం గెలిపొందాడు. మణుగూరుకి చెందిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ వాకర్స్ టీమ్ సభ్యులు ఫిబ్రవరి 23 న అపక సతీష్ ఆర్థిక పరిస్థితి తెలుసుకొని బెంగుళూరు వెళ్ళడానికి 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించినందుకుగాను కృతజ్ఞతతో మణుగూరు వచ్చి వారిని బుధవారం కలిశారు. ఈ సందర్భంగా నేతాజీ వాకర్స్ టీమ్ సభ్యులు శ్రీ భార్గవ ఆటోమొబైల్స్ హీరో షో రూమ్ అధినేత ఎన్.విజయ భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రావులపల్లి రామమూర్తి, బీఆర్ ఎస్ సీనియర్ నాయకులు తాళ్లపల్లి యాదగిరిగౌడ్ ఆధ్వర్యంలో అపక సతీష్‌కి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపక సతీష్ మన ప్రాంతం నుండి జాతీయ స్థాయి పోటీలో పాల్గొని వేలాది మందిలో మూడవ స్థానంలో కాంస్య పతకం గెలవడం చాలా గర్వంగా ఉందన్నారు. ఇటువంటి పేద యువకులను ప్రోత్సహించడం మన అందరి బాధ్యత అని అన్నారు. భవిష్యత్‌లో జరిగే ఇంటర్నేషనల్ పోటీలకు సెలక్ట్ కావడం చాలా సంతోషంగా ఉందని, అక్కడ కూడా పాల్గొని మరిన్ని పథకాలు సాధించి మన ప్రాంతానికి, మన జిల్లాకు, మన రాష్టానికి, దేశానికీ మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అపక సతీష్‌కి నేతాజీ వాకర్స్ టీమ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతాజీ వాకర్స్ టీమ్ సభ్యులు సామ శ్రీనివాసరెడ్డి, వడ్డాణం రమేష్, జొన్నలగడ్డ వెంకటేశ్వరావు, శంకర్‌రెడ్డి, వాగబోయిన నాగేశ్వరరావు, శంకర్, వంగా సంతోష్, కాంపాటి ప్రసాద్, కొరిమిల్ల శ్రీనివాస్, కనుకు రమేష్, ఆర్.సుమన్, రామిరెడ్డి, అలవాల రాంబాబు, అమర కిరణ్, కాంట్రాక్టర్ రామకృష్ణ, బాబురావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళా సొసైటీ ఇసుక ర్యాంపులను పునః ప్రారంభించాలి

నవతెలంగాణ-మణుగూరు

గిరిజన మహిళ ఇసుక సొసైటీలను వెంటనే పునః ప్రారంభించాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షులు సోలార్ హరిశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల స్థాయి సమావేశంలో మండల అధ్యక్షులు సోలం హరి శంకర్ పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతమైన మణుగూరు మండలంలో గల ఆదివాసీ మహిళ సొసైటీ ఇసుక ర్యాంపులను తక్షణమే పునః ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రజల ఉపాధిని దెబ్బకొట్టేందుకు ఇసుక ర్యాంప్‌లను నిలిపి ప్రజా పాలకులు రైజింగ్ కాంట్రాక్టర్లతో బేరసారాలకు తెరలేపారని ఆరోపించారు. నిజంగా ఆదివాసీ సమాజాన్ని అభివృద్ధి పథంలో నడపాలనే ఆలోచన ప్రజా పాలకులకు ఉంటే రైజింగ్ కాంట్రాక్టర్ విధానం లేకుండా ప్రతి గిరిజన మహిళ సొసైటీ ఇసుక ర్యాంప్‌కు ముందస్తుగా ఆర్థిక పెట్టిబడి నిధులు ప్రభుత్వం ద్వారా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కొని ఆదివాసీ మహిళల అభివృద్ధికి సహకరించే విధంగా గిరిజన మహిళా ఇసుక సొసైటీలను పునః ప్రారంభించిక పోతే ఆదివాసీ సంక్షేమ పరిషత్ ద్వారా ఉద్యమం చెప్పడతాము అని ఇందుములంగా హెచ్చరించడం జరిగింది .ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి మడి రమేష్, మండల కార్యదర్శులు కంగాల ప్రవీణ్, గోగ్గేలా కోటి, గణిబోయిన రాము, మడకం ప్రవీణ్, మరియు తదితరులు పాల్గొన్నారు.



వేగంగా ఇందిరమ్మ గృహ నమూనా భవనాల నిర్మాణం

- పర్యవేక్షించిన హౌసింగ్ ఏఈ రాము

నవతెలంగాణ-అశ్వారావుపేట

తెలంగాణ ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని ప్రజలకు చేరువ చేయడంతో పాటు నమూనా ప్రదర్శనకు మండలానికి ఒక నమూనా భవనం నిర్మిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక, నిర్మాణాలకు మార్క్ అవుట్ పూర్తి అయ్యాయి. వాటికంటే ముందుగానే మండల కేంద్రంలో నిర్మించే నమూనా గృహం పూర్తి చేసి లబ్ధిదారులు వీక్షించేందుకు అనువుగా సిద్ధం చేయాలని హౌసింగ్ అధికారులు పరుగులు పెడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం అశ్వారావుపేట మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో నిర్మిస్తున్న నమూనా భవనాన్ని ఏఈ రాము పరిశీలించారు. అతి త్వరలో నిర్మాణం పూర్తి చేయనున్నామని, ములకలపల్లి భవనం స్లాబ్, దమ్మపేట భవనం లెంటెల్ లెవల్, మిగతా మండలాల్లోని భవనాలు పలు దశల్లో ఉన్నాయని తెలిపారు.

మానవాళి మనుగడకు విద్యే కీలకం

నవతెలంగాణ-అశ్వారావుపేట

మానవాళి మనుగడకు విద్య అత్యంత కీలకమైన అంశమని సత్తుపల్లి మధర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల ఇంగ్లీష్ డిపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ పంతంగి మురళీకృష్ణ అన్నారు. బుధవారం పీఎంపీ యూపీఎస్ నారంవారిగూడెంలో జరిగిన "ఎమినెంట్ ఎక్స్పర్ట్ టాక్" కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పున్నం చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన "విద్య - ఆవశ్యకత" అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్య లేకుండా ఎవరూ ఏ రంగంలోనైనా రాణించడం కష్టమని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యార్థులు కష్టపడి కాదు ఇష్టపడి చదవాలని, అంకితభావం, కృతనిశ్చయంతో, ఆత్మవిశ్వాసం, కష్టపడే తత్వం ఈ నాలుగు లక్షణాలు ఉన్నప్పుడు ఎటువంటి విజయాల నైనా సునాయాసంగా అందిపుచ్చుకోవచ్చని ఆయన ఉద్ఘాటించారు. సభాధ్యక్షులు చంద్రశేఖర్‌రావు పున్నం మాట్లాడుతూ డాక్టర్ పంతంగి మురళీకృష్ణ పేర్కొన్న అంశాలు పాటించడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించి పాఠశాలకు, నారంవారిగూడెం గ్రామానికి మంచిపేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ఆషిక్ ఆలం, రవిబాబు, మంగమ్మ పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులచే డాక్టర్ పంతంగి మురళీకృష్ణని ఘనంగా సత్కరించడం జరిగింది.



'గురుకుల పాఠశాల సందర్శన'

నవతెలంగాణ-మణుగూరు

మండలంలోని మహాత్మా జ్యోతిబాఫూలే వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలను ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు బుధవారం సందర్శించారు. విద్యా విధానం, వసతులు, పరిశుభ్రత, విద్యార్థులకు అందే భోజనం, మంచినీటి సరఫరా వంటి అంశాలను పరిశీలించారు. ప్రభుత్వ నూతన డైట్ మెనూ ప్రకారం భోజనం అందుతున్న విధానాన్ని కూడా సమీక్షించారు. బోధన సిబ్బందితో మాట్లాడి విద్యార్థుల ప్రగతిని, బోధనా విధానాలను, వారికి ఎదురవుతున్న సవాళ్లను తెలుసుకున్నారు. వారికి మరింత మద్దతుగా ఉండేందుకు సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు అందజేశారు. అలాగే, వంట సిబ్బందితో భోజన నాణ్యత, పోషకాహారం, పరిశుభ్రత గురించి మాట్లాడి, వారు పాటిస్తున్న ప్రామాణిక విధానాలను సమీక్షించాం. ప్రభుత్వ నూతన డైట్ మెనూను సమర్థవంతంగా అమలు చేయడంలో వారి కృషిని అభినందించారు. ఈ సందర్శన ద్వారా పాఠశాల అభివృద్ధి దిశగా మరింత ముందుకు సాగేందుకు అధికారుల సహకారంతో చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

సింగరేణిలో ప్యానెల్ అడ్వకేట్ల నియామకం

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి కాలరీస్ కంపెనీ సంస్థ కంపెనీ తరపున కేసులు వాదించటానికి నలుగురు ప్యానెల్ అడ్వకెట్లను నియమించారు. బుధవారం సింగరేణి సంస్థ నియమించిన ప్యానల్ అడ్వకేట్ల పేర్లను ప్రకటించింది. కొత్తగూడెంకు వెల్లంకి వెంకటేశ్వరరావు, సత్తుపల్లి ప్రాంతానికి సంబంధించిన కోర్టు కేసులను వాదించటానికి రమేష్ కుమార్ మక్కడ్, మణుగూరుకు జివికె.మనోహర్, ఎల్లందుకు ఎన్. మల్లికార్జునరావులను నియమిస్తూ సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. సింగరేణి కాలరీస్ లీగల్ రిటైనర్‌గా 1988 నవంబర్‌లో నియమితులైన సురేష్ బాబు 2024 జులైలో ఆయన మృతి చెందినంత వరకు సింగరేణికి న్యాయ సేవలు అందించారు. కొత్తగూడెం, మణుగూరు, సత్తుపల్లి ప్రాంత కేసులు ఆయనే వాదించే వారు. ఇప్పుడు ఆ పనికి ముగ్గురిని కేటాయించారు. వీరి నియామకం పట్ల న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిళలు ఐక్యంగా ముందుకు సాగాలి

- ఐద్వా మండల కార్యదర్శి పొడుపు కంటి సమ్మక్క

నవతెలంగాణ-చర్ల



సమసమాజ స్థాపన కోసం మహిళలంతా ఐక్యంగా ముందుకు సాగాలని ఐద్వా మండలం కార్యదర్శి పొడుపు కంటి సమ్మక్క పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక విజయ్ కాలనీలో జరిగిన మహిళా సంఘం ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమంలో ఆమె పాల్గొని ఐద్వా జండా ఎగరవేసి మాట్లాడారు. మహిళలు చైతన్యవంతంగా మెలుగుతూ సమాజంలో నారీ పాత్రను పోషించాలని, సమయ స్ఫూర్తితో మెలుగుతూ మహిళలు రాణించాలని కోరారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన అత్యాచారాలకు ఒడిగట్టిన సహించేది లేదని హెచ్చరించారు. స్త్రీని అగరవపరచడం స్త్రీల పట్ల చులకన తనం తగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యురాలు వరదాల వరలక్ష్మి, పలక సూరమ్మ పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

'ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలంపియాడ్ పరీక్షలలో సింగరేణి పాఠశాలల విద్యార్థులు'

నవతెలంగాణ-కొత్తగూడెం



'ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలంపియాడ్ పరీక్షలలో సింగరేణి పాఠశాలల విద్యార్థులు' మంచి ప్రతిభ కనబరిచి రానిస్తున్నారు. సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషన్ సొసైటీ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 9 సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలల్లో విద్యా సంవత్సరం 2024-25లో యూనిఫైడ్ కౌన్సిల్ వారిచే జనవరిలో నిర్వహించిన ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలంపియాడ్‌లో సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల నుండి 533మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆ పరీక్షకు సంబంధించి ఫలితాలు తాజాగా10 మార్చి 2025 విడుదల చేశారు. అందులో సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాల కొత్తగూడెం నుండి 114 విద్యార్థులు పాల్గొనగా వారిలో 20మంది గోల్డ్ మెడల్ సాధించారు. ముగ్గురు విద్యార్థులు క్యాష్ అవార్డు రూ.2,000లు చొప్పున గెలుచుకున్నారు. మణుగూరు పాఠశాల నుండి 84 మంది విద్యార్థులు పాల్గొనగా 13 మంది గోల్డ్ మెడల్ సాధించారు. ఇల్లందు పాఠశాల నుండి 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. భూపాలపల్లి పాఠశాల నుండి 52 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గోదావరిఖని సెక్టర్ 3 పాఠశాల నుండి 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో 8 మంది గోల్డ్ మెడల్స్ సాధించారు. గోదావరి ఖనిలోని సెక్టార్ 2 పాఠశాల నుండి 34 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో 8 మంది గోల్డ్ మెడల్ సాధించారు. సిసిసి నస్పూర్ పాఠశాల నుండి 49 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో ఆరుగురు గోల్డ్ మెడల్ సాధించారు. మందమర్రి పాఠశాల నుండి 83 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గొల్లేటి పాఠశాల నుండి 17 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఒక విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించారు. ఈ ఒలంపియాడ్ కార్యక్రమాన్నిఅన్ని సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలల చీఫ్ కో-ఆర్డినేటర్‌గా సీనియర్ గణిత ఉపాధ్యాయుడు డి.ఫూల్ సింగ్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఈ విద్యా సంవత్సరంలో రెండు ఒలంపియాడ్ నేషనల్ సైన్స్ టాలెంట్ సర్చ్ ఎగ్జామినేషన్, అన్‌ఫీల్డ్ ఇంటర్‌నేటషనల్ మాథమిటిక్స్ ఒలంపియాడ్ పరీక్షలలో సుమారు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొని సమర్థవంతంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించారని సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ కె.సునీల్ కుమార్ తెలిపారు.ఈ సదర్భంగా సింగరేణి పాఠశాలల ప్రధానోపాధ్యాయులను, ఒలంపియాడ్ ఇన్‌చార్జ్ ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.

సేంద్రీయ ఎరువులతో పండించిన పంటలు ఎంతో మేలు

- భద్రాచలం ఐటిడిఏ పిఓ బి.రాహుల్

నవతెలంగాణ-బూర్గంపాడు

ప్రజల ఆరోగ్యాన్ని హాని తలపెట్టే పంటలు కాకుండా ఆర్గానిక్ సేంద్రీయ ఎరువులతో పండించిన పంటలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ఐటిడిఏ పిఓ పి. రాహుల్ అన్నారు. బుధవారం మండలంలోని గుట్ట లక్ష్మీపురం గ్రామంలోని అభ్యుదయ రైతు సేంద్రీయ ఎరువులతో సాగు చేస్తున్న పుచ్చకాయల పంట, మిరప పంట జామకాయ పంటలను ఆయన పరిశీలించారు. అటువంటి పంటలు పండించే విధంగా ఆదివాసి గిరిజన రైతులకు సాగులో మెలకువలు సూచనలు సలహాలు అందించారని అభ్యుదయ రైతు లక్ష్మారెడ్డిని ఐటీ డీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అభినందించారు. పంటలు సాగు చేస్తున్న విధానాన్ని యాజ మాన్య పద్ధతుల గురించి రైతును అడిగి తెలు సుకున్నా అనంతరం ఆయన మాట్లాడారు. గిరి జన రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందడా నికి ఆర్గానిక్ పంటలు వేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని ఆయన అన్నారు. అభ్యుదయ పామా యిల్ మొక్కలు పెంచుతూ అంతర్ పంటలుగా రైతు సాగు చేస్తున్న పుచ్చకాయ పంట, మిరప సాగు చేస్తున్న విధానం చాలా బాగుందని అన్నారు. 20 లక్షల ఖర్చుతో 20 ఎకరాలలో పుచ్చకాయ పంట సాగు చేస్తున్నానని, ఎకరానికి అసాధారణమైన పుచ్చకాయ దిగుబడి వస్తుందని, కలకత్తా వారు అందించే ఈ మ్యాక్స్ విత్తనం ద్వారా ఈ పంట సాగు చేస్తున్నానని తెలిపారు. మార్కెటింగ్ సౌకర్యం కూడా కలకత్తా వారే కొనుగోలు చేస్తారని పీవోకు రైతు తెలిపారు. 70 రోజులలో జాగ్రత్తగా కాపాడుకుంటే పంట చేతికి వస్తుందని, ఎకరానికి 25 టన్నుల పుచ్చకాయ దిగుబడి వస్తుందని, అలాగే పొన్నుస్వామి సేంద్రియ ఎరువులతో పండించే మిరప తోట నాలుగు ఎకరాల వరకు చేస్తున్నానని రైతు పేర్కొన్నారు. ఎకరానికి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని పిఓకి తెలిపారు. ఎటువంటి హానికరం లేకుండా ఆరోగ్యకరమైన పంటలు పండిస్తున్న లక్ష్మారెడ్డిని గిరిజన రైతులు ఆదర్శంగా తీసుకొని సేంద్రియ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడి అగ్రికల్చర్ ఉదయభా స్కర్, హార్టికల్చర్ అధికారి వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

మేలుజాతి దూడల ప్రదర్శన

- పాడి రైతులకు అవగాహన

నవతెలంగాణ-బూర్గంపాడు



మండలంలోని మోరంపల్లి బంజర గ్రామంలో మంగళవారం ఐటిసి బంగారు భవిష్యత్ ప్రోగ్రాం ద్వారా బైఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మేలుజాతి దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విఏఎస్ (ఏహెచ్) డాక్టర్ రాజేందర్ సదస్సును ప్రారంభించారు. ప్రదర్శనలో మొత్తం 75 మేలుజాతి ఆవులు, గేదెలు, దూడ లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాడి రైతులకు పశుపోషణ, సాంకేతిక విధానాలు, ఆధునిక పద్ధతులపై వివరంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐటిసి బంగారు భవి ష్యత్ ప్రోగ్రాం ముఖ్య అధికారి జయప్రకాష్ మాట్లాడుతూ పాడి రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని అధిక దిగుబడి సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బైఫ్ సంస్థ రాష్ట్ర ముఖ్య అధికారి హేమంత్ పాల్గొని, పాడి రైతులకు నూతన పశు యాజమాన్య పద్ధ తులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బైఫ్ సంస్థ క్షేత్ర అధికారి సదయ్య, టెక్నీషియన్ వెంకటరామిరెడ్డి, గ్రామస్థులు, రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి గోటి తలంబ్రాలు సిద్ధం

నవతెలంగాణ-దమ్మపేట



భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణం పురష్కరించుకొని దమ్మపేట సీతా రామభక్త కమిటి ఆధ్వర్యంలో గోటి తలంబ్రాలను సిద్ధం చేశారు. ముక్కోటి ఏకాదశి రోజున అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభించిన భక్తులు 8,11,000ల తలంబ్రాలను గోటితో వలవడం జరిగింది. వీటిని భద్రాచలం రాములోరి కల్యాణ సమయంలో తలంబ్రాలలో కలిపేందుకు గాను బుధవారం భద్రాచలం రామాలయంలో అందజేసినట్లు కమిటి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతారామ భక్త కమిటి అధ్యక్షురాలు మురహరి గంగ, సత్యవతి, సరస్వతి, అత్తులూరి కుమారి, కందుకూరి విజయ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు

- రోడ్డు ప్రమాదాల నియంత్రణకు నిత్యం వాహన తనిఖీలు
- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజు

నవతెలంగాణ-కొత్తగూడెం



సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురి చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీసులు నిత్యం వాహన తనిఖీలు చేపట్టాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు స్పష్టం చేశారు. బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జిల్లాలోని పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ నివారణా చర్యలను చేపట్టాలన్నారు. అన్ని పోలీస్ స్టేషన్లలో నమోదైన పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని తెలిపారు. పోక్సో కేసులలోని నిందితులకు త్వరతగతిన శిక్ష పడే విధంగా కృషి చేయాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా,మట్కా,క్రికెట్ బెట్టింగులు లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నిత్యం వాహన తనిఖీలు చేపడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. షీ టీమ్స్, భరోసా కేంద్రాల ఆవశ్యకత గురించి అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేసి బాధిత మహిళలకు అండగా ఉండాలని ట్వలిపారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఇల్లందు డిఎస్పీ చంద్రభాను, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామీ, డీసిఆర్బీ సీఐ శ్రీనివాస్, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ రమాకాంత్, ఐటీ సెల్ సీఐ నాగరాజు రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-ఆళ్ళపల్లి

బొమ్మల వంశీయుల ఆరాధ్య దైవం శ్రీ సమ్మక్క-సారలమ్మ జాతర శుభ సందర్భంగా ఆళ్ళపల్లి మండల స్థాయి క్రీడా పోటీలకు స్థానిక టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జోగ రాంబాబు ముఖ్య అతిథిగా హాజరై, బుధవారం క్రీడలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలు వివిధ పండుగలను జరుపుకుంటారు. గిరిజనుల పండుగలు ప్రజల్లో ఐక్యతను చాటుతాయన్నారు. గిరిజనుల పండుగలు ఎంతో కన్నుల విందుగా.. సందడిగా.. ఉంటాయన్నారు. ఆదివాసి సంస్కృతి, సాంప్రదాయాలను వారి కట్టుబాట్లు, జీవనం ఆహార్యం చాటి చెప్పుతాయన్నారు. అడవి తల్లి ఒడిలో నిత్యం జీవించే ప్రత్యేక జీవన శైలి ఆదివాసీలకి సొంతమని కొనియాడారు. ఆదివాసులే దేశానికి మూలవాసులని, నీతి నిజాయితీ వారిలో మెండుగా ఉంటుందన్నారు. తమ సంస్కృతిని కంటికి రెప్పలా కాపాడుకోవడం ఆదివాసులందరి బాధ్యతని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీచర్ ఈసం రవీందర్, టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు భోజ్య, పాయం పాపారావు, పాయం సత్యనారాయణ, సోలం జనార్ధన్, గ్రామ పెద్దలు జోగ సారయ్య, చిన గౌరయ్య, గోగ్గల రమేష్, కొమరం బొర్రయ్య, ఈసం సమ్మయ్య, కనక రాజు, వసంతరావు, రామ చంద్రయ్య, బాబు, రామయ్య, రమేష్, సత్యం, ఏడూళ్ల రమేష్, బూడిద కొమరం నాగేశ్వరరావు, గ్రామ యూత్ కమిటి, క్రీడాకారులు పాల్గొన్నారు.

బాండ్ పేరిట బ్యాండ్

- మొక్కజొన్న బాండ్ పేరుతో ఆదివాసీ రైతులకు నకిలీ విత్తనాలు, మందులు సరఫరా
- డీలర్‌పై చర్యలు తీసుకోవాలి : జీఎస్పీ డిమాండ్

నవతెలంగాణ-చర్ల



మండలంలోని గొండ్వాన సంక్షేమ పరిషత్ బృందం బుధవారం నకిలీ మొక్కజొన్న బాండ్ విత్తనాలతో మోసపోయిన తిప్పపురం, రాళ్లపురం, గిసరెల్లి, చిన్నమిడిసీలేరు, శలమాల, ఉయ్యాలమడుగు, కొత్తూరు ఆదివాసి గ్రామాలకు సంబంధించిన రైతులను ఉయ్యాల మడుగు గ్రామంలో కలసి రైతులతో మాట్లాడారు. ఆదివాసి రైతులు వారికి జరిగిన మొక్కజొన్న బాండ్ పంట నష్టాన్ని వివరిస్తూ లబోదిబోమన్నారు. దీనిపై సంఘ నాయకులు పాయం సత్యనారాయణ స్పందిస్తూ ఏజెన్సీలో పుట్టగొడుగుల్లా ఎలాంటి, అనుమతులు లేకుండా నకిలీ విత్తనాలు మొక్కజొన్న బాండ్ పేరుతో అటవీ ప్రాంత ఆదివాసి రైతులకు ఒక ఎకరాకు మూడు టన్నులు దిగుమతి వస్తుందని చెప్పి టన్ను 36వేల రూపాయలు ఉంటుందని, అబద్ధపు ప్రచారం చేసి నకిలీ మొక్కజొన్న విత్తనాలు అంట కట్టారని మండిపడ్డారు. ఆ ప్రాంత రైతులు మొత్తం మూడు నెలలు కాయ కష్టం చేసి, అధిక దిగుబడి వస్తుందని రైతన్న ఆశతో పంట సాగు చేశారు. తీరా చూస్తే ఆ పంటలో ఉన్న మొక్కజొన్నలు కనీసం కంకిలో గింజలు లేనటువంటి పరిస్థితి దాపరించిందని అన్నారు. ఆదివాసి రైతులను నట్టేట ముంచిన డీలర్ వాసుబాబు, ఏజెంట్ కొప్పుల శ్రీనివాస్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. ఏజెన్సీలో అటవి ప్రాంతా ఆదివాసులను మోసం చేసే వారిపై వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే స్పందించి విచారించి చర్యలు తీసుకోవాలని, డీలర్, ఏజెంట్ నిర్వహిస్తున్న షాపుల పై తనిఖీలు జరిపి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నష్టపోయిన ఆదివాసి రైతులకు ఎకరాకు 65 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని, గొండ్వాన సంక్షేమ పరిషత్ డిమాండ్ చేస్తుంది. రైతులకు న్యాయం చేయని ఎడల గొండ్వాన సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివాసులను ఐక్యం చేసుకొని, ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చర్ల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్, రైతులు మడకం జీవన్ వాసం, కన్నారావు, మడకం రాజశేఖర్, శ్యామల లక్ష్మణరావు, బాడిస సర్వేశ్వరరావు, కుంజా శ్రీను, శ్యామల శేఖర్, వాసం నాగేశ్వరావు, వాసం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఏఐటీయూసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకం

- బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్

నవతెలంగాణ-మణుగూరు

ఏఐటీయూసీ సింగరేణి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తుందని బ్రాంచ్ సెక్రటరీ వై రాంగోపాల్ అన్నారు. బుధవారం మణుగూరు ఓసి, ఏరియా హాస్పిటల్‌లో ఫిట్ మీటింగ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ప్రైవేటీకరణకు ఏఐటియుసి వ్యతిరేకిస్తుందని అన్నారు. మణుగూరు ఓసిలో ప్రవేశపెట్టదలచిన ప్రైవేట్ లోడర్ టిప్పర్లను ఉపసంహరించుకోవాలని, పర్మినెంట్ సింగరేణి కార్మికుల తోటే ఈ పనులు చేయించాలని ఏఐటీయూసీగా డిమాండ్ చేస్తున్నామని అన్నారు. సింగరేణిలో నూతన బొగ్గు బావులు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మణుగూరులో ప్రస్తుతం ఉన్న గనుల జీవిత కాలం ముగిసిన తర్వాత వేరేగనులకు అనుమతి లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్ఎండిఆర్ గనుల ప్రైవేటీకరణ చట్టానికి ఆనాడు రాష్ట్రంలో ఉన్న టిఆర్ఎస్ ఎంపీలు ఈ చట్టానికి మద్దతుగా ప్రైవేటీకరణకు అనుకూలంగా పార్లమెంటులో ఓటు వేశారని తెలిపారు. దీని ఫలితంగా సింగరేణిలోని రెండు బ్లాకులు ప్రైవేటు వారికి దక్కాయని తెలిపారు. సత్తుపల్లి, కోయగూడెం ఆ రెండు బ్లాక్‌లు కూడా సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోయిన స్ట్రక్చర్ సమావేశాలను ఏఐటీయూసీ డిమాండ్ మేరకు చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో పెరక్స్ పై ఇన్కమ్ టాక్స్, కార్మికులకు సొంత ఇంటి పథకం, కార్మికులకు, కుటుంబాలకు మెరుగైన వైద్య సహాయం కొరకు హైదరాబాదులో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు, డిస్మిస్ అయిన కార్మికులకు అవకాశం కల్పించడం, ఈపీ ఆపరేటర్ ప్రమోషన్, వివిధ కేటగిరిలో పనిచేస్తున్న టెక్నీషియన్స్ మరియు హెల్పర్ల డిజిగ్నేషన్ మార్చడం కొరకు, డిస్మిస్ అయిన జేఎంఈటిలను విధుల్లోకి తీసుకోవడానికి ఎస్-1 తొలగింపు తదితర 14 డిమాండ్లను ప్రస్తావించడం ఓజరిగిందన్నారు. సింగరేణి సంస్థ పరిరక్షణకు, కార్మికుల హక్కుల రక్షణకు భవిష్యత్తులో ఏఐటియుసి నిర్వహించే నిరసన కార్యక్రమాలకు మద్దతు తెలిపి పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం మణుగూరు ఓసీలో ప్రైవేట్ లోడర్, టిప్పర్లను ఉపసంహరించుకోవాలని కోరుతూ మైన్స్ మేనేజర్ బైరెడ్డి వెంకటేశ్వర్లుకి మెమోరాండం అందజేశారు. ఈ సమావేశంలో బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మల్లెల వెంకటరమణ నర్సయ్య, ఆఫీస్ బేరర్స్ ఆవుల నాగరాజు, ఆదరణ సురేందర్ పిట్ సెక్రటరీ సాయి ప్రకాష్ చారి, కె.పద్మావతి, సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ దాట్ల సందీప్, చొప్ప సుధాకర్, రామారావు, జి.రవికుమార్, కంది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరో రోజుకు చేరిన పరీక్షలు

- 808 మందికి 796 హాజరు..
- 12 మంది గైర్హాజర్

నవతెలంగాణ-అశ్వారావుపేట

కళాశాల	ఎలాట్మెంట్	ప్రెసెంట్	ఆబ్సెంట్
జీజేసీ	333	326	07
టీఎంఆర్	152	150	02
వీకేడీవీఎస్	323	320	03
మొత్తం	808	796	12


ఫైల్

ఈ నెల 5 వ తేది బుధవారం ప్రారంభం అయిన ఇంటర్ పరీక్షలు బుధవారం నాటికి ఆరో రోజుకు చేరాయి. అశ్వారావుపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ముస్లిం మైనార్టీ బాలికల జూనియర్ కళాశాల, వీకేడీవీఎస్ రాజు జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన మూడు పరీక్షా కేంద్రాల్లో ఈ మూడూ కళాశాలతో పాటు దమ్మపేట మండలంలోని మందలపల్లి సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల, దమ్మపేటలోని గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కళాశాల, అంకంపాలెం గిరిజన సంక్షేమ శాఖ బాలికల కళాశాల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఈ మూడు కేంద్రాల్లో ఆరు కళాశాలల నుండి ద్వితీయ సంవత్సరం గణితం, వృక్షశాస్త్రం, పౌర శాస్త్రం కోర్సుల పరీక్షలకు 808 మంది హాజరు కావాల్సి ఉండగా 796 మంది హాజరు అయ్యారు. 12 మంది పరీక్షలకు గైర్హాజరు అయ్యారు. ఆయా పరీక్షల కేంద్రాలకు సీఎస్ (చీఫ్ సూపరింటెండెంట్), డీఓ(డిపార్ట్ మెంట్ ఆఫీసర్), కస్టోడియన్‌లుగా అల్లు అనిత, జెడ్.ఉషా రత్నం, కే.రవీంద్రబాబు, ఎం.ఝాన్సీ లక్ష్మి, బి.సంగీత, బి.కుమారస్వామి, డి.నరసింహారావులు విధులు నిర్వహిస్తున్నారు.

తోటి ఉద్యోగికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు సింగరేణి ఏరియాలో ఎస్ఎంపిసి ఎంఎంఏ ప్రైవేట్ సెక్యూరిటీలో సెక్యూరిటీ గార్డులు బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. సుమారు ఏడు సంవత్సరాలు విధులు నిర్వహించిన సతీష్ అనారోగ్యం కారణంగా తానంతట తానుగా ఉద్యోగం నుండి వైదొలగారు. తోటి కార్మికుని ఆర్థికంగా ఆదుకోవాలన్న దృకృథంతో సెక్యూరిటీ గార్డులు 32 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసి శాలువాతో సత్కరించారు. సెక్యూరిటీ సూపర్వైజర్ రాముతార్, సుధాకర్ లు మాట్లాడుతూ టీ సతీష్ ఆరోగ్యం సహకరించకపోవడం వల్ల వైదొలగడం మాకు బాధాకరమైన విషయమన్నారు.ఈ కార్యక్రమంలో సుధీర్, వి శ్రీనివాసరావు,గుత్తుల శ్రీను, శేఖర్ బాబు,యాకూబ్ పాషా, జై నరసింహ,ప్రవీణ్, వెంకటేశ్వర్లు,సాయిరాం, సంతోష్,రాజశేఖర్,శ్రీను,ఎన్ సుధాకర్,రాజనర్స్,పి రవి,టి శంకర్,రఘు,బాలకృష్ణ, డి ప్రేమ్ కుమార్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఐద్వా ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-కొత్తగూడెం



అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కొత్తగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఐద్వా ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణ మున్సిపల్ పరిధిలోని కూలీ లైన్‌లో ఐద్వా జండాను జంజర్ల లక్ష్మీ ఆవిష్కరించారు. టౌన్ కమిటీ సభ్యురాలు ఎల్లంకి మీనా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పట్టణ టౌన్ కార్యదర్శి సందకూరి లక్ష్మీ మాట్లాడారు. అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం 1981 మార్చి 10, 11, 12 తేదీల్లో అప్పటి మద్రాసు నగరం, ఇప్పటి చెన్నై నగరంలో మొట్ట మొదటి మహాసభ జరిగిందని చెప్పారు. మహాసభలోనే ఐద్వా ఏర్పడిందని, అంతకు ముందు అనేక రాష్ట్రాల్లో వివిధ పేర్లతో సంఘం పనిచేస్తూ వచ్చిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘంగా, పశ్చిమ బెంగాల్లో పశ్చిమబంగా గణతంత్ర మహిళా సమితిగా మహారాష్ట్రలో కామ్ మహిళ సమితిగా అలా కేరళ, తమిళనాడు పంజాబ్ అనేక రాష్ట్రాల్లో మహిళా సంఘం ఏర్పడి పనిచేస్తూ వచ్చిందని చెప్పారు. 1981లో జరిగిన మొదటి మహాసభతో అఖిల భారత స్థాయి రూపం తీసుకుని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో ముంతాజ్, జాకిర, సుగుణ, మీనా, జింజర్ల, శ్రావణి, లక్ష్మి, పాల్గొన్నవారు.

విద్యా వైజ్ఞానిక యాత్రలతో మేధాశక్తి పెంపు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో చదువుతున్న విద్యార్థినిలకు స్టడీ టూర్ నిర్వహించడం వలన చదువుతోపాటు విజ్ఞానాన్ని, మేధాశక్తిని పెంపొందించుకోవడానికి మరియు వివిధ కార్యాలయాలలో జరుగుతున్న పనులు తెలుసుకొని అవగతం చేసుకోవడానికి అవకాశం కలుగుతుందని గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల సీనియర్ ఫ్యాకల్టీ, లైజన్ ఆఫీసర్ లక్ష్మి అన్నారు. బుధవారం భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలోని విభాగాలు మొబైల్ కోర్టు గిరిజన మ్యూజియం సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్న అనంతరం ఆమె మాట్లాడుతూ.. గిరిజన గ్రామాలలో ఐటీడీఏ ద్వారా ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల గురించి ఆ శాఖలకు సంబంధించిన అధికారులు విద్యార్థినీలకు తెలియజేశారని, అలాగే మొబైల్ కోర్టు ద్వారా గిరిజనుల భూములకు సంబంధించిన విషయాలు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారని, గిరిజన మ్యూజియంలో పాతతరంకు సంబంధించిన కళాఖండాలు ఆచార వ్యవహారాలు సాంస్కృతి సాంప్రదాయాలు కట్టుబాట్లు గురించి విద్యార్థినిలకు తెలియజేయడం జరిగిందని అన్నారు. వివిధ జిల్లాల నుండి డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థినిలు ముందుగా శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారని, ఈ విహారయాత్ర ద్వారా విద్యార్థినిలకు ఎన్నో విషయాలు చాలా వరకు తెలుసుకున్నారన్నారు. చదువుతో పాటు భవిష్యత్తులో వారు స్థిరపడడానికి ఐటీడీఏ అధికారులు విద్యార్థినిలకు అర్థమయ్యే రీతిలో వివరించి అవగాహన కల్పించారని అందుకు విద్యార్థినిలు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీలు అంజలి, నీలిమ, సింధు, 46 మంది విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీతో కిడ్నీ శాస్త్ర చికిత్సలు..


- శ్రీ శ్రీనివాస నర్సింగ్ హోమ్‌లో కిడ్నీ రోగులకు ఉచిత వైద్య సేవలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఇకనుండి జిల్లా ప్రజలకు కిడ్నీ సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య సేవలు అందనున్నాయి. భద్రాచలం పట్టణానికి చెందిన డాక్టర్ ఆది మోహన్‌రావు నేతృత్వంలో నిర్వహిస్తున్న శ్రీ శ్రీనివాస నర్సింగ్ హెూమ్‌కి ఆరోగ్యశ్రీ ద్వారా కిడ్నీ సంబంధిత ఆపరేషన్లకు అనుమతిని ప్రభుత్వం కల్పించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మొట్టమొదటిసారిగా ఏజెన్సీ కేంద్రమైన భద్రాచలం పట్టణంలో శ్రీ శ్రీనివాస నర్సింగ్ హెూమ్‌లో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత కిడ్నీ ఆపరేషన్ల అవకాశం లభించింది. కిడ్నీ మూత్రాషయ్య సంబంధిత వైద్య నిపుణులు డాక్టర్ హరీష్ చల్ల నేతృత్వంలో ఈ ఉచిత ఆరోగ్యశ్రీ వైద్య సేవలు ఈ జిల్లా ప్రజలకు అందనున్నాయి. ఇప్పటి వరకు కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడే రోగులు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు పొందేందుకు ఖమ్మం హైదరాబాద్ వంటి సుదీర్ఘ ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిన పరిస్థితి ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భద్రాచలం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక గల డాక్టర్ ఆదిమోహన్‌రావు నేతృత్వంలో నిర్వహిస్తున్న శ్రీ శ్రీనివాస నర్సింగ్ హెూమ్‌లో ఉచిత కిడ్నీ సంబంధిత వైద్య సేవలు అందుబాటులోకి రాగా ప్రధానంగా కిడ్నీ మూత్రశయ రాళ్లకు ఆపరేషన్లు ప్రోస్టేట్ గ్రంధి వాపు మూత్ర నాళాలు మూసుకుపోవడం మూత్రాశయ క్యాన్సర్ తోపాటు మగవారిలో సంతనోత్పత్తి సమస్య గలవారికి సెల్ ఆపరేషన్ తదితర కిడ్నీ సంబంధిత ఆపరేషన్లు ఈ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా పొందే అవకాశం ఈ ప్రాంత ప్రజలకు లభించింది.

ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని వైద్య సేవలందించాలనే లక్ష్యం..

డాక్టర్ ఆది మోహన్‌రావు



గత 30 ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న భద్రాచలం నియోజవర్గ ప్రజలతోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఉన్న కిడ్నీ బాధితులు ఉచిత వైద్య సేవలు కోసం సుదీర్ఘ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో కూడా కచ్చితంగా కిడ్నీ ఉచిత వైద్య సేవలు కావాలని ఇప్పటికే మా ఆస్పత్రిలో అందుతున్న ఆరోగ్య శ్రీ సేవలలో నూతనంగా కిడ్నీ ఆపరేషన్లను కూడా ప్రభుత్వ నుండి అనుమతిని పొందటం జరిగింది. ఈ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులో తీసుకురావాలని లక్ష్యంతో పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో మీమ్స్ ఆసుపత్రి నెలకొల్పి అన్ని వైద్య పరీక్షలు అందుబాటులోకి తీసుకువచ్చాం. అంతేకాకుండా గుండె నరాలు సంబంధిత ప్రత్యేక వైద్య నిపుణులు సైతం అందుబాటులో ఉంచాం. వీటితోపాటు ప్రతి నెల రెండో ఆదివారం నాలుగో ఆదివారం గ్యాస్ట్రో సేవలను కూడా మీమ్స్ ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పడానికి ఎంతో గర్విస్తున్నాం. వీటితోపాటు శ్రీ శ్రీనివాస నర్సింగ్ హెూమ్ ఆరోగ్యశ్రీ సేవలలో అదనంగా కిడ్నీ వైద్య సేవలు కూడా అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ఈ జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నాం.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

అన్నరాపు లాలయ్య 25 వర్ధంతి సభలో సీపీఐ(ఎం) నాయకులు తాళ్లపల్లి

నవతెలంగాణ-కొణిజర్ల

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి క్రిష్ణ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో అన్నరాపు లాలయ్య 25వ వర్ధంతి సభ బుధవారం వేముల సాంబశివరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి క్రిష్ణ తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్ లాలయ్య స్థూపానికి పూలమాల వేశారు. సీనియర్ నాయకులు చింతనిప్పు సూరయ్య పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాళ్లపల్లి కృష్ణ, మండల కార్యదర్శి చెరుకుపల్లి కుటుంబరావులు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై రానున్న రోజుల్లో పార్టీ ప్రజా ఉద్యమాలను నిర్మించబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చల్లా నారాయణ, యాసా ప్రభాకర్ రావు, తిలక్, పాపిట్ల ప్రసాద్, యాసా వెంకటేశ్వర్లు, లాలయ్య కుమారుడు ఐలు నాయకులు అన్నవరపు వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

355 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

నవతెలంగాణ-కల్లూరు

పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష అంటే భయం వదిలి ధైర్యంగా రాస్తే మంచి ఫలితాలు సాధించవచ్చునని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్ట దయానంద్ విజయకుమార్ సూచించారు. పట్టణ పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బుధవారం ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలోని 10వ తరగతి చదువుతున్న సుమారు 355 మంది విద్యార్థినీ, విద్యార్థులకు సేవా సంస్థ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్లు, స్కేల్ లు మట్టాతోపాటు ఆర్డిఓ ఎల్ రాజేంద్ర గౌడ్, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజా ప్రభాకర్ చౌదరి, చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పత్తిపాటి నివేదిత, కల్లూరు సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్లు భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, దోమ ఆనంద్ బాబు, సీనియర్ నాయకులు పసుమర్తి చంద్రరావు, లక్కినేని కృష్ణ పాల్గొన్నారు.

మేలుకో.. తెలుగును ఆదుకో

● భాషా పరిశోధకులు, తెలుగు ఉపాధ్యాయులు చంద్రగిరి వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-ఖమ్మం

తెలుగు భాష అద్భుతమైన జీవద్భాష, సరళంగా, ఒత్తులేకుండా రాయడానికి ఆస్కారమున్నదని భాషా పరిశోధకులు, తెలుగు ఉపాధ్యాయులు చంద్రగిరి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఖమ్మంలోని ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మొహ్మద్ జాకీరుల్లా అధ్యక్షతన తెలుగు లిపి -సరళత ఒత్తుల్లేకుండా... ఒత్తిడి లేకుండా తెలుగు రాయడం అనే అంశంపై నిర్వహించిన విస్తృతోపన్యాసంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. భాషలో లిపి మారుతున్న క్రమంలో అంతర్గతంగా ఒత్తులు వల్లనే భాష కష్టతరంగా మారుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి డాక్టర్ పి.రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ ఏ.ఎల్.ఎస్.శాస్త్రి, డాక్టర్ బానోత్ రెడ్డి, సీనియర్ తెలుగు అధ్యాపకులు, డాక్టర్ సీతారాం, తెలుగు విభాగం అధ్యాపకులు డాక్టర్ .జె.అనురాధ, డాక్టర్ .కిరణ్ పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం ముందుండి పోరాటాలు నిర్వహించే ఏకైక మహిళా సంఘం ఐద్వా మాత్రమే

● డివిజన్ మాజీ అధ్యక్షురాలు కొర్స చిలకమ్మ

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మహిళల హక్కులు, వాటి సాధన కోసం ముందుండి పోరాటాలు నిర్వహించే ఏకైక మహిళా సంఘం ఐద్వా మాత్రమేనని ఐద్వా డివిజన్ మాజీ అధ్యక్షురాలు కొర్స చిలకమ్మ అన్నారు. బుధవారం మండలంలోని ములకపాడు సెంటర్‌లో సంఘం 44వ ఆవిర్భవ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండా ఎగరవేశారు. ఐద్వా మండల అధ్యక్షురాలు పూనెం కనకదుర్గ అధ్యక్షతన జరిగిన సభలో కొర్స చిలకమ్మ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించాలని, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు అరికట్టే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి మిడియం జయ, వాగే రామలక్ష్మి, పూనం ఊర్మిళ, సంధ్య, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

పాత నారాయణరావుపేటలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాత నారాయణరావుపేట గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక వైద్యాధికారి పుల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 65 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం క్యాంపు లో క్షయ వ్యాధి, సీజనల్ వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా ప్రజలు అందరూ తమ పనులను ఉదయం 11 గంటల లోపు పూర్తి చేసుకొని ఇంటికి చేరుకునే విధంగా చూడాలని సూచించారు. ఎండలో పనికెళ్లినవారు తప్పకుండా ఓఆర్ఎస్ తీసుకోవాలని తెలిపారు. ఇంటిలోనే ఓఆర్ఎస్ ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. ఇంటిలో ఓఆర్ఎస్ తయారు చేసే విధానం ఒక లీటర్ మంచినీటిలో హాఫ్ టీస్పూన్ ఉప్పు, రెండు స్పూన్ల చక్కెర వేసి కలుపుకొని ఆ నీటిని సేవించాలన్నారు. చిన్నపిల్లలు, గర్భిణీలు, బాలింతలు అలాగే వృద్ధులు అత్యవసరమైతే తప్ప 11 తర్వాత బయటకు రావద్దు అని సూచించారు. ఈ హెల్త్ క్యాంప్‌లో సూపర్వైజర్ సాగర్, ఎం.ఎల్.హెచ్.పి సుప్రియ, హెల్త్ అసిస్టెంట్ చలపతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

నవతెలంగాణ-అశ్వారావుపేట

మండల పరిధిలోని వినాయకపురం సమీపంలోని శ్రీ చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం ప్రాంగణంలో బుధవారం శ్రీరామ ఆగ్రో సర్వీసెస్, భద్రాద్రి బ్లడ్ డొనేషన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో యువకులు అధిక సంఖ్యలో తరలి వచ్చి రక్తదానం చేయగా, శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయా సంస్థల బాధ్యులు మాట్లాడుతూ దాతల నుంచి సేకరించిన రక్తాన్ని సికిల్ సెల్ అనీమియా, తలసేమియా బాధితులకు ఉచితంగా అందిస్తామని, గిరిజన ప్రాంతంలో నిర్వహించిన శిబిరానికి మంచి ఆదరణ రావడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎండి జే.రమేష్, జీఎం కృష్ణ, శ్రీకాంత్, మేనేజర్ బి రాజు, రవిచంద్ర, తిరుపతిరావు, సింధు, కిషోర్, సన్నీ, లోకేష్, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే బీసీలకు న్యాయం

నవతెలంగాణ-దుమ్ముగూడెం



తెలంగాణా ఉద్యమకారుడు, బహుజననేత ప్రొఫెసర్ దాసోజ్ శ్రావణ్ కు ఎమ్మెల్సీ ఇవ్వటంపై మండల బీఆర్ఎస్ పార్టీ బీసీ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం తురుబాకలో జరిగిన పార్టీ బీసీ సెల్ సమావేశంలో ఆ సంఘం మండల నాయకులు కుమ్మరి కుంట్ల సూర్య మాట్లాడుతూ తెలంగాణా ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించి, తెలంగాణా ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన తెలంగాణా ఉద్యమ నేత ప్రొఫెసర్ దాసోజు శ్రావణ్‌కు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవిని ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోనే బీసీలకు సరైన న్యాయం జరుగుతుందని మరోసారి రుజువు అయ్యిందని అన్నారు.

నేడు బాణాపురం హైస్కూల్లో సెలబ్రేషన్స్

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలోని బాణాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు కాంప్లెక్స్ పాఠశాలల సెలబ్రేషన్స్ (యన్యువల్ డే) గురువారం నిర్వహించినట్లు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఐవి రామిరెడ్డి బుధవారం ఒక ప్రకటన తెలిపారు. ఈసెలబ్రేషన్స్ ముఖ్యఅతిథులుగా అసిస్టెంట్ సెక్రటరీ ఎస్ రవికుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్ శర్మతో పాటు, తహాశీల్దార్ కొక్కుల సునీత ఎలిజిబెత్, ఎంపీడీఓ ఎస్ శ్రీధర్ స్వామి, ఏఎంఓ కె రవికుమార్, సీఐ ఓ మురళి, ఎంఈఓ డి.రమణయ్య హాజరుకానునట్లు ఆయన పేర్కొన్నారు.

శరణాలయాల్లో పారిశుధ్యం లేమిపై న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఆగ్రహం

నవతెలంగాణ-అశ్వారావుపేట



అనాథ, వృద్ధుల ఆశ్రమాల్లోని నిరాశ్రయులైన వారి సరైన వివరాలు లేకపోవడం, రిజిస్టర్స్ సరిగా నిర్వహించుకోవడం, ఆశ్రమం పరిసరాలు, శౌచాలయాలు సరిగా లేకపోవడం పట్ల జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి జి. భానుమతి ఆగ్రహం వ్యక్తం చేశారు. అశ్వారావుపేట, వినాయకపురంలో గల అనాథ పిల్లల ఆశ్రమాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి పిల్లలకు అందిస్తున్న కనీస సౌకర్యాల గురించి ఆశ్రమ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వివిధ కారణాల వల్ల సంరక్షణ కష్టంగా ఉండడం వల్ల వచ్చిన అనాథ పిల్లలకు ఆహారం తదితర అంశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఈ సందర్భంగా తెలిపారు. న్యాయమూర్తి అనాథ శరణాలయం ఆవరణ, కిచెన్ రూమ్, స్టోర్ రూమ్ ను పరిశీలించారు. అనాథ శరణాలయంను సజావుగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కౌన్సిల్ పి.నిరంజన్ రావు, అడ్వకేట్ మెండు రాజ మల్లు, ఎస్.ఐ ఊకే రామ్మూర్తి, ధనుష్‌కోటి పాల్గొన్నారు.

రంగు రంగుల బొమ్మలతో...

కళకళలాడుతున్న దంసలాపురం ఓవర్ బ్రిడ్జి



దంసలాపురం బ్రిడ్జి

● వెలవెల బోతున్న బోనకల్ ఓవర్ బ్రిడ్జి
● మంత్రి నియోజకవర్గంలో దంసలాపురం...
● డిప్యూటీ సీఎం నియోజకవర్గంలో బోనకల్..

నవతెలంగాణ-బోనకల్

మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో గల దంసలాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి రంగురంగుల బొమ్మలతో కళకళలడుతోంది. డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే బోనకల్ రైల్వే ఓవర్ బ్రిడ్జి అభివృద్ధికి నోచుకోక వెలవెలబోతున్నది. ఖమ్మం - బోనకల్ ప్రధాన రహదారిలోనే ధంసలాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి ఉంది. అదేవిధంగా బోనకల్ మండల కేంద్రంలో బోనకల్ రైల్వే ఓవర్ బ్రిడ్జి ఉంది. మధిర నియోజకవర్గంలోనే బోనకల్ గుండెకాయ లాంటిది. బోనకల్ రైల్వే ఓవర్ బ్రిడ్జి తర్వాతనే ధంసలాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరిగింది. రెండు బ్రిడ్జిలు ప్రస్తుతం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలలోనే ఉన్నాయి. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న దంసలాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి గత కొన్ని రోజులుగా సామాజిక స్పృహ తదితర అంశాలతో కూడిన రంగురంగుల బొమ్మలతో తీర్చిదిద్దుతున్నారు. ఒక్కసారిగా ధంసలాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జిని చూస్తే ఔరా అనిపించక తప్పదు. ధంసలాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి మొత్తం వివిధ రకాల జంతువులు, వివిధ రకాల డిజైన్లతో, ట్రాఫిక్ నిబంధనలను సూచించే బొమ్మలతో అబ్బురమనిపిస్తుంది. పైగా సెంట్రల్ లైటింగ్ తో వెలిగిపోతుంది. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే రైల్వే ఓవర్ బ్రిడ్జి ఎందుకు కలకలలాడుతుంది, సాక్షాత్తు డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న బోనకల్ రైల్వే ఓవర్ బ్రిడ్జి ఎందుకు అభివృద్ధికి నోచుకోవటం లేదని మండల ప్రజలు అంటున్నారు. డిప్యూటీ సీఎం స్థాయి తర్వాతనే మంత్రి స్థాయి ఉంటుంది. డిప్యూటీ సీఎం తోపాటు ఆర్థిక శాఖ మంత్రిగా మల్లు భట్టి విక్రమార్క ఉన్నారు. ఖమ్మం కార్పొరేషన్ ఆధ్వర్యంలో ధంసలాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి రంగులు దిద్దుకుంటుంది. బోనకల్ కు కార్పొరేషన్ లేకపోయినా డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కార్పొరేషన్ స్థాయి కంటే రాష్ట్రస్థాయిలోనే రెండవ స్థానంలో మల్లు భట్టి విక్రమార్క ఉన్నారు. కానీ బోనకల్ రైల్వే ఓవర్ బ్రిడ్జి అభివృద్ధిలో మాత్రం ఆమడ దూరంలో ఉందని మండల ప్రజలు అంటున్నారు. బోనకల్ ఆర్వో బ్రిడ్జి ప్రారంభం నుంచి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, మండలాన్ని రెండు భాగాలుగా చీల్చుతున్న రైల్వే ట్రాక్ కు రెండు వైపులా బ్రిడ్జికి మెట్లు ఏర్పాటు చేయాలని, మండల కేంద్రంలోని శ్రీ దుర్గా పిక్చర్ ప్యాలెస్ వద్ద నాలుగు రహదారులు కలుస్తున్న చోట రింగ్ రోడ్డు నిర్మించాలని ఎన్నో ఏళ్ల నుంచి మండల రాజకీయ నాయకులు, ప్రజలు కోరుతూ వస్తున్నారు. అనేకసార్లు ప్రస్తుత డిప్యూటీ సీఎం కు వివిధ రాజకీయ పక్షాల నాయకులు, ప్రజలు వినతి పత్రాలు ఇస్తూనే వస్తున్నారు. కానీ అమలకు మాత్రం నోచుకోవటం లేదు.

బోనకల్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిన సంగతి ప్రజలందరికీ తెలిసింది. ప్రారంభించిన కొద్ది కాలానికే బ్రిడ్జి పెద్ద పెద్ద గుంతలతో ప్రమాదకరంగా మారింది. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలకు అత్యంత ప్రధానమైన ఈ బ్రిడ్జి అభివృద్ధి పట్ల గత పాలకులు, నేటి పాలకులు నిర్లక్ష్యం ప్రదర్శించడం పట్ల మండల ప్రజల తీవ్ర అసంతృప్తిని ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. డిప్యూటీ సీఎం ఖమ్మం నుంచి మధిర వెళ్లాలంటే ధంసలాపురం బ్రిడ్జి, బోనకల్ బ్రిడ్జి మీదుగానే వెళుతుండటం విశేషం. దంసలాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి అభివద్ధి లాగానే బోనకల్ రైల్వే ఓవర్ బ్రిడ్జిని అభివృద్ధి పరచాలని మండల రాజకీయ అఖిలపక్ష నాయకులు, ప్రజలు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కోరుతున్నారు.



బోనకల్ ఓవర్ బ్రిడ్జి



ఇంకుడు గుంతల నిర్మాణాల్లో జిల్లా అగ్రస్థానంలో ఉండాలి

● కలెక్టర్ జితేష్ వి. పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ

జల సంచయ్ జన్ భగీదారి క్యాచ్ ద రైన్ అమలులో భాగంగా దేశంలోనే జిల్లాను అగ్రస్థానంలో నిలపటమే లక్ష్యం అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. బుధవారం కొత్తగూడెం హమాలీ కాలనీలో జల సంచయ్ జన్ భగీ దారి అమలులో భాగంగా కలెక్టర్ స్వయంగా ఇంకుడు గుంతల నిర్మాణానికి ఎంత సమయం పడుతుంది, ఎలా నిర్మించాలని పరిశీలించారు. దీనిలో భాగంగా కలెక్టర్ స్వయంగా ఇంకుడు గుంతను తొవ్వారు. స్థానికంగా ఉన్న యువకులతో మమేకమై వారితో కలిసి ఇంకుడు గుంటల నిర్మాణాన్ని కలెక్టర్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన భూగర్భ జలాలను అభివృద్ధి పరచడానికి ఇంకుడు గుంతల ఆవశ్యకతను యువకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఎంపీడీవో, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాసన నాగేంద్రమ్మ మృతికి సంతాపం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండల పరిధిలోని రామపురం గ్రామానికి చెందిన పాసన జయరామ్ భార్య, సిపి(ఐ)ఎం సభ్యురాలు పాసన నాగేంద్రమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. మృతదేహాన్ని పార్టీ మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్‌రావు సందర్శించి ఎర్రజెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల సభ్యులు నాగులవంచ వెంకట రామయ్య, సగుర్తి సంజీవరావు, అప్పారావు, షేక్ పాకిర్, వెంకటేశ్వర్లు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మహా ప్రస్థానం వాహనం, ఫ్రీజర్ బాక్స్ ప్రారంభం

నవ తెలంగాణ-పెనుబల్లి

మండలం మండలం కాకతీయ కమ్మ సేవ సంఘం ఆధ్వర్యంలో మహాప్రస్థానం వాహనం, ఫ్రీజర్ బాక్స్‌ను బుధవారం ప్రారంభించారు. ప్రస్థాన వాహనానికి నిధులు అందజేసిన పోపూరి అంకినీడు ఆ వాహనాన్ని, ఫ్రీజర్ బాక్స్‌ని ప్రారంభించారు. మూడున్నర లక్షల రూపాయలు వ్యయంతో కొనుగోలు చేసిన వాహనం, ఫ్రీజర్ బాక్స్ అన్ని సామాజిక వర్గాలకు అందుబాటులో ఉంటుందని దాత అంకినీడు తెలిపారు. తనతోపాటు ఈ కార్యక్రమానికి నిధులు అందజేసిన ప్రతి ఒక్కరినీ ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో కమ్మ సేవా సంఘం నాయకులు కనగాల సాంబశివరావు, సూర్యదేవర రవికుమార్, చీకటి నరసింహారావు, సుంకర సత్యనారాయణ, గోగినేని రమేష్, పీవీ ప్రసాద్, దత్తు, బెల్లంకొండ శ్రీనివాసరావు, బెల్లంకొండ చలపతి, వాణిపతిరావు, కొప్పుల గోవిందరావు, మందడపు అశోక్‌కుమార్, జిజ్జవరపు పుల్లయ్య, మేక తొట్టికాంతయ్య, భూక్య ప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత మెడికల్ క్యాంప్

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

స్థానిక చర్చ్ కాంపౌండ్ సెంటర్ గాంధి పార్క్ గ్రంధాలయ ఆవరణలో బుధవారం 'డా కేర్ హెూమియోపతి' ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ క్యాంపులో సుమారు వంద మందికి బీపీ, షుగర్ మొదలగు పరీక్షలు చేసి ఉచితంగా హెూమియోపతి మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ షేక్ అష్రఫ్‌ఉద్దీన్ మాట్లాడుతూ డా కేర్ సంస్థ సిఎండి డా ఏఎం రెడ్డి సహకారంతో పట్టణ వ్యాప్తంగా ఉచితంగా క్యాంప్‌లు నిర్వహిస్తూ వైద్యం అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. క్యాంపులో ఖమ్మం బ్రాంచ్ పిఆర్‌ఓ సిహెచ్ వెంకటేశ్వర్లు, ఫార్మాసిస్ట్ ఆశ కుమారి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

'పది'లో 100 శాతం ఫలితాలు సాధించాలి

నవతెలంగాణ - బోనకల్

పదవ తరగతి పరీక్ష ఫలితాలలో 100 శాతం ఫలితాలు సాధించి అగ్రభాగాన నిలవాలని బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులను మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య, తహసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్ కోరారు. మండల కేంద్రంలో గల బాలికల గురుకుల పాఠశాలను బుధవారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న మటన్ కర్రీని, భోజనాన్ని వారు పరిశీలించారు. విద్యార్థులతో కలిసి వారు భోజనం చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ విద్యార్థులను పరీక్షలు ఎలా రాస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల భోజనం విషయంపై ఎటువంటి రాజీ లేకుండా నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అమలు చేయాలని ప్రిన్సిపాల్ పాసంగులపాటి వెంకట పద్మావతిని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య విషయంపై నిత్యం పర్యవేక్షణ ఉండే విధంగా ఉపాధ్యాయులు ఉండాలన్నారు.

అధిక సాంద్రత పద్ధతిపై కిసాన్ మేళా

నవతెలంగాణ-వైరా



కృషి విజ్ఞాన కేంద్రం వైరాలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై బుధవారం కిసాన్ మేళా నిర్వహించారు. అధిక సాంద్రత పద్ధతిలో రైతులకు అవగాహన కల్పిస్తూ క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పత్తి ప్రధాన శాస్త్రవేత్త డా.వీరన్న మాట్లాడుతూ సాంప్రదాయ పత్తి సాగుకు మరియు అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుకు మధ్య గల తేడాను విశ్లేషించి, అధిక సాంద్రత పద్ధతిలో వివిధ మెలకువలపై రైతులకు అధిక సాంద్రత పద్ధతి ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వెంకన్న మాట్లాడుతూ ప్రస్తుతం వరిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు మేలైన దిగుబడుల కోసం వరిలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. డా.ఓం ప్రకాష్ వరి, పత్తిలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులను రైతులకు వివరించారు. అపరాల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కే రుక్మిణి దేవి జిల్లాలో అపరాల సాగు పెంచాలని, అపరాల సాగు కోసం అనువైన అపరాల రకాల ఎంపిక మొదలుకొని కోత వరకు చేపట్టవలసిన వివిధ యాజమాన్య పద్ధతులను వివరించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యాన పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పశువైద్య శాఖ ఎడిఎ రమణి మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం పశువుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, గొర్రెలు, మేకలు, పందులు, నాటు కోళ్ళు పెంచుటకు రకరకాల సబ్సిడీతో కూడిన రుణాలను పొందవచ్చని వివరించారు. ప్రొఫెసర్ ఐవి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మామిడి, ఆయిల్ పామ్ తోటల్లో తీసుకోవాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులను వివరిస్తూ ఆయిల్ ఫాం సాగు రైతులకు మంచి లాభాలు వచ్చే ఉద్యానవన పంట అన్నారు. కార్యక్రమంలో మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.విజయ చంద్ర మాట్లాడుతూ రైతులు భూసారాన్ని పెంచుకోవాలని కోరారు. వైరా సహాయ వ్యవసాయ సంచాలకులు తుమ్మలపల్లి కరుణశ్రీ మాట్లాడుతూ రైతులు యూరియా వాడకాన్ని సిఫారసు మేరకు మాత్రమే పంటల సాగులో వేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ స్టాల్స్‌ను, పుంగనూరు జాతి ఆవులను ప్రదర్శనలో ఉంచి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమములో కెవికె ప్రోగ్రాం కోర్డినేటర్ డాక్టర్ కే రవికుమార్, శాస్త్రవేత్తలు డాక్టర్ వి.చైతన్య, ఫణిశ్రీ మరియు విశ్వవిద్యాలయ పరిశోధన, విస్తరణ సలహా మేంబర్ రాణా ప్రతాప్, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల ధాన్యం ఆరబోసే పట్టాలు సిద్ధం

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు

నవతెలంగాణ-నేలకొండపల్లి

ప్రస్తుత యాసంగి సీజన్లో రైతులు తాము పండించిన ధాన్యాన్ని ఆరబోసేందుకు అవసరమైన పట్టాలు స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో సిద్ధంగా ఉన్నాయని పట్టాలు కావలసిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం చైర్మన్ వెన్నపూసల సీతారాముల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన మేరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు ఆయన చెప్పారు.అనంతరం గత సమావేశంలో జరిగిన తీర్మానాలను మార్కెట్ కార్యదర్శి చదివి వినిపించారు. మార్కెట్ కమిటీ ప్రథమ శ్రేణి కార్యదర్శిగా అజ్మీర పంతులు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను పాలకవర్గం తరపున శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కూసుమంచి సహాయ వ్యవసాయ సంచాలకులు బి.సరిత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండపర్తి సురేష్, మార్కెట్ కమిటీ గ్రేడ్ 3 సెక్రెటరీ వి.నాగేశ్వరి, కమిటీ డైరెక్టర్లు మీసా నాగేశ్వరరావు, సూరేపల్లి రవి, చిట్టూరి అచ్చయ్య, భూక్య సిత్యానాయక్, మొక్క ఉపేందర్, బానోతు బొంగ నాయక్, చాట్ల సత్యనారాయణ, తిప్పాని సరోజిని, సైదానాయక్ పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు మట్టా పరామర్శ

నవతెలంగాణ-కల్లూరు

మండలంలో పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను బుధవారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ పరామర్శించారు. కల్లూరు పట్టణంలోని నిర్మల్ జాయింట్ కలెక్టర్ లక్కినేని కిషోర్ తల్లి శాంతమ్మ దిన దిశ కర్మలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. చంద్రుపట్ల గ్రామానికి చెందిన బర్రె ఏసుబాబు, మృత్యుంజయ చిత్రపటానికి పూలమాలలో వేసి నివాళులర్పించారు. కంపాటి నాగేశ్వరరావు ఇటీవల ప్రమాదంలో కాలు గాయపడగా వారి నివాసంలో వారిని పరామర్శించారు.అదే కాలనీకి చెందిన కంపాటి పెద్ద నాగేశ్వరరావు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారిని వారి నివాసంలో పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు, సత్తుపల్లి ఏఎంసి చైర్మన్లు బాగం నీరజ ప్రభాకర్ చౌదరి, దోమ ఆనంద్ బాబు, కల్లూరు మండలం సీనియర్ కాంగ్రెస్ నాయుకులు పసుమర్తి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే నిధులు వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ-చింతకాని

సమగ్ర కుటుంబ సర్వే చేసిన ఉపాధ్యాయులకు వెంటనే నిధులు విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షులు తోటకూర శ్రీనివాస్ కోరారు. బుధవారం తహశీల్దార్ కూరపాటి అనంతరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వెంటనే స్పందించి జిల్లాస్థాయి అధికారులకు డిటి ద్వారా లెటర్ రాయడం జరిగింది. వెంటనే స్పందించిన తాసిల్దార్‌కి టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిడిఎస్‌వి రమణ, తోటకూరి శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు.

ఎంబీ జిమ్‌ను ప్రారంభించిన తుమ్మల యుగంధర్

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని మోతే నగర్‌లో మోన్‌స్టర్ బీట్ (ఎంబీ) జిమ్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ బుధవారం ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనిషి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపడానికి వ్యాయమం ఎంతో అవసరమని అన్నారు. ఎంబీ జిమ్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. మమత రోడ్‌లో ఉన్న బ్రాంచ్‌తో పాటు మరెన్నో ప్రాంతాల్లో బ్రాంచ్‌లు ఓపెన్ చేసి దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిమ్ నిర్వాహకులు ఉదయ్, ప్రవళికలకు శుభాకంక్షలు తెలిపారు. అనంతరం నిర్వాహకులు మాణిక్యాల ఉదయ్, మాణిక్యాల ప్రవళిక మాట్లాడుతూ.. అడ్వాన్స్‌డ్ మిషనరీ, కార్డియో రెస్క్యులర్, ఇన్ ఆర్గాన్స్ వ్యాయమానికి సంబంధించిన అధునాతన పరికరాలను జిమ్‌లో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ జిమ్‌లో ప్రత్యేకంగా మహిళలకు లేడీ ట్రైనర్‌ను పెట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో త్రీ టౌన్ సీఐ రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మదూరి సైదారావు తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళలకు నిత్యావసర వస్తువు పంపిణీ

నవతెలంగాణ-కల్లూరు

స్ఫూర్తి ఫౌండేషన్ కార్యాలయం నందు ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో వృద్ధులైన ఒంటరి మహిళలల 21 కుటుంబాలకు కల్లూరు ఆర్డీవో రాజేంద్ర కుమార్ గౌడ్ చేతుల మీదగా బుధవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి వరక రామారావు, స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ ఉయ్యూరి శ్రీవ్యాల్, రిటైర్డ్ జెల్ ఉబ్బన నాగరాజు, పసుపులేటి వీర రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

పిండి వంటలు చేస్తుండగా అగ్ని ప్రమాదం

రూ 2.లక్షల మేర ఆస్తి నష్టం

నవతెలంగాణ -సత్తుపల్లి

పిండి వంటలు చేస్తుండగా గ్యాస్ లీకై అగ్నిప్రమాదం చోటు చేసుకున్న ఘటన సత్తుపల్లి పట్టణంలో బుధవారం సాయంత్రం జరిగింది. సమాచారం అందుకున్న సత్తుపల్లి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అగ్ని మాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం...సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ద్వారకాపూరి కాలనీ రోడు-నెంబరు-4 లోని వెంకటేశ్వరరావు, అంజమ్మ ఇంట్లో సాయంత్రం 4గంటల సమయంలో పిండి వంటలు చేస్తుండగా గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాద సమయంలో పక్కనే ఉన్న వాషింగ్ మిషన్, ఫ్రిడ్జ్, ఇంటి తలుపులు, కిటికీలు, ఇతర గృహోపకరణ వస్తువులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. కుటుంబ సభ్యులు సురక్షితంగా బయటపడ్డారు. సుమారు రూ.2లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారు.



కల్లూరులో భద్రాద్రి బ్యాంక్ 18వ శాఖ ప్రారంభం

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

ప్రైవేటు రంగంలో ఉన్న సహకార బ్యాంకులు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ పసుమర్తి చంద్రరావు కోరారు. బుధవారం కల్లూరులో నూతనంగా ఏర్పాటు చేసిన భద్రాద్రి, కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకును చైర్మెన్ చెరుకూరి కృష్ణమూర్తి ప్రారంభించారు. క్యాష్ కౌంటర్‌ను రైస్ మిల్ అసోసియేషన్, కల్లూరు ప్రెసిడెంట్ చారుగుండ్ల అచ్యుత సీతారామారావు ప్రారంభించారు. బ్యాంకు చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి మాట్లాడుతూ తమ బ్యాంకు 930 కోట్ల రూపాయలతో వ్యాపారం నడిపిస్తుందని తెలిపారు. గృహ, వాహన, వ్యాపార, విద్య, చిన్న తరహా పరిశ్రమలకు రుణాలను తక్కువ వడ్డీకి అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈవో దాశర వేణుగోపాల్, బ్యాంకు డైరెక్టర్లు దేవత రాజారావు, మద్ది పిచ్చయ్య, వైస్ చైర్మన్ ఉదయ ప్రతాప్, వేములపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'భగీరథ' ప్రయత్నం..!

- పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్లతో నీరు పడుతున్న రైతు

నవతెలంగాణ-లింగాలగణపురం



పొట్ట దశ ఈనే దశలో చేతికం దొచ్చే వంట నీరు లేక ఎండి పోతుంటే రైతు కన్నీటి పర్యంతమై పంటను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. ట్యాంకర్ సాయంతో వరి పంట పొలానికి నీళ్లు పోస్తూ కాపాడేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. జనగామ జిల్లా లింగాలగణపురం మండలంలోని బండ్లగూడెం గ్రామానికి చెందిన రైతు చల్ల వెంకటరెడ్డి తన వ్యవసాయ బోరుబావి కింద వేసిన వరి పంట పైరు ఈనుతున్న క్రమంలో నీరు లేక పూర్తిగా ఎండిపోయే దశకు చేరుకుంది. దాంతో వరి పంటను కాపాడేందుకు ఒక్కొక్క ట్యాంకర్‌కు రూ.500 వెచ్చించి నీటిని తీసుకొచ్చి పొలానికి పోస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన కౌలు రైతు దేవయ్య బోర్ బావి పూర్తిగా ఎత్తిపోవడంతో వేసిన వరి పంట ఎండిపోతుంది. దాంతో పొలంలో పశువులను మేపుతున్నాడు. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయి బోర్లు, బావులు చుక్క నీరు లేకుండా ఎండిపోవడంతో రైతులు సాగుచేసిన పంటలు చేతికి వస్తాయా లేదా అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాలువల ద్వారా చెరువులు నింపి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మహిళా జర్నలిస్ట్ అరెస్టుకు కేటీఆర్ ఖండన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీనియర్ మహిళా జర్నలిస్టు రేవతి అరెస్టును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 5 గంటలకు రేవతి ఇంటిపై దాడి చేసి ఆమెతోపాటు కుటుంబ సభ్యులను నిర్బంధించి ప్రభుత్వం వేధింపులకు గురి చేసిందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి తన కుటుంబంతో పాటు, తనపై ఒత్తిడి చేస్తూ బెదిరింపులకు దిగుతున్నారని రేవతి స్వయంగా ఆరోపించిన నేపథ్యంలో ఆమెకు ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవతితో పాటు యువ జర్నలిస్టు తన్వి యాదవ్ అరెస్టు చేయడం దారుణమని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం అని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి తెలంగాణను నియంతల రాజ్యంగా రేవంత్ రెడ్డి మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెల్లవారకముందే చట్ట వ్యతిరేకంగా మహిళా జర్నలిస్ట్ రేవతిని అరెస్టు చేసిన తీరు, ఇందిరాగాంధీ ఎమర్జెన్సీలో మీడియాపై విధించిన ఆంక్షలను, ఎమర్జెన్సీ నాటి దుర్మార్గపు రోజులను గుర్తుకు తెస్తున్నాయని తెలిపారు. రాహుల్ గాంధీ చెబుతున్న రాజ్యాంగబద్ధమైన పాలన ఇదేనా? అని ప్రశ్నించారు. ప్రజా పాలనలో మీడియా స్వేచ్ఛ అనేదే లేకుండా పోయిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు మీడియా, సోషల్ మీడియా గొంతుకలపై చేస్తున్న ఈ దాడులను, అక్రమ కేసులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.

రైతులపై బీఆర్ఎస్ మొసలి కన్నీరు

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పదేండ్లలో రైతులకు రుణ మాఫీ చేయని వారు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య విమర్శించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌కు చెందిన ఒక ఎమ్మెల్యే గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కుల గణన చేస్తే దానిపై మతి లేక మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయడానికి బీఆర్ఎస్ నేతలు కంకణం కట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్లు తీసుకుని ఇప్పుడు గొప్పలకు పోతున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయని అభివృద్ధిని పది నెలల్లో రేవంత్ ప్రభుత్వం చేస్తే తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. ఏడాదిలో 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. దాన్ని చూసి ఓర్వలేక పింక్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో కలపాలనటం తగదు

- బీజేపీ ఎంపీ డీకే అరుణ తన వైఖరిని మార్చుకోవాలి : టీజీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో కలపాలంటూ బీజేపీ ఎంపీ డీకే అరుణ పార్లమెంట్‌లో మాట్లాడటం తగదని తెలంగాణ గిరిజన సంఘం(టీజీఎస్) విమర్శించింది. ఈ మేరకు బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. బీజేపీ తన రాజకీయ అవసరాల కోసం గతంలో ఆదిలాబాద్ మాజీ ఎంపీ సోయం బాబురావు ద్వారా గిరిజన తెగల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టిందని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు గిరిజన తెగలకు బీసీ కులాల్లోని వాల్మీకి బోయల మధ్య చిచ్చు పెట్టి రాజకీయంగా లబ్ది పొందేందుకు ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. గిరిజన తెగల జాబితాలో కలపాలంటే ఆర్థిక వెనుకబాటు ఒక్కటే ప్రామాణికం కాదనే విషయాన్ని డీకే అరుణకు తెలియదా? అని ప్రశ్నించారు. అందుకు రాజ్యాంగ బద్దంగా నియమించిన అనేక కమిషన్లు కొన్ని లక్షణాలను ప్రామాణికంగా తీసుకోవాలని చెప్పాయని గుర్తు చేశారు.

దుకాణాల సముదాయంలో షార్ట్‌సర్క్యూట్

- ఐదు దుకాణాలు దగ్ధం.. నిజామాబాద్ జిల్లాలో ఘటన



నవతెలంగాణ-ఆర్మూర్

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ 44వ జాతీయ రహ దారిపై బుధవారం ఉదయం దుకాణాల సముదాయంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. భారత్ పెట్రోల్ పంపు పక్కన 5 దుకాణ సముదాలయాలకు అగ్ని ప్రమాదం సంభవించగా స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఈ సముదాయాల్లోని కిరణా షాప్, హొటల్, ఆటోమొబైల్ షాపులను నిర్వహిస్తూ పలువురు ఉపాధి పొందుతున్నారు. సుమారుగా ఐదు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధిత దుకాణ యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న వెంటనే మంటలను ఆర్పి వేసినట్టు అగ్నిమాపక అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని సంబంధిత దుకాణదారులు వేడుకుంటున్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

- బీఆర్ఎస్వీ నాయకులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్వీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో అసెంబ్లీ సమావేశాల మొదటి రోజు ముట్టడించేందుకు కొంత మంది నాయకులు చేసిన ప్రయత్నాన్ని పోలీసులు భగ్నం చేశారు. అసెంబ్లీ వద్దకు వచ్చిన నాయకులు, రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉదయం 11 గంటల సమయంలో కొద్ది మంది నాయకులు అసెంబ్లీ వైపుకు వెళుతుండగా అడ్డుకున్న పోలీసులు వారిని అరెస్ట్ చేసి అక్కడ్నుంచి తరలించారు. మరికొద్ది సేపట్లోనే మరి కొంత మంది నాయకులు అటువైపు వెళ్లేందుకు రాగా వారిని కూడా పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి అక్కడ్నుంచి తీసుకెళ్లారు.

తప్పుల తడకగా ఎల్ఆర్ఎస్ సర్వే..

ఎడిట్ ఆప్షన్ లేదని చేతులెత్తేసిన అధికారులు

- దాదాపు నాలుగు రెట్లు అధిక చార్జీలు వసూలు
- గ్రేటర్ వరంగల్ బాధితుల ఆందోళన



నవతెలంగాణ-వరంగల్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనధికార లేఅవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ఎల్ఆర్ఎస్ తీసుకొచ్చింది. 25 శాతం తగ్గింపుతో ఈనెల 31 లోపు క్రమబద్ధీకరణ చేసుకోవడానికి ప్రభుత్వం గడువు విధించింది. గ్రేటర్ వరంగల్ పరిధిలో 2020లో అనధికార లేఅవుట్ ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకోవడానికి రూ.1000 చెల్లించి సుమారు లక్షమంది అర్జీదారులు మీసేవ ద్వారా దరఖాస్తులు చేసుకున్నారని అధికారిక వర్గాల సమాచారం. ఆరేండ్ల క్రితం అర్జీదారులు సుమారుగా రూ.10కోట్లు ఎల్ఆర్ఎస్ పేరుతో చెల్లించారు. ఇప్పటివరకు బల్దియా సిబ్బంది సుమారు 3వేల ప్లాట్లకు మాత్రమే ఎల్ఆర్ఎస్ సర్వే చేశారు. అయితే కొన్ని చోట్ల కొన్నప్పుడు ఉన్న మార్కెట్ విలువ ప్రకారం నమోదు చేయకుండా ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువ నమోదు చేశారని, దాంతో అదనంగా చార్జీలు పడటంతో ఆర్థికంగా నష్టపోతున్నామని బాధితులు వాపోతున్నారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్‌లో ఎల్ఆర్ఎస్‌కు సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకు కౌంటర్లు ఏర్పాటుచేశారు. దానిపై సిబ్బందికి అవగాహన లేకపోవడంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు చేసుకున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులను సంప్రదిస్తే కనీసం స్పందన ఉండటం లేదు. సర్వే చేసినప్పుడు ఏదైనా తప్పులు దొర్లితే సవరణ చేసుకోవడానికి ఆప్షన్ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం సవరణ కోసం ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో ఎల్ఆర్ఎస్ చేసుకోవాలంటే అదనపు చార్జీలు చెల్లించాల్సి వస్తున్నదని పలువురు తెలిపారు. సంబంధిత ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని బాధితులు వేడుకుంటున్నారు.

ఎల్ఆర్ఎస్‌కు ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలి



వరంగల్ జిల్లా పైడి పల్లి శివారులో 263 గజాల స్థలం 2020న కొనుగోలు చేశారు. అప్పుడు స్థలం గజానికి మార్కెట్ విలువ రూ.800 ఉన్నది. ప్రస్తుతం రూ.3100 ఉన్నది. ఎల్ఆర్ఎస్ సర్వే కోసం వచ్చిన బిల్డింగ్ ఇన్స్‌పెక్షన్‌లో కొన్నప్పటి మార్కెట్ విలువ వేయకుండా ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువ వేయడంతో రూ.1,31,734 చార్జీలు చెల్లించాల్సి వస్తుంది. ఇలా అయితే ఆర్థిక భారం పడుతుంది. రూ.50,545 చెల్లించడానికి బదులుగా రూ. 81,188 అదనంగా చెల్లించాల్సిన అవసరం ఏర్పడుతున్నది. సర్వేలో ఏర్పడిన తప్పులను సరిదిద్దుకొనేందుకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలి.

హుస్సేన్, హనుమకొండ

సుమారు 4 రెట్లు ఎక్కువ చార్జీలు

అనధికార లేఅవుట్ ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం 25శాతం తగ్గించింది. గతంలో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వాళ్లు అనధికార ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ఊరట కలగడంతో చాలామంది ఎల్ఆర్ఎస్ చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు. గతంలో గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో ఉన్న అనధికార ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకోవడానికి బల్దియా సిబ్బంది సర్వే చేయడంలో నిర్లక్ష్య ధోరణిలో ఉండి సర్వే తప్పులు తడకగా చేశారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నప్పుడు మార్కెట్ విలువను వేయాలని ఆప్షన్‌లో ఉన్నప్పటికీ ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువను వేయడంతో ఎల్ఆర్ఎస్ చేసుకోవాలంటే సుమారు నాలుగు రెట్లు ఎక్కువగా చార్జీలు చెల్లించాల్సిన అవసరం ఏర్పడుతుందని, అంత స్తోమత లేని వారు ఎల్ఆర్ఎస్ చేసుకోవడానికి ఆసక్తి చూపట్లేదని పలువురు పేర్కొంటున్నారు.

గ్రేటర్ వరంగల్ పరిధి సొసైటీ కాలనీకి చెందిన గాదె రవీందర్ 2020లో 200 గజాల స్థలంను క్రమబద్ధీకరణ చేసుకోవడానికి ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. రూ.24,196 చెల్లించడానికి బదులుగా సర్వేలో నమోదు చేసిన తప్పుల వల్ల రూ.1,63,500 చెల్లించాల్సి వచ్చింది. అలాగే రంగు ఉమాదేవి స్తంభంపెల్లి శివారులో 216 గజాలను క్రమబద్ధీకరణ చేసుకోవడానికి రూ.32,644 చెల్లించాలి. కానీ, తప్పుడు సర్వే చేయడం వల్ల రూ.1,87,435 చెల్లించాల్సి వచ్చింది. చిట్యాల ఎలియాస్ 200 గజాలను క్రమబద్ధీకరణ చేసుకోవడానికి 2020లో దరఖాస్తు చేసుకోగా అప్పుడున్న మార్కెట్ విలువ ప్రకారం రూ.10,344 చార్జీలు చెల్లించాలి. కానీ, ప్రస్తుత మార్కెట్ ప్రకారం రూ.41,378 చెల్లించాలని ఉంది. ఇలా ఎల్ఆర్ఎస్ సర్వే తప్పుల తడకగా ఉండటంతో గ్రేటర్ వరంగల్ పరిధిలో అనేకమంది అనధికార లేఅవుట్ ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు.

స్త్రీలను గౌరవించడం బడి నుంచే మొదలవ్వాలి

మహిళా, శిశుసంక్షేమ మంత్రి సీతక్క

- ఆటంకాలను ఛాలెంజ్‌గా తీసుకుని ముందుకెళ్లాలి :రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణి కుముదిని
- ఓయూలో జాతీయ సదస్సు



నవతెలంగాణ-ఓయూ

స్త్రీలను గౌరవించడం అనేది "అమ్మ ఒడి, చదువుకునే బడి" నుంచే ప్రారంభం కావాలని పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ మంత్రి డా.దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్ ఓయూ ఆర్ట్స్ కళాశాల వేదికగా నిర్వహించిన "ప్రమోటింగ్ విమెన్ రైట్స్, జెండర్ ఈక్వాలిటీ, ఫాస్టరింగ్ ఎంపవర్‌మెంట్" అంశంపై ఒక రోజు జాతీయ సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. సి.కాశీం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం విద్యారంగంలోనే కాకుండా సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. నిరంతరం సమాజం కోసం పాటుపడాలనే లక్ష్యమే ఉన్నతులుగా తీర్చిదిద్దుతుందని, తాను అదే నమ్ముతానని చెప్పారు.

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణి కుముదిని మాట్లాడుతూ.. మగవారితో పోలిస్తే మహిళలకు విజయాన్ని సాధించడంలో అనేక ఆటంకాలు వస్తాయని తెలిపారు. అయితే, వాటిని ఛాలెంజ్‌గా తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. తాను ఒక మహిళగా అన్ని బాధ్యతలూ నెరవేరుస్తూనే, అనేక విజయాలు అందుకున్నానని తెలిపారు. మహిళలకు కుటుంబాల అండ లభిస్తే ఎంతటి లక్ష్యాన్నైనా సాధిస్తారన్నారు. ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్ మాట్లాడుతూ విద్యార్థులందరూ వినడం, రాయడం, మాట్లాడటం అనే నైపుణ్యాలను అలవర్చుకొని, విద్య, ఉపాధి రంగాల్లో కృషి చేయాలని సూచించారు. ఓయూ విద్యార్థుల కోసం సాధ్యమైనన్ని సదుపాయాలు కల్పించడం కోసం నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. అనంతరం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొ.శ్రీరాం వెంకటేశ్, ఓయూ ఆర్ట్స్ డీన్ ప్రొ. సయిదా తలత్ సుల్తానా, సామాజిక శాస్త్రాల డీన్ ప్రొ. సి.అరుణ జ్యోతి, ఐసిఎస్ఎస్ఆర్ ఓయూ డైరెక్టర్ ప్రొ.సుధాకర్‌రెడ్డి, సైబర్ ఫోరమ్ జాయింట్ సెక్రటరీ టి.తంగెళ్ల ప్రవీణ్ కుమార్, ప్రముఖ జానపద గాయని దాస లక్ష్మీ, యూజీసీ డీన్ ప్రొ. బి.లావణ్య, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ ప్రొ. వి.శ్రీలత, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



పసుపు రైతుల అభివృద్ధే లక్ష్యం

- రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాస్తే పసుపునకు మద్దతు ధర : పసుపు బోర్డు చైర్మెన్ పల్లె గంగారెడ్డి

నవతెలంగాణ-ఆలూర్(ఆర్మూర్)

పసుపు రైతుల అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పసుపు బోర్డు చైర్మెన్ పల్లె గంగారెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా ఆలూర్ మండల కేంద్రంలో బుధవారం పసుపు రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పసుపు సాగు విస్తరణ, మార్కెట్ సదుపాయాలు, ధర స్థిరీకరణపై ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మార్కెట్‌లో రైతులకు మద్దతు ధర లేని పంటలపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాస్తే మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం కింద కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం నిపుణులు పసుపు ఉత్పత్తి మెరుగు పరిచేందుకు ఆధునిక పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. నాణ్యతా ప్రమాణాలు, అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలపై వివరించారు. రైతులు తమ అనుభవాలు పంచుకుని, పసుపు ధర స్థిరత్వం, ప్రభుత్వ మద్దతు ధర, ఎగుమతి సౌకర్యాలపై తమ సమస్యలు తెలియజేశారు. జాతీయ పసుపు బోర్డు రైతులకండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్పైసెస్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ సుందరీషణ్, ఫీల్డ్ ఆఫీసర్ రాజ్ మాణిక్యం, మాజీ సర్పంచ్ కళ్లెం మోహన్ రెడ్డి, రైతు సంఘాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల అరెస్టులను ఖండిస్తున్నాం

- తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



పెండింగ్ బిల్లులను చెల్లించాలని అడుగుతుంటే..అసెంబ్లీ సమావేశాలున్నాయనే పేరుతో అర్ధరాత్రి పూట మాజీ సర్పంచులను అరెస్టు చేయడమేంటి? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్ ప్రశ్నించారు. అరెస్టులను తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం.. ప్రజా పాలన అంటూనే ఈ నిర్బంధాలు, అణచివేతలు ఏంటని నిలదీశారు. ప్రశ్నించే గొంతులను నొక్కేయడాన్ని తప్పుబట్టారు. అధికారంలోకి వచ్చి 14 నెలలవుతున్నా మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. స్థానిక ప్రజాప్రతి నిధులమైన తమను గౌరవించకపోగా..అవమానించేవిధంగా అరెస్టు చేయడం సరిగాదని వాపోయారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలనీ, స్థానిక సంస్థ ఎన్నికలు నిర్వహించి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, గుంటి మధుసూదన్ రెడ్డి, బీరప్ప, రవి, పద్మారెడ్డి, కేశ బోయిన మల్లయ్య, నెమలి సుభాష్ గౌడ్, మెడబోయిన గణేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమానత్వమే ఐద్వా లక్ష్యం

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజస్వామ్యం, సమానత్వం, స్త్రీవిముక్తి సాధన కోసం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) పని చేస్తున్నదని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. బుధవారం ఐద్వా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని వీరనారి ఐలమ్మ భవన్ ముందు సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సంఘం1981లో ఏర్పడిన నాటి నుంచి దేశవ్యాప్తంగా సాధారణ మహిళలను సమీకరించి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. స్త్రీ, పురుషుల మధ్య అసమానతలు అన్ని రకాల అణిచివేతలను తొలగించడం కోసం ఉద్యమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. విద్య, వైద్యం, ఉపాధిలో ఇంకా స్త్రీలు వెనుకబడి ఉన్నారని తెలిపారు. వారి అభివృద్ధికి ప్రణాళిక బద్ధమైన విధానాలు రూపొందించాలని డిమాండ్ చేశారు.

బీజేపీ ప్రభుత్వం భేటీ బచావో, బేటి పడావో అని గొప్పలు చెపుతుందనీ, కానీ మహిళలపై అనేక రూపల్లో హింస, వివక్ష జరుగుతున్నా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టరీత్యా హక్కులున్నా అవేవీ స్త్రీలకు అందుబాటులో లేవని తెలిపారు. అత్యాచారాలు, వరకట్న మరణాలు, కుటుంబంలో హింస, బలవంతపు పెండ్లిండ్లు, బాల్యవివాహాలు వంటి అనేక సమస్యలు స్త్రీలను వేధిస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో మహిళలు తమ హక్కుల అమలు కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎమ్ వినోధ, వై. వరలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎమ్. స్వర్ణలత, ఎమ్ఎ. షాజాన బేగం, ఆర్. లక్ష్మి గాయింత్రి, డి, మాదవి, జె. మంజుల, సిమ్రాని తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ వేతనాలివ్వాలి

హైదరాబాద్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) అధ్యక్షులు ఎం.వెంకటేష్ డిమాండ్

సంచాలన్ భవన్ వద్ద ధర్నా

- వారంలో వేతనాలు చెల్లిస్తాం : డీఈఎన్‌హెచ్ఎం శ్రీహర్ష



నవతెలంగాణ-ఓయూ

సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ డివిజన్‌లో రక్షక్ సెక్యూరిటాస్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థ కింద పనిచేస్తున్న సుమారు 50 మంది కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ వేతనాలు, బోనస్ ఇవ్వాలని హైదరాబాద్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) అధ్యక్షులు ఎం.వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం సికింద్రాబాద్‌లోని సంచాలన్ భవన్ డీఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు కాంట్రాక్టర్ వేతనాలు, బోనస్ ఇవ్వకపోతే యాజమాన్యమే ఇవ్వాలని 2024 అక్టోబర్ 7న రీజనల్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) డైరెక్షన్ ఇచ్చారని గుర్తు చేశారు.

కానీ రైల్వే యాజమాన్యం, కాంట్రాక్టర్ పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారని తెలిపారు. ఇప్పటివరకు 4 నెలల వేతనాలు, 2 సంవత్సరాల బోనస్ కార్మికులకు ఇవ్వలేదని చెప్పారు. అడిగిన ప్రతిసారీ వాయిదాలు వేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబర్ 4 నెలల వేతనాలు ఇప్పటివరకు ఇవ్వకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. కాంట్రాక్టు కార్మికులంటే కాంట్రాక్టర్లకు, రైల్వే యాజమాన్యానికి పట్టింపు ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టం ప్రకారం ప్రతినెలా 7వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, కానీ రైల్వేలో ఏ కాంట్రాక్టర్ కూడా దాన్ని అమలు చేయడం లేదని, రైల్వే అధికారులు కూడా పట్టించుకోవడం లేదని అన్నారు. ఎవరైనా కార్మికులు వేతనాలు అడిగితే వారిని తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కాంట్రాక్టర్ 7వ తేదీ లోపు వేతనాలు ఇవ్వకపోతే ఆలస్యంగా ఇచ్చిన రోజుకు రూ.5000/- ఆ కాంట్రాక్టర్‌పై పెనాల్టీ వేసి రైల్వే యాజమాన్యం డబ్బులు సంపాదించుకున్నది కానీ కార్మికులకు మాత్రం సకాలంలో వేతనం రావడం లేదన్నారు. కాంట్రాక్టు కార్మికులకు ప్రతినెలా 7లోపు వేతనాలు ఇవ్వని, పేస్లిప్పులు, ఈఎస్ఐ, పీఎఫ్ తదితర హక్కులు అమలు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. రక్షక్ సెక్యూరిటాస్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థను కూడా బ్లాక్ లిస్టులో పెట్టాలని కోరారు.

సీఐటీయూ నగర అధ్యక్షులు జె.కుమారస్వామి మాట్లాడుతూ.. ఖర్చు తగ్గించుకోవాలనే పేరుతో రైల్వే యాజమాన్యం కార్మికుల సంఖ్యను తగ్గించి శ్రమదోపిడీ చేస్తోందన్నారు. గతంలో 150 మంది పని చేసిన చోట 30 మందితో పనిచేయిస్తున్నారని తెలిపారు. తీవ్ర పని ఒత్తిడితో కార్మికుల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల అభివృద్ధికి ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే కాలంలో రైల్వే కాంట్రాక్ట్ కార్మికులను అందరినీ ఏకం చేసి పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సీనియర్ డీఈఎన్‌హెచ్ఎం శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీహర్ష స్పందిస్తూ.. కాంట్రాక్టు కార్మికుల నాలుగు నెలల వేతనాలకు సంబంధించి అకౌంట్స్ విభాగంలో అప్రూవ్ అయిందని, వారం రోజుల్లోపు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కన్వీనర్ ఎం.అజయ్ బాబు, కార్మికులు ఎ.శాంతులు గౌడ్, ఏ.కవిత, సాజిదా బేగం, హైమ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ సమస్య ఉంటే....



మన జీవనశైలిని మార్చుకోవడం ద్వారా కిడ్నీ సమస్యలను నియంత్రించవచ్చు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు కొన్ని ఆహారాలకు దూరంగా ఉండాలి. అవేంటో చూద్దాం.

పొటాషియం ఒక ముఖ్యమైన ఖనిజం, ఇది నరాల, కండరాల కణాలు సరిగా పనిచేయడానికి సహాయపడుతుంది. అయితే పొటాషియం అధికంగా తీసుకోవటం మూత్రపిండాల వ్యాధి ఉన్నవారికి హానికరం. వీరికి అరటిపండ్లు, నారింజ , బంగాళదుంపలు వంటి వాటి వినియోగాన్ని తగ్గించాలి.

ఉప్పు ద్వారా మనకు ఎక్కువ సోడియం అందుతుంది. కిడ్నీ రోగులు రోజుకు 4 గ్రాముల కంటే ఎక్కువ ఉప్పు తీసుకోకూడదు. ఎందుకంటే ఇది కిడ్నీలను దెబ్బతీస్తుంది. చిప్స్, ఫాస్ట్ ఫుడ్స్, అన్ని రకాల ఉప్పు పదార్థాలకు దూరంగా ఉండాలి.

మాంసం , ప్రాసెస్ చేసిన మాంసాలలో అధిక మొత్తంలో ప్రోటీన్ ఉంటుంది. కానీ ఎక్కువ మోతాదులో తీసుకుంటే అది కిడ్నీలపై ప్రభావం చూపుతుంది.

అలాగే కిడ్నీ రోగులు టీ, కాఫీలకు దూరంగా ఉండటమే మంచిది.



హోలీ అంటేనే ఆనందాల కేళీ. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఎంతో సరదాగా జరుపుకునే పండుగలలో హోలీ ఒకటి. రంగులు చల్లుకుంటూ సంబరాలు జరుపుకుంటారు. దేశవ్యాప్తంగా ఈ రోజున కుల, మతాలకు అతీతంగా అందరూ ఒక్కటై ఆనందంగా గడుపుతారు. ఒకరికొకరు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటారు. అయితే... ఈ సందర్భంగా ఇష్టమైన వారికి హోలీ శుభాకాంక్షలు తెలిపే ముందు నోరు తీపి చేస్తుంటాం. ప్రతిసారీ స్వీట్లను బయట నుంచి కొని తీసుకురాకుండా ఈసారి కొన్ని రకాల స్వీట్లను ఇంట్లోనే తయారు చేయండి.

గుజియా స్వీట్

కావల్సిన పదార్థాలు: మైదా - మూడు కప్పులు, నెయ్యి - ఒకటిన్నర కప్పు, నీళ్ల - పావు కప్పు, పంచదార - కప్పు, కోవా - 200 గ్రాములు, బాదంపప్పు - 10 (సన్నగా తరగాలి), బొంబాయిరవ్వ - అర కప్పు, యాలకుల పొడి - అర టీ స్పూను.




తయారీ విధానం: ముందుగా మైదా పిండిని ఒక గిన్నెలో వేసుకుని సరిపడినన్ని నీళ్ల, కాస్త నెయ్యి వేసి మెత్తని చపాతీ పిండి ముద్దలా కలుపుకోవాలి. తర్వాత దీనిపై ఒక తడి గుడ్డ కప్పి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు మరొక గిన్నెలో కొద్దిగా నెయ్యి వేసి రవ్వను బంగారు రంగు వచ్చేవరకు వేయించి పక్కన పెట్టుకోవాలి. తర్వాత స్టౌపై పాన్ పెట్టి కోవాను వేయించండి. ఇందులోకి సన్నగా తరిగిన బాదంపప్పు, యాలకుల పొడి, వేయించిన రవ్వ, చక్కెర అన్నీ వేసుకుని బాగా కలపాలి. ఇప్పుడు మైదా పిండిని ముద్దులుగా చేసి చిన్న చపాతీల లాగా చేసుకోవాలి. ఇప్పుడు గుజియా (కజ్జికాయ) అచ్చుపై వత్తుకున్న చపాతీని వుంచి అందులోకి మనం తయారు చేసుకున్న కోవా, రవ్వ మిశ్రమాన్ని వేయాలి. తర్వాత గుజియా అచ్చు పక్కన ఉన్న మిగతా పిండిని తొలగించాలి. ఇలా పిండిని తొలగిస్తే కజ్జికాయలు మంచి ఆకారంలో వస్తాయి. ఇలా చపాతీలాగా పిండిని వత్తుకుని, మిశ్రమాన్ని కలిపి అన్ని కజ్జికాయలనూ తయారు చేసుకోవాలి. ఇప్పుడు ఒక పాన్‌లో నూనె వేసి బాగా వేడి చేయాలి. నూనె వేడిగా ఉన్నప్పుడు అందులో రెడీ చేసి పెట్టుకున్న గుజియాలను వేసి.. బంగారు రంగు వచ్చేంత వరకు దొరగా వేయించుకోవాలి. అంతే.. గుజియా స్వీట్లు రెడీ అయిపోతాయి. వీటిని వేడివేడిగా తిన్నా లేదా చల్లారిన తర్వాత తిన్నా చాలా టేస్టీగా ఉంటాయి.

రసగుల్ల

కావల్సిన పదార్థాలు: పాలు - లీటరు (వెన్న తీయనివి), నిమ్మరసం - మూడు టేబుల్ స్పూన్లు, చక్కెర - రెండు కప్పులు, నీరు - లీటరు, పాలు - టేబుల్ స్పూను, ఉప్మారవ్వ - టీ స్పూను, పిస్తాపలుకులు - ఇరవై.

తయారీ విధానం: పాలను మందపాటి గిన్నెలో పోసి స్టవ్ మీద పెట్టాలి. అవి బాగా మరిగిన తర్వాత మంట తగ్గించి నిమ్మరసం వేసి కలపాలి. ముందు సగం నిమ్మరసం వేసి కలిపి చూసి, పాలు బాగా విరిగితే మిగిలిన రసాన్ని ఆపేయాలి. పాలు సరిగ్గా విరగకపోతే మొత్తం



రసాన్ని వేసి కలపాలి (పాశ్చరైజేషన్ జరగని పాలకు ఒక స్పూన్ నిమ్మరసం సరిపోతుంది). విరిగిన పాలను పలుచని వస్త్రంలో పోసి మూట కట్టి ఏదైనా కొక్కేనికి లేలాడదీయాలి. ఓ అరగంట తర్వాత నీరు పోయేలా చేత్తో గట్టిగా నొక్కాలి. ఆ తర్వాత పైన బరువు పెట్టాలి. ఇలా చేయడం వల్ల నీరంతా కారిపోతుంది. పాలు విరుగు మాత్రం మూటలో మిగులుతుంది. పాల విరుగులో రవ్వ వేసి వేళ్లతో నలుపుతూ కలపాలి. ఇలా చేస్తూ ఉంటే పాల విరుగు ముందు పొడిగా మారుతుంది. మరికొంత సేపటికి ముద్దగా అవుతుంది. ఇప్పుడు ఆ ముద్దను చిన్న చిన్న గోళీలుగా చేయాలి. వేడల్పుగా, లోతుగా ఉన్న కడాయిలో చక్కెర, నీరు పోసి వేడి చేయాలి. చక్కెర కరిగిన తర్వాత అందులో టేబుల్ స్పూను పాలు పోయాలి. రెండు నిమిషాలకు చక్కెర ద్రవం శుభ్ర పడి అందులోని మలినాలు నల్లగా పైకి తేలుతాయి. స్పూనుతో కానీ చిల్లుల గరిటెతో తీసేయాలి. లేదంటే పలుచని వస్త్రంలో వడపోయడం మంచిది. వడపోసిన ద్రవాన్ని మళ్లీ కడాయిలో పోసి మరిగించాలి. ఇప్పుడు చక్కెర ద్రవంలో పాల విరుగుతో చేసిన గోళీలను వేసి నాలుగైదు నిమిషాల సేపు మీడియం మంట మీద ఉడికించాలి.(పెద్ద మట మీద ఉడికిస్తే రసగుల్లాలు విరిగిపోతాయి). చిన్న గోళీలుగా వేసిన రసగుల్లాలు చక్కెర పాకాన్ని పీల్చుకుని పెద్దవవుతాయి. అప్పుడు స్టవ్ ఆపేయాలి. వేడి తగ్గిన తర్వాత కప్పులో రసగుల్లాతో పాటు ఒక టేబుల్ స్పూన్ సిరప్, పిస్తా వేసి సర్వ్ చేయాలి.

(గమనిక: రసగుల్లాలకు చేసే చక్కెర ద్రవం పలుచగా ఉండాలి. పాకం రాకూడదు)

ఫిర్ని

కావల్సిన పదార్థాలు: బియ్యం - పావు కప్పు, వెన్న తీయని పాలు - లీటరు, చక్కెర - అర కప్పు, బాదం పప్పు - పది, పిస్తా - పది, యాలకుల పొడి - అర టీ స్పూను, కుంకుమ పువ్వు - పదిహేను రేకలు, పన్నీరు - రెండు టీ స్పూన్లు(ఇష్టమైతేనే), కిస్‌మిస్ - ఇరవై, జీడిపప్పు - పది.

తయారీ విధానం: బియ్యం కడిగి మందపాటి బట్ట మీద వేసి నీడలో ఆరబెట్టి, తేమ పోయిన తర్వాత మిక్సీలో గ్రైండ్ చేయాలి.(మరీ మెత్తగా అక్కరలేదు). ఈ లోపు ఒక చిన్న పాత్రలో నీటిని వేడి చేసి అందులో బాదం, పిస్తా వేసి మూత పెట్టాలి. అరగంట తర్వాత నీటిని వడపోసి పొట్టు వలిచి, సన్నగా తరగాలి. వెడల్పుగా, మందంగా ఉన్న పాత్రలో పాలు మరిగించాలి. ఒక పొంగు వచ్చిన తర్వాత ఒక గరిటెడు పాలను చిన్న పాత్రలోకి తీసుకుని కుంకుమ పువ్వు రేకలు వేసి నానబెట్టాలి. పాత్రలో పాలను మరో రెండు నిమిషాల సేపు మరిగించిన తర్వాత మంట తగ్గించి బియ్యప్పిండి, చక్కెర వేసి అడుగు పట్టకుండా, ఉండకట్టకుండా గరిటెతో కలుపుతూ ఉడికించాలి. చిక్కబడుతున్నప్పుడు యాలకుల పొడి వేయాలి. మిశ్రమం చిక్కబడిన తర్వాత కుంకుమ పువ్వు కలిపిన పాలు, బాదం, పిస్తా సగం వేసి కలపాలి. ఇవన్నీ వేసిన తర్వాత మరో రెండు లేదా మూడు నిమిషాలు మరగనిచ్చి పన్నీరు వేసి కలిపి స్టవ్ ఆపేయాలి. అంతే ఫిర్నీ రెడీ.



రస్‌మలై

కావల్సిన పదార్థాలు: రసగుల్లాలు - పదిహేను(ఇంట్లో చేసినవైతే బాగుంటాయి), పాలు - లీటరు, చక్కెర - ఐదు టేబుల్ స్పూన్లు, బాదం - పది, పిస్తా - పది, యాలకుల పొడి - టీ స్పూను, కుంకుమ పువ్వు - ఇరవై రేకలు.

తయారీ విధానం: అరకప్పు వేడి నీటిలో బాదం, పిస్తాలను అరగంట సేపు నానబెట్టి పొట్టు తీసి తరగాలి. పావు కప్పు వేడి పాలలో కుంకుమ పువ్వు వేసి పక్కన ఉంచాలి. మందపాటి బాణలిలో పాలు మరిగించాలి. పైకి తేలిన మీగడను స్పూన్‌తో తీసి ఒక గిన్నెలో వేసుకుంటూ పాలు




అడుగంటకుండా కలుపుతూ, పాలు సగమయ్యే వరకు మరిగించాలి. ఇప్పుడు చక్కెర వేసి కరిగే వరకు కలుపుతూ మరిగించాలి. యాలకుల పొడి, బాదం, పిస్తా(సగం), కుంకుమ పువ్వు పాలు కలిపి వీటి రుంచి పాలకు పట్టే వరకు సన్నమంట మీద మరిగించాలి. ఇప్పుడు రసగుల్లాలను ఒక ప్లేట్‌లోకి తీసుకుని గరిటె లేద అట్లకాడ సాయంతో లేదా వేళ్లతో చక్కెర పాకం జారిపోయేటట్లు మెల్లగా నొక్కాలి. ఇలా రసగుల్లాలన్నింటినీ నొక్కి జాగ్రత్తగా పాలలో వేయాలి. రెండు నిమిషాలపాటు పాలలో ఉడకనిచ్చి స్టవ్ ఆపేయాలి. రసమలై చల్లారిన తర్వాత కప్పులో వేసి మీగడ(ఇష్టమైతే), బాదం, పిస్తాలతో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి. ■

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

కొందరికి డైలీ లైఫ్‌లో జిమ్ ఒక భాగంగా మారింది. అయితే జిమ్‌కు వెళ్లే వాళ్ల సమ్మర్‌లో కొన్ని జాగ్రత్తలు తప్పకుండా పాటించాలి. కొందరు యువతీ యువకులు బనానా తిని జిమ్ కు వెళ్తారు. ఇది ఎంతో ప్రమాదకరం. ఇలా అస్సలు చేయకూడదు. పరగడుపున నీళ్ల మాత్రమే తాగి జిమ్ కు వెళ్లాలి. జిమ్ లో కోచ్ గైడెన్స్‌లో మాత్రమే వర్కౌట్ చేయాలి.

కొందరు అతిగా వర్కవుట్ లు చేస్తుంటారు. ఇలా చేయడం వల్ల కూడా అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. శరీరానికి అవసరమైన పోషకాలు, విటమిన్లు ఉండే ఫుడ్‌ను తీసుకోవాలి. జిమ్ తర్వాత గుడ్లు, బనానాలు తినవచ్చు. కానీ కొందరు ఓవర్



నైట్ లో మంచి స్ట్రక్చర్ రావాలనుకుంటారు. దీనికోసం మాత్రలను వాడుతారు. ఇలాంటివి వాడటం వల్ల లేని ప్రమాదం కొని తెచ్చుకోవటమే. జిమ్ లలో కోచ్ చెప్పిన విధంగానే ఫుడ్ హ్యాబిట్లు అలవాటు చేసుకోవాలి. స్టెప్‌బైస్టెప్ బరువులను పెంచుకుంటూ వర్కౌట్‌లు చేయాలి. కానీ కొందరు మాత్రం.. ప్రారంభించిన రోజునే భారీగా బరువులు ఎత్తుతుంటారు. దీనివల్ల కండరాలు పట్టేస్తాయి.

జిమ్ చేసేటప్పుడు లేదా జాగింగ్ చేసేటప్పుడు మధ్యలో గ్యాప్ ఇవ్వాలి. గొంతు తడారి పోకుండా కొన్ని నీళ్లను తాగుతుండాలి. ఎక్కువగా బరువులు ఎత్తకుండా చూసుకోవాలి. కొందరికి బీపీ, డయాబెటిక్ సమస్యలు ఎక్కువగా ఉంటాయి. అలాంటి వారు ఎక్కువగా వైద్యుల సూచనల మేరకు మాత్రమే జిమ్‌లో వర్కౌట్ లు చేయాలి.

ముఖ్యంగా జిమ్ లు, జాగింగ్ లు చేసే వారు.. పెసరలు, శనగలు, గుడ్లు, అరటి పండ్లు, పాలు, నాన్ వెజ్ లు ఎక్కువగా తీసుకోవాలి. రాత్రిపూట బాగా తినాలి. అదే విధంగా గంటలు గంటలు జిమ్ చేయకూడదు. ■

ప్రాణాలైనా ఇస్తాం..భూములు ఇవ్వం

(మొదటిపేజీ తరువాయి)

తహసీల్దార్ భూపాల్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి మామిడ్గి రైతు వేదికలో బుధవారం గ్రామసభ చేపట్టి రైతుల అభిప్రాయాలను సేకరించారు. అయితే నిమ్జ్ భూముల బలవంతపు సేకరణ ఆపాలంటూ వందల సంఖ్యలో రైతులు తరలివచ్చారు. దాంతో గ్రామసభ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా మామిడ్గి భూ నిర్వాసితులు రాజిరెడ్డి, సంతోష్, జగన్నాథ్‌రెడ్డి, నాగప్ప పలువురు రైతులు గ్రామసభలో తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. మంచి సారవంతమైన పట్టా, అసైన్‌మెంట్ భూములు దాదాపు 1000 ఎకరాలు నిమ్జ్ పరిధిలో ఉన్నాయని, వాటిల్లో ఏడాదికి మూడు రకాల ప్రధాన పంటలు పండుతాయని తెలిపారు. అలాంటి భూములను తీసుకోవద్దంటూ విజ్ఞప్తి చేశారు. నిమ్జ్ రిజిస్ట్రేషన్ యథావిధిగా చేయాలని, బ్యాంకులు క్రాప్‌లోన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా గ్రామ సభ వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి పర్యవేక్షణలో ఇద్దరు సీఐలు జక్కుల హనుమంతు, శివలింగం, ఎస్ఐలు రాజశేఖర్ హద్నూర్, ఝరా సంఘం, ప్రత్యేక పోలీస్ బలగాలు 50 మందితో గట్టి భద్రతో చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, సతీష్, ఆర్ఐ సిద్దారెడ్డి, లాల్‌సింగ్, మామిడ్గి భూ బాధితులు సంజీవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నాగప్ప, జగప్ప, వీరన్న, వందల సంఖ్యలో రైతులు ఉన్నారు.

అమెరికా నోట మళ్లీ సుంకాల మాట

(మొదటిపేజీ తరువాయి)

పెడుతోంది. ఇక్కడి అమెరికా ప్రజలు, కార్మికులపై కెనడా వారు విధిస్తున్న సుంకాలను చూస్తుంటే అవి ఎంత విపరీతంగా ఉన్నాయో తెలుస్తుంది. కేవలం కెనడా విధించే సుంకాలే కాదు...అనేక దేశాలు విధిస్తున్న సుంకాల జాబితా కూడా నా వద్ద ఉంది. అమెరికా వెన్న, జున్నుపై కెనడా సుమారు 300 శాతం సుంకాన్ని విధిస్తోంది' అని ఆమె మండిపడ్డారు. కాగా కెనడాపై డబుల్ సుంకాలు వేసే విషయంలో అగ్రరాజ్యం అధినేత యూటర్న్ తీసుకున్నట్టు సమాచారం.

'ఇక భారత్ విషయానికి వస్తే అమెరికా ఆల్కహాల్‌పై 150 శాతం సుంకాన్ని వసూలు చేస్తోంది. మన కెంటుకీ బర్బన్ విస్కీని భారత్‌కు ఎగుమతి చేయడానికి ఇది దోహదపడుతుందని మీరు భావిస్తున్నారా? నేను అలా అనుకోవడం లేదు. వ్యవసాయ ఉత్పత్తులపై కూడా భారత్ 100 శాతం సుంకం వేస్తోంది. బియ్యం రవాణాపై జపాన్ ఏకంగా 700 శాతం సుంకాన్ని వసూలు చేస్తోంది' అని కరోలినా లీవెట్ తెలిపారు. లీవెట్ వద్ద ఉన్న ఛార్టులో కెనడా, భారత్, జపాన్ విధిస్తున్న సుంకాల సమాచారం ఉంది. ప్రతీకార సుంకాలు విధించాలని ట్రంప్ భావిస్తున్నారని ఆమె చెప్పారు. అమెరికా వ్యాపారులు, కార్మికుల ప్రయోజనాల గురించే ఆయన ఆలోచిస్తున్నారని అన్నారు.

చర్చిద్దాం రండి

నియోజకవర్గాల పునర్విభజనపై అఖిలపక్ష సమావేశం

రాజకీయ పార్టీలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సీనియర్ నేత జానారెడ్డి బహిరంగ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయం ప్రకారం నియోజకవర్గాల పునర్విభజనపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం పార్టీలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి బహిరంగ లేఖ రాశారు. జనాభా ప్రాతిపదికన జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనతో రాష్ట్రానికి ప్రమాదం పొంచి ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. జరగబోయే నష్టం గురించి అన్ని పార్టీలను ఆహ్వానించి చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశానికి అన్ని పార్టీలూ హాజరు కావాలని ఆ లేఖలో కోరారు. ప్రతి పార్టీని ప్రత్యేకంగా ఆహ్వానిస్తామని తెలిపారు. త్వరలోనే తేదీ, వేదిక ప్రకటిస్తామని వారు స్పష్టం చేశారు.

ప్రచారం జాస్తి...పని నాస్తి

(మొదటిపేజీ తరువాయి)

సంఖ్యలో పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. ఇంత జరుగుతున్నా మోడీ ప్రభుత్వం ఆర్థిక రుగ్మతలకు మూల కారణాలను కనుగొని వాటిని పరిష్కరించాల్సింది పోయి ప్రతీకాత్మక చర్యల పైనే దృష్టిని కొనసాగిస్తోంది.

హామీల అమలు ఎక్కడ?

ఎన్నికల ప్రచార సమయాల్లో మోడీ ఇచ్చిన హామీలకు లెక్కే లేదు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిలో అమలు చేయనివే ఎక్కువగా ఉన్నాయి. దీంతో భారతీయులు నిరాశానిస్పృహలకు గురయ్యారు. 2022 నాటికి 100 స్మార్ట్‌సిటీలను నిర్మిస్తామని ఇచ్చిన హామీ అమలు నత్తనడక నడుస్తోంది. స్మార్ట్‌సిటీల నిర్మాణం ఇంకా ప్రణాళికల దశనే దాటలేదు. బడ్జెట్ కేటాయింపులు కూడా అరకొరగానే ఉన్నాయి. లేబొట్లు కూడా పూర్తి కాలేదు. ఇక 2019 నాటికి బులెట్ రైలు ప్రాజెక్ట్ కార్యరూపం దాలుస్తుందని అనుకున్నప్పటికీ అది పలు దఫాలుగా ఆలస్యమవుతూ వస్తోంది. దేశ ప్రజలందరికీ 2022 నాటికి నిరంతర విద్యుత్ అందిస్తామని ఇచ్చిన హామీ కూడా నెరవేరలేదు. అనేక ప్రాంతాలలో అధిక లోడ్ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయాలు ఏర్పడుతున్నాయి. గంగానదిని ప్రక్షాళన చేసే పని మాత్రం కొంత పురోగతి సాధించింది. అయితే ఇటీవల జరిగిన కుంభమేళా సందర్భంగా గంగానది నీటి నాణ్యతపై కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు చెప్పిన పెదవి విరుపు మాటలు ప్రభుత్వ వాదనకు బలం చేకూర్చేలా లేవు. వీటన్నింటినీ గమనిస్తే మన కు అర్థమవుతున్నది ఏమంటే హామీల అమలు, సమస్యల పరిష్కారంపై శ్రద్ధ పెట్టకుండా కేవలం ప్రచార ఆర్భాటాలకు, నిత్యం వార్తల్లోని వ్యక్తిగా నిలవడానికే మోడీ ప్రాధాన్యత ఇస్తున్నారు. హామీలను నెరవేర్చే సామర్థ్యం మోడీకి ఉన్నదా అని చాలా మంది ప్రజలు ఇప్పుడు సందేహిస్తున్న పరిస్థితి కన్పిస్తోంది.

అంతరిస్తున్న ప్రజాస్వామిక విలువలు

సామాజిక, రాజకీయ అంశాలలో మోడీ పాలనను గమనిస్తే దేశంలో ప్రజాస్వామిక విలువలు అంతరించిపోతున్నాయని స్పష్టమవుతోంది. విమర్శకుల నోరు మూయించడానికి దేశద్రోహ చట్టాలను ప్రయోగించడం ఎక్కువైంది. 2010 నుండి ఈ తరహా కేసుల్లో చిక్కుకున్న 11 వేల మందిలో 65 శాతం మందిపై మోడీ ప్రభుత్వం ఏర్పడిన 2014 తర్వాతే అభియోగాలు నమోదు చేశారు. అసమ్మతికి కళ్లెం వేయడంతో ప్రభుత్వ చర్యలపై పార్లమెంటరీ పరిశీలన తగ్గిపోయింది. బిల్లులు పెద్దగా చర్చ లేకుండానే ఆమోదం పొందుతున్నాయి. అంతర్జాతీయంగా మన ఖ్యాతి మసకబారుతోంది. మైనారిటీలపై జరుగుతున్న దాడులు, మానవ హక్కుల సమస్యల విషయంలో మిత్ర దేశాల నుండి కూడా విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది. పౌరసత్వ సవరణ చట్టం, కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దు వివాదాస్పదమయ్యాయి. మైనారిటీల హక్కుల విషయంలో ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరికి ఇవి అద్దం పడుతున్నాయి.

గాంధీ హత్యపై పాఠ్యాంశం అనవసరం

(మొదటిపేజీ తరువాయి)

కావడం లేదు. నేను భాష ఆధారంగా ఏర్పడిన మొదటి స్థితి నుండి వచ్చిన వ్యక్తిని. తన తల్లి తమిళనాడుకు చెందినది. నాకు కేరళ అంటే చాలా గౌరవం ఉంది. "నేను ఏ భాషను విస్మరించలేను" అని ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. చర్చలో పాల్గొన్న సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ విద్యారంగంతో సహా మితిమీరిన కేంద్రీకరణను అంతం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల హక్కులను గౌరవించడానికి సిద్ధంగా ఉండాలని, రాజ్యాంగ స్ఫూర్తికి లోబడి వైవిధ్యాన్ని అంగీకరించాలని సూచించారు.



మణిపూర్ రాష్ట్రపతి పాలనపై ప్రతిపక్షాల విమర్శలు

మణిపూర్‌ను రాష్ట్రపతి పాలన కిందకు తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నించాయి. మణిపూర్ అల్లకల్లోలంగా ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి పాలన విధించలేదని, ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రపతి పాలనను ప్రకటించిందని విమర్శించాయి. మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించలేని ప్రభుత్వానికి ఆ రాష్ట్రాన్ని పరిపాలించే హక్కు లేదని మణిపూర్ ఎంపీ ఆల్ఫ్రెడ్ కంగామ్ స్పష్టం చేశారు. మణిపూర్‌ను కేంద్రం, రాష్ట్రం కలిసి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం నాశనం చేసిందని టీఎంసీ ఎంపీ సయోని ఘోష్ ఆరోపించారు. మణిపూర్‌ను తుపాకీతో పట్టుకుని శాంతిని పునరుద్ధరించవచ్చనే భ్రమకు వ్యతిరేకంగా అస్సాంకు చెందిన గౌరవ్ గొగోయ్ హెచ్చరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కనీసం ఒక్కసారైనా రాష్ట్రాన్ని సందర్శిస్తారని మణిపూర్ ప్రజలు ఇప్పటికీ ఆశిస్తున్నారని అన్నారు. పార్లమెంటులో ఏవైనా ముఖ్యమైన చర్చలు జరిగినప్పుడల్లా 'అదృశ్యం' కావడం అలవాటుగా మార్చుకున్నారని ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఇతర బీజేపీ సభ్యులు వ్యతిరేకించారు. ప్రధానమంత్రి పట్ల తనకు అత్యంత గౌరవం ఉందని, అయితే ట్రెజరీ బెంచ్‌లు మాజీ ప్రధానులను పదే పదే 'అవమానించడం' అలవాటు చేసుకున్నాయని, అయినప్పటికీ వారి ప్రకటనలు ఎల్లప్పుడూ పార్లమెంటరీ రికార్డులో భాగంగానే ఉన్నాయని గొగోయ్ విమర్శించారు. గొగోయ్ కొన్ని "చాలా లోతైన" వ్యాఖ్యలు చేశారని కేంద్ర మంత్రి సీతారామన్ అన్నారు. ప్రధాని మోడీని సభలో మాట్లాడటానికి కూడా అనుమతించని సందర్భాలు చాలా ఉన్నాయని అన్నారు. అంతేకాకా చాలా సార్లు ప్రధాని మోడీని దుర్భాషలాడారని అన్నారు. దీనికి గొగోయ్ స్పందిస్తూ గత సమావేశంలో ప్రధానమంత్రి ప్రసంగాన్ని చదవమని గొగోయ్ ఆర్థిక మంత్రిని కోరారు. "ఆయన ప్రసంగం మొత్తం మాజీ ప్రధానులను దుర్భాషలాడుతూ ఉంది. ఎదుటవారివైపు వేలు చూపించే ముందు, మూడు వేళ్ల మనవైపు ఉంటాయని చూసుకోవాలి. ఆత్మపరిశీలన చేసుకోండి" అని ధ్వజమెత్తారు. అమెరికాతో "సుంకాలను తగ్గించడానికి" భారతదేశం ఒప్పందం చేసుకుందని వచ్చిన నివేదికలపై ప్రధాని మోడీ ప్రతిస్పందనను వినాలని ప్రతిపక్షం కోరుకుంటున్నందున తాను ఈ అంశాన్ని లేవనెత్తానని గొగోయ్ అన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ, ప్రధానమంత్రి విదేశీ పర్యటన గురించి తనకు తెలియజేశారని అన్నారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నప్పుడు ప్రధానమంత్రులు విదేశాలకు వెళ్లే సంప్రదాయం ఉందని చెప్పారు.

భారత్-పాకిస్తాన్ భద్రతా ఏర్పాట్లను దెబ్బతీసేలా అదానీ గ్రూప్‌నకు ప్రాజెక్టా?

భారత్-పాకిస్తాన్ సరిహద్దులో భద్రతా ఏర్పాట్లను దెబ్బతీసిన అదానీ గ్రూప్ ఇంధన ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంపై లోక్‌సభలో తీవ్ర నిరసన వ్యక్తమైంది. సరిహద్దుకు కేవలం కిలోమీటరు దూరంలోనే ఇంధన ప్రాజెక్టుకు ఆమోదం లభించడం జాతీయ భద్రతకు ముప్పు కలిగిస్తుందని ప్రతిపక్షం ఎత్తి చూపింది. అంతర్జాతీయ సరిహద్దుకు 10 కిలోమీటర్ల పరిధిలో మాత్రమే పెద్ద ప్రాజెక్టులకు అనుమతి ఉంటుందని భద్రతా ప్రమాణాలు పేర్కొంటున్నాయి. అయితే, ఈ నిబంధనను ఉల్లంఘించి గుజరాత్‌లోని రాన్ ఆఫ్ కచ్‌లో అదానీ గ్రూప్ ఇంధన ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వడంలో మర్మమేంటని ప్రతిపక్షం ప్రశ్నించింది. ఈ అంశంపై కేంద్ర ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో ప్రతిపక్షం సభ నుంచి వాకౌట్ చేసింది. వ్యూహాత్మక ప్రాంతంలో అదానీ గ్రూప్ సౌరశక్తి ప్రాజెక్టుకు ఆమోదం తెలుపుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పెద్ద వివాదంగా మారింది. ప్రారంభంలో ఈ ప్రాజెక్టును సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)కి అప్పగించాలనేది ప్రణాళిక. అయితే, ఆ తరువాత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అదానీ గ్రూప్‌కు అప్పగించాలని నిర్ణయించింది. దీనికోసం, జాతీయ భద్రతా ప్రోటోకాల్‌లో కూడా పెద్ద మార్పులు చేసింది. సరిహద్దు నుంచి ఒక కిలోమీటరు దూరంలో టర్బైన్లను, రెండు కిలోమీటర్ల దూరంలో సౌర ఫలకాలను ఏర్పాటు చేయడానికి అనుమతి ఇచ్చింది. ఎప్పుడూ జాతీయ భద్రత గురించి మాట్లాడే బీజేపీ ప్రభుత్వం సరిహద్దుకు సమీపంలో ఉన్న ప్రాంతాన్ని ప్రయివేట్ కంపెనీకి అప్పగించడం వారి ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని ప్రతిపక్ష పార్టీలు విమర్శించాయి.

అదానీకి ఆ సమన్లు అందజేయండి

అహ్మదాబాద్ సెషన్స్ కోర్టుకు కేంద్ర న్యాయ శాఖ ఆదేశాలు

న్యూఢిల్లీ : న్యూయార్క్ కోర్టులో ఉన్న కేసుకు సంబంధించి అమెరికా సెక్యూరిటీలు-ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) పంపిన సమన్లను అదానీ గ్రూప్ ఛైర్మెన్ గౌతమ్ అదానీకి అందజేయాల్సిందిగా కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ అహ్మదాబాద్ సెషన్స్ కోర్టుకు ఆదేశాలు జారీ చేసింది. హేగ్ కన్వెన్షన్ కింద సహాయం అందజేయాల్సిందిగా ఎస్ఈసీ నుండి వచ్చిన అభ్యర్థన నేపథ్యంలో కేంద్ర న్యాయ శాఖ ఈ చర్య తీసుకుంది. హేగ్ కన్వెన్షన్ ప్రకారం నిందితులకు చట్టపరమైన పత్రాలను అందజేయడంలో సభ్య దేశాలు పరస్పరం సహకరించుకోవాల్సి ఉంటుంది. ఎస్ఈసీ నుండి వచ్చిన అభ్యర్థనను గత నెల 25వ తేదీన న్యాయ శాఖకు చెందిన లీగల్ అఫైర్స్ డిపార్ట్‌మెంట్ (డీఎల్ఏ) అహ్మదాబాద్ కోర్టుకు పంపిందని అధికారిక రికార్డులు చెబుతున్నాయి. సమన్లను అదానీకి చెందిన అహ్మదాబాద్ చిరునామాలో అందజేయాలని అందులో కోరింది. అదానీ గ్రీన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్‌లు అయిన గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీలు ఇంధన ప్రాజెక్టులు పొందేందుకు భారతీయ అధికారులకు భారీగా ముడుపులు అందించారంటూ ఎస్ఈసీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ముడుపుల కేసు అదానీ గ్రూపులో కలకలం రేపింది. అయితే 1977వ సంవత్సరపు ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ అమలును నిలిపివేస్తూ డోనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో ఆ కంపెనీ ఊపిరి పీల్చుకుంది. అమెరికాలో అదానీపై పెద్దగా చట్టపరమైన చర్యలు ఉండబోవని భావిస్తోంది. ఇదిలావుండగా చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ అమెరికాలో వ్యాపార అవకాశాలను అన్వేషించేందుకు అదానీ గ్రూప్ ప్రయత్నాలు ప్రారంభించింది.

సహాయక చర్యల్లో రోబో

(మొదటిపేజీ తరువాయి)

వస్తున్న నీటితో పాటు పై కప్పు నెర్రెలు బారి కూలే అవకాశాలు ఉన్నాయని అధికారులు, కార్మికులు చెబుతున్నారు. టీబీఎం చివర పైభాగాన రివిట్‌మెంటు చేయలేదు. అందుకే జల్లెడ తూట్ల మాదిరిగా కురుస్తోంది. బుధవారం పై నుంచి కురిసే వాటర్ ఫాల్ అధికమైంది. మోకాళ్ల లోతు నీళ్లలో కార్మికులు, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. సొరంగంలో గాలి, వెలుతురు లేదు. శానిటేషన్ సమస్య తీవ్రంగా మారింది. అప్పుడప్పుడు విద్యుత్ అంతరాయం కూడా సహాయక సిబ్బందిని ఇబ్బందుల్లోకి నెడుతోంది.

బుధవారం డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, టన్నెల్ ఆఫీస్‌లో సహాయక చర్యలపై ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. టన్నెల్‌లో సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు అన్వీ రోబోటిక్స్ సంస్థకు చెందిన అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబోను ప్రమాద ప్రదేశానికి తీసుకెళ్లారు. రోబో ద్వారా టన్నెల్ లోపల ఉన్న శిథిలాలను తొలగించడం, భూమిని తవ్వడం, వంటి సహాయక చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. సహాయక సిబ్బంది చేరలేని ప్రమాదకర ప్రాంతాల్లో పనిచేయడం, మనుషుల కన్నా 15 రెట్లు అత్యధిక సామర్థ్యంతో పనిచేయడం ఈ రోబో ప్రత్యేకత. టన్నెల్‌లో సహాయక చర్యలను వేగంగా పూర్తి చేయడానికి ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించేందుకు, సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి రోబోలు ఉపయోగిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

టన్నెల్ లోపల ఉన్న శిథిలాలు, మట్టి కుప్పలు, తేమ, ఆక్సిజన్ సమస్యలు వంటి అడ్డంకులను దృష్టిలో పెట్టుకొని, రోబోలను రంగంలోకి దించినట్టు చెప్పారు. అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబో ద్వారా 40హెచ్‌పీ పంపు సహాయంతో బురదను బయటికి పంపనున్నారు. ఈ రోబో గంటకు 5000 క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించే సామర్థ్యం కలిగి ఉందని తెలిపారు.

డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ, జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు రోబోను పరిశీలించిన అనంతరం, అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబోతో విజయ్, అక్షయ్ తమ బృందంతో కలిసి లోకో ట్రెన్ ద్వారా టన్నెల్ లోపలకు వెళ్లారు. ప్రస్తుతం సహాయక చర్యల్లో 12 కేంద్ర, రాష్ట్ర సంస్థలకు చెందిన బృందాలు 24 గంటలు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయి.

డబ్ల్యూఎఫ్‌ఐపై మళ్లీ బ్రిజ్ భూషణ్ పట్టు?

ఆయన అనుచరుడు సంజయ్ సింగ్ చేతిలోకి ఫెడరేషన్

- మోడీ సర్కారు సస్పెన్షన్ రద్దు నిర్ణయంతో రూట్ క్లియర్
- మళ్లీ చర్చకు దారి తీస్తున్న 'లైంగిక ఆరోపణ'ల ఎపిసోడ్
- కమిటీ నివేదిక సమాచారం తమ వద్ద లేదంటున్న కేంద్రం



న్యూఢిల్లీ : మహిళా రెజ్లర్లపై లైంగికవేధింపుల ఆరోపణలను ఎదుర్కొన్న బీజేపీ నాయకుడు, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ చీఫ్ బ్రిజ్ భూషణ్‌పై కేంద్రంలోని మోడీ సర్కారు ఆది నుంచీ ఉదాసీనంగానే వ్యవహరిస్తున్నది. రోడ్డెక్కి గొంతెత్తిన మహిళా రెజ్లర్లు చేసిన ఆరోపణలను పెద్దగా పట్టించుకోలేదు. పరోక్షంగా బ్రిజ్‌భూషణ్‌కు బాసటగా నిలిచింది. తాజాగా మోడీ సర్కారు డబ్ల్యూఎఫ్ఐపై ఉన్న సస్పెన్షన్‌ను రద్దు చేసింది. క్రీడా మంత్రిత్వ శాఖ 2023, డిసెంబర్‌లో డబ్ల్యూఎఫ్ఐపై ఈ సస్పెన్షన్‌ను విధించిన విషయం విదితమే. లోక్‌సభ ఎన్నికల్లో వ్యతిరేకత రాకూడదనే ఉద్దేశంతోనే మోడీ సర్కారు డబ్ల్యూఎఫ్ఐను రద్దు చేసిందన్న వాదనలు ఆ సమయంలో వినిపించాయి. అయితే, లోక్‌సభ ఎన్నికలు ముగియటంతో ఇప్పుడు ఈ సస్పెన్షన్‌ను రద్దు చేసిందని విశ్లేషకులు అంటున్నారు. రద్దు ద్వారా నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్‌గా డబ్ల్యూఎఫ్ఐ హోదాను పునరుద్ధరించనున్నది. దీని ఫలితంగా ఫెడరేషన్‌పై బ్రిజ్ భూషణ్ పరోక్షంగా పట్టు సాధించనున్నాడు. ఆయన అనుచరుడు సంజయ్ సింగ్.. చేతిలోకి ఫెడరేషన్ వెళ్లనున్నది. ఇలాంటి తరుణంలో బ్రిజ్‌భూషణ్‌పై మహిళా రెజ్లర్ల లైంగిక ఆరోపణలు, ఆయనపై సాగిన దర్యాప్తు తీరు ప్రస్తుతం మళ్లీ చర్చకు దారి తీస్తున్నది. 2024 ప్యారిస్ ఒలంపిక్స్‌లో చారిత్రక గోల్డ్ మెడల్‌ను గెలిచే అవకాశాన్ని రెజ్లర్ వినేశ్ ఫోగాట్ తృటిలో కోల్పోయారు. కేవలం 100 గ్రాముల బరువు అధికంగా ఉన్నదన్న కారణంగా గతేడాది ఆగస్టు 7న బౌట్‌కు ముందే అనూహ్యంగా డిస్‌క్వాలిఫై అయ్యారు. వినేశ్ ఫోగాట్ అనర్హతపై అనేక అనుమానాలు, కుట్ర కోణాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. బ్రిజ్ భూషణ్‌పై లైంగిక ఆరోపణలు, కేంద్రంలోని మోడీ సర్కారుకు వ్యతిరేకంగా తోటి రెజ్లర్లతో కలిసి నిరసనలు, ఆందోళనలు నిర్వహించటం వంటివి ఒలంపిక్స్‌లో ఆమె అనర్హతను వేరుగా చూడలేమని కొన్ని విశ్లేషణలు సైతం వచ్చాయి. ఆ సమయంలో ఎంపీగా ఉన్న బ్రిజ్ భూషణ్‌పై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశారు.

లైంగిక ఆరోపణలు, వేధింపులు, బెదిరింపులు, ఆర్థిక అవకతవకలు, పాలనా లోపాలు, డబ్ల్యూఎఫ్ఐ రోజువారీ కార్యకలాపాలపై దర్యాప్తు జరపటానికి 2023, జనవరి 23న ప్రభుత్వం మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న గ్రహీత ఎం.సి. మేరీకోమ్ నేతృత్వంలో ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. నివేదికను సమర్పించటానికి ప్రభుత్వం నాలుగు వారాల సమయాన్ని కూడా కేటాయించింది. ఆ తర్వాత దానిని రెండు నుంచి మూడు వారాల గడువు సమయాన్ని పెంచింది. చివరకు కమిటీ ఏప్రిల్ 5న తన తుది నివేదికను సమర్పించింది.

సదరు నివేదిక ప్రతిని కోరుతూ కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖకు సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కింద దరఖాస్తు అందింది. అయితే, సదరు నివేదిక లేదని క్రీడా మంత్రిత్వ శాఖ అధికారి తరుణ్ పరీక్ స్పందించటం గమనార్హం. అంతేకాదు, అదే ఏడాది జనవరి 19న అప్పటి కేంద్ర క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్ నిరసన చేస్తున్న రెజ్లర్లతో న్యూఢిల్లీలోని తన ఇంటిలో నాలుగు గంటల పాటు సమావేశమయ్యారని పలు మీడియా కథనాలూ వచ్చాయి. ఆ తర్వాత "12 గంటల పాటు రెజ్లర్లు చెప్పింది విన్నాం. కమిటీని ఏర్పాటు చేశాం. పారదర్శక దర్యాప్తును కోరుతున్నాం. 14 సమావేశాలు ఏర్పాటు చేశాం. కమిటీ ముందు వాదనలు వినిపించేందుకు ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించాం" అని ఏప్రిల్ 27న ఠాకూర్ తెలిపారు.

రెజ్లర్లు మాత్రం అనురాగ్ ఠాకూర్ చెప్పినదానితో ఏకీభవించలేదు. ఆయన కేవలం 12 నిమిషాలు మాత్రం వెచ్చించారని రెజ్లర్ బజరంగ్ పూనియా చెప్పటం గమనార్హం. అనురాగ్ ఠాకూర్ చెప్పినట్టుగా ఈ సమావేశాలకు సంబంధించి తేదీ, సమయం, ఎవరెవరు హాజరయ్యారు వంటి పూర్తి వివరాలను కోరుతూ ఆర్టీఐ దరఖాస్తు దాఖలైంది. అయితే, సమాచారం అందుబాటులో లేదని సదరు మంత్రిత్వ శాఖ నుంచి ప్రతిస్పందన రావటం గమనార్హం.

బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు కోరుతూ రెజర్లు చేస్తున్న నిరసనలలో భాగంగా చివరకు 2023, మేలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. దీంతో ఆయనపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. రౌజ్ అవెన్యూ కోర్టులో 1000 పేజీల చార్జీషీటు దాఖలైంది. బ్రిజ్ భూషణ్ సింగ్, సస్పెండైన డబ్ల్యూఎఫ్ఐ అసిస్టెంట్ సెక్రెటరీల వినోద్ తోమర్‌లపై అభియోగాల సమర్థనకు ఆధారాలు సరిపోతాయని ఢిల్లీ కోర్టు గతేడాది మే 10న కనుగొన్నది. మే 21న అభియోగాలు అధికారికంగా నమోదు కాగా.. బ్రిజ్‌భూషణ్, తోమర్‌లు ఇద్దరూ వాటిని తోసిపుచ్చారు. డబ్ల్యూఎఫ్ఐ ప్రెసిడెంట్‌గా బ్రిజ్ భూషణ్ బాధితులను నియంత్రించటానికి తన పదవిని దుర్వినియోగపర్చాడనీ, వారి కెరీర్లకు సంబంధించి బెదిరింపులకు దిగాడని అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ప్రియాంకా రాజ్‌పూత్ గుర్తించారు.

భారత మాజీ క్రికెటర్ సయ్యద్ అబిద్ అలీ కన్నుమూత

కాలిఫోర్నియాలో తుదిశ్వాస విడిచిన హైదరాబాదీ



హైదరాబాద్: భారత మాజీ క్రికెటర్ సయ్యద్ అబిద్ అలీ(83) బుధవారం కన్నుమూశారు. హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ అబిద్ అలీ అమెరికాలోని కాలిఫోర్నియాలో తుదిశ్వాస విడిచారు. 1971లో ఓవల్‌లో జరిగిన చారిత్రాత్మక టెస్ట్ మ్యాచ్ గెలిచిన భారత జట్టులో ఆబిద్ అలీ ఓ ఆటగాడు. ఆల్‌రౌండర్ అయిన ఆబిద్ అలీ భారత్ తరఫున 29టెస్టుల్లో 47 వికెట్లు పడగొట్టారు. అత్యుత్తమ ఫీల్డర్లలోనూ ఒకరిగా గుర్తింపు పొందారు. 1967-68లో బ్రిస్బేన్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టులో అబిద్ అరంగేట్రం చేసి 55 పరుగులు చేయడంతో పాటు ఆరు వికెట్లు పడగొట్టి అత్తుమ గణాంకాలను నమోదు చేశారు. 1958-59లో హైదరాబాద్ జూనియర్ జట్టు తరపున ఆడిన అబిద్, అనంతరం రంజీ ట్రోఫీ జట్టుకు ఎంపికయ్యారు. 1960లో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనకు ఎంపికయ్యారు. ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టెస్టులో కెప్టెన్ ఎంఏకే పటౌడి స్థానంలో ఆడి, రెండు ఇన్నింగ్స్‌లలో 33 పరుగులు చేశాడు. 55 పరుగులకు 6 వికెట్లు తీశారు. మూడో టెస్టులో ఓపెనర్‌గా వచ్చి 47 పరుగులు చేయగా.. అదే సిరీస్ ఆఖరి టెస్టులో 81, 78 పరుగులు చేశాడు. 1971లో జరిగిన పోర్ట్ ఆఫ్ స్పెయిన్ టెస్టులో వెస్టిండీస్‌పై సునీల్ గవాస్కర్ భారత జట్టును గెలిచిన సందర్భంలో అబిద్ నాన్ స్ట్రయికర్‌గా ఉన్నారు. సిరీస్ చివరి టెస్టులో వెస్టిండీస్ గెలుస్తుందనుకున్న సమయంలో అబిద్ వరుస రెండు బంతుల్లో రోహన్ కన్హాయ్, గ్యారీ సోబర్స్‌లను బౌల్డ్ చేశారు.. 1975 ప్రపంచ కప్‌లో న్యూజిలాండ్‌పై 70 పరుగులు చేశారు. అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్‌లో 29 మ్యాచులు ఆడిన ఆయన.. 1,018 పరుగులు చేశాడు. ఐదు వన్డేల్లో 93 పరుగులు చేశాడు. టెస్టుల్లో అత్యుత్తమ స్కోర్ 81, వన్డేల్లో 70. టెస్టుల్లో 47 వికెట్లు తీయగా.. వన్డేల్లో ఏడు వికెట్లు పడగొట్టారు. టెస్టుల్లో అత్యుత్తమ గణాంకాలు 55 పరుగులు ఇచ్చి ఆరు వికెట్లు. ఇక వన్డేల్లో 22 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీశారు. రంజీల్లో హైదరాబాద్ క్రికెట్ జట్టు తరఫున అబిద్ అలీ 2వేల పరుగులు చేసి వంద వికెట్లు తీశారు. 1968-69లో అత్యధిక వ్యక్తిగత స్కోరు కేరళపై 173 నాటౌట్, 1974లో ఓవల్‌లో సర్రేపై ఉత్తమ బౌలింగ్ 23 పరుగులకు 6 వికెట్లు తీశాడు. 1980లో కాలిఫోర్నియాకు వెళ్లే ముందు అబిద్ కొన్నేళ్లపాటు హైదరాబాద్ జూనియర్ జట్టుకు శిక్షణ ఇచ్చారు. 1990 చివరలో మాల్దీవులకు, 2001-02లో రంజీ ట్రోఫీలో సౌత్ జోన్ లీగ్ గెలిచిన ఆంధ్రా జట్టుకు, 2002-2005 మధ్యకాలంలో యుఎఇ జట్టుకు శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం కాలిఫోర్నియాలో నివాసం ఉంటూ.. స్టాన్‌ఫోర్డ్ క్రికెట్ అకాడమీలో యువకులకు శిక్షణ ఇస్తున్నారు.

ఫైనల్ బెర్త్ ఎవరిదో..?

నేడు ముంబయి-గుజరాత్ జట్ల మధ్య డబ్ల్యూపీఎల్ పోరు

రాత్రి 7.30గం॥లకు



ముంబయి: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో మరో రెండు మ్యాచ్‌లో మాత్రమే మిగిలాయి. ఐదుజట్ల మధ్య ఫిబ్రవరి 14న ప్రారంభమైన సీజన్-3 డబ్ల్యుపిఎల్ శనివారం జరిగే ఫైనల్‌తో ముగియనుంది. ఈ మ్యాచ్‌కు ముందు గురువారం ముంబయి-గుజరాత్ జట్ల మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరగనుంది. ఫైనల్ బెర్త్‌పై హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని ముంబయి జట్టు కన్నేయగా.. మరోవైపు తొలిసారి నాకౌట్‌కు చేరిన గుజరాత్ జట్టు కూడా ఫైనల్‌కు చేరాలని ఉవ్విళ్లూరుతోంది.

2023 తొలి సీజన్ విజేత అయిన ముంబయి జట్టు గత సీజన్‌లో ఫైనల్‌కు చేరడంలో విఫలమైంది. ఇక 2024 సీజన్, డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) ఈసారి గ్రూప్ దశను దాటలేకపోయింది. ఈ క్రమంలోనే గత రెండు సీజన్ల రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్ ఈసారి ఎలాగైనా కప్ కొట్టాలని పట్టుదలగా వుంది. ఢిల్లీ ఈసారి లీగ్ దశలో అదరగొట్టే ప్రదర్శనను కనబర్చి నేరుగా ఫైనల్‌కు చేరుకుంది. గురువారం ముంబయి-గుజరాత్ జట్ల మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ విజేతతో ఢిల్లీ తలపడనుంది. డబ్ల్యూపీఎల్ సీజన్-3 ఫైనల్ శనివారం ముంబయిలోని బ్రాబౌర్న్ స్టేడియంలో జరగనుంది.

సీజన్-3లో భాగంగా ఢిల్లీ జట్టు గ్రూప్ దశలో ఆడిన 8మ్యాచుల్లో ఐదు మ్యాచుల్లో గెలిచి 10పాయింట్లు (+0.396 రన్‌రేట్)తో నేరుగా ఫైనల్‌కు చేరగా.. ముంబయి జట్టు ఖాతాలో కూడా 10 పాయింట్లు ఉన్నా (+0.182) రన్‌రేట్‌లో వెనుకబడి 2వ స్థానానికే పరిమితమైంది. ఇక గుజరాత్ జెయింట్స్ జట్టు ఆడిన 8మ్యాచుల్లో 4మ్యాచుల్లో గెలిచి 4మ్యాచుల్లో పరాజయాన్ని చవిచూసింది. దీంతో 8పాయింట్లతో 3వ స్థానంలో నిలిచి తొలిసారి ఎలిమినేటర్‌కు అర్హత సాధించింది. ఇక స్మృతి మంధాన సారథ్యంలోని బెంగళూరు , దీప్తి శర్మ సారథ్యంలోని యూపీ వారియర్స్ జట్లు కేవలం మూడు మ్యాచుల్లో గెలిచి మరో ఐదేసి మ్యాచుల్లో ఓటమిపాలయ్యాయి.

జట్లు :

ముంబయి : హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), మాథ్యూస్, స్కీవర్ బ్రంట్, యాస్టికా భాటియా(వికెట్ కీపర్), అమేలియా కెర్, సజీవన్ సజన, అమన్‌జ్యోత్ కౌర్, సంస్కృతి గుప్తా, జి. కలిత, ఇస్మాయిల్, శిఖా ఇషికా.

గుజరాత్: అలైసే గార్డినర్(కెప్టెన్), వోల్వడార్ట్, బెత్ మూనీ(వికెట్ కీపర్), హేమలత, హర్లీన్ డియెల్, డోటిన్, సిమ్రన్ షేక్, తనూజ కన్వార్, సయాలీ, కశ్వీ గౌతమ్, ప్రియా మిశ్రా.

తొలిరౌండ్‌లోనే ఓడిన సింధు

ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్



లండన్: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్‌లో పివి సింధు తొలిరౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. బుధవారం చైనీస్ తైపీకి చెందిన జి.ఇ. కిమ్‌తో తలపడిన సింధు.. తొలి గేమ్‌ను 21-19తో నెగ్గినా.. ఆ తర్వాత 13-21, 13-21తో మిగిలిన రెండు సెట్లను చేజార్చుకుంది. ఇక మహిళల సింగిల్స్‌లో మరో షట్లర్ మాళ్విక బన్సోడ్ గురువారం జరిగే తొలిరౌండ్ పోటీలో టాప్‌సీడ్, జపాన్‌కు చెందిన యమగుచితో తలపడనుంది. ఇక పురుషుల డబుల్స్‌లో మిశ్రా-కుంజేగమ్ జంట 9-21, 4-21తో కొరియా జంట చేతిలో ఓటమిపాలవ్వగా.. మహిళల డబుల్స్‌లో తానీసా కాస్ట్రో-అశ్విని పొన్నప్ప 20-22, 18-21తో చైనీస్ తైపీ జంట చేతిలో పోరాడి ఓటమిపాలయ్యారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఆర్.కపూర్-గద్దే జంట 21-10, 17-21, 24-22తో చైనీస్ తైపీ జోడీని చిత్తుచేసి ప్రి క్వార్టర్స్‌కు చేరారు.

కాషాయ విధానం !

- జాతీయ విద్యా విధానంపై స్టాలిన్ విమర్శ

చెన్నై : జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ), హిందీ భాషను అభివృద్ధిపరచడానికి ఉద్దేశించిన కాషాయ విధానమని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ బుధవారం విమర్శించారు. ప్రతిపాదిత పునర్విభజన ప్రక్రియతో ఉత్తరాది రాష్ట్రాల్లో విజయం సాధించడం ద్వారా అధికారంలో కొనసాగడానికి బిజెపి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఇక్కడ ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి, తమ ప్రభావం, ప్రాబల్యం వున్న రాష్ట్రాల్లో ఎంపీల సంఖ్యను పెంచుకోవడానికి, తద్వారా తమ పార్టీని అభివృద్ధిపరుచుకోవడానికి బీజేపీ చూస్తోందని అన్నారు. డీఎంకే దాన్ని నిరోధిస్తుందని స్పష్టం చేశారు. నూతన విద్యా విధానం వల్ల తమిళనాడు విద్యా రంగంలో పురోగతి అంతా పూర్తిగా నాశనమవుతుందని స్టాలిన్ పేర్కొన్నారు.

కేంద్రం విధానాలను, వైఖరిని ఖండిస్తూ ఏర్పాటు చేసిన పార్టీ ర్యాలీలో ఆయన ప్రసంగించారు. సామాజిక న్యాయమైన రిజర్వేషన్లను ఎన్‌ఈపీ అంగీకరించదన్నారు. వృత్తి విద్య పేరుతో కుల ప్రాతిపదిక విద్యను ప్రవేశపెట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు.

నవచిత్రం

ఆ నమ్మకంతోనే సొంతంగా రిలీజ్ చేస్తున్నాం



హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'దిల్ రూబా'. ఈ సినిమాలో రుక్సర్ థిల్లాన్ హీరోయిన్‌గా నటించింది. శివమ్ సెల్యులాయిడ్స్, ప్రముఖ మ్యూజిక్ లేబుల్ సారెగమ తమ నిర్మాణ సంస్థ అయినటువంటి ఏ యాడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలు. విశ్వ కరుణ్ దర్శకుడు. ఈ సినిమా ఈనెల 14న హోలీ పండుగ సందర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను వైభవంగా నిర్వహించారు.

> సినిమా మీద ప్యాషన్‌తో ఊర్ల నుంచి వచ్చేవారిలో ఓ పదిమందికి ఏటా నేను సాయం చేస్తా. అది ఫుడ్ కానీ, షెల్టర్ కానీ, అవకాశాలు కానీయండి నా వల్ల చేతనైన సాయం వారికి చేస్తా. నా ప్రతి సినిమాలో 40 నుంచి 50 మంది కొత్త వాళ్లకు అవకాశాలు కల్పిస్తున్నా. ఇకపైనా ఆ ప్రయత్నం కొనసాగిస్తా. మొదట్లో ఈ సినిమాని ఎలా రిసీవ్ చేసుకుంటారో అని భయపడిన మాట నిజం. అయితే ఇప్పుడు మా టీమ్ అంతా చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. ఈ నెల 14న కాదు, 13 సాయంత్రమే ప్రీమియర్స్‌తో మా సక్సెస్ జర్నీ స్టార్ట్ కాబోతోంది.
>
> - హీరో కిరణ్ అబ్బవరం

ప్రొడ్యూసర్ రవి మాట్లాడుతూ, ' సినిమా మీద నమ్మకంతో మేమే సొంతంగా రిలీజ్ చేస్తున్నాం. అందుకే ఈ నెల 14న మార్నింగ్ షో అయిన వెంటనే సక్సెస్‌మీట్ కూడా పెట్టబోతున్నాం' అని తెలిపారు. 'ఈ సినిమా విషయంలో కిరణ్ మా కంటే ఎక్కువగా కథను, దర్శకుడినీ నమ్మారు. ఈ సినిమాతో కిరణ్‌కి, మా టీమ్ అందరికీ విజయం దక్కుతుందని ఆశిస్తున్నాం' అని ప్రొడ్యూసర్ రాకేష్ రెడ్డి చెప్పారు.

హీరోయిన్ క్యాతీ డేవిసన్ మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో మ్యాగీ క్యారెక్టర్‌లో నటించాను' అని అన్నారు. 'ఈ సినిమాలో అంజలి క్యారెక్టర్‌లో నటించాను. అంజలి క్యారెక్టర్ ఎనర్జిటిక్‌గా ఉంటూనే ఎంతో ఎమోషనల్ డ్రైవ్‌తో సాగుతుంది' అని హీరోయిన్ రుక్సర్ థిల్లాన్ చెప్పారు. డైరెక్టర్ విశ్వకరుణ్ మాట్లాడుతూ, 'కిరణ్ చేసిన ఫైట్స్, చెప్పే డైలాగ్స్ మిమ్మల్ని ఆకట్టు కుంటాయి. రీసెంట్‌గా సినిమా చూసి, టెన్షన్ పడకు సినిమా అదిరిపోయింది అన్నారు. అదే నమ్మకంతో చెబుతున్నా ఒక కొత్త కిరణ్ అబ్బవరంను స్క్రీన్ మీద చూస్తారు' అని చెప్పారు.

సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ ..



రుషి కిరణ్, శ్వేత, రూప, శివ యాదవ్, రజిత, ఏ కెన్ ప్రసాద్, మృణాల్ కీలక పాత్రల్లో నటించిన సినిమా 'ది సస్పెక్ట్'. టెంపుల్ టౌన్ టాకీస్ సమర్పణలో ప్రొడ్యూసర్ కిరణ్ కుమార్ నిర్మిస్తున్నారు. సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ మూవీగా దర్శకుడు రాధాకృష్ణ రూపొందించారు. ఈ సినిమా ఈ నెల 21న ఎస్ కె ఎమ్ఎల్ మోషన్ పిక్చర్స్ ద్వారా ఆంధ్ర, తెలంగాణలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

తాజాగా ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. దర్శకుడు వీఎన్ ఆదిత్య ముఖ్య అతిథిగా హాజరై, ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ప్రొడ్యూసర్ కిరణ్ నాకు ఎప్పటినుంచో స్నేహితులు. ఆయన ఈ సినిమాను ప్రొడ్యూస్ చేయడమే కాదు, మంచి క్యారెక్టర్‌లో నటించారు. పెద్ద సినిమాలు జీరో కలెక్షన్స్ చేసినవి ఉన్నాయి. చిన్న చిత్రాలు అద్భుతంగా ఆదరణ పొందినవీ ఉన్నాయి. ఈ సినిమా చిన్న చిత్రాల్లో పెద్ద విజయం సాధించాలి' అని అన్నారు.

'సినిమా రంగంలోకి రావాలనేది నా కల. ఈ సినిమాతో ఆ కల నెరవేరింది. నా స్నేహితుడు వీఎన్ ఆదిత్య ట్రైలర్ రిలీజ్ చేయడం హ్యాపీగా ఉంది. రాధాకృష్ణ చేసిన ఒక షార్ట్ ఫిలిం చూసి నచ్చి, ఈ సినిమాకు దర్శకత్వం చేయమని అడిగాను. ఈ సినిమాకు అన్నీ తానై రూపొందించాడు. యాక్టింగ్‌లో ట్రెనింగ్ తీసుకుని ఈ చిత్రంలో ఒక రోల్ చేశాను. ఈ మూవీలో అంతా కొత్తవాళ్లే. వాళ్లంతా బాగా నటించారు. ఈ సినిమా మా అందరికీ మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నా' అని అన్నారు. డైరెక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ, 'సినిమా చేసేందుకు పడే కష్టం చిన్న చిత్రానికైనా పెద్ద చిత్రానికైనా ఒక్కటే. మేము ఈ సినిమాను అందరికీ నచ్చేలా, మంచి సస్పెన్స్ డ్రామా థ్రిల్లర్‌గా రూపొందించాం. ఒక అమ్మాయి హత్యకు కారకులైన వారిని పట్టుకునే క్రమంలో సాగే చిత్రమిది. కొత్త ఆర్టిస్టులైనా ఎంతో అనుభవం ఉన్న వారిలా బాగా పర్‌ఫార్మ్ చేశారు. ఈ మూవీ చేసే అవకాశం ఇచ్చిన ప్రొడ్యూసర్ కిరణ్‌కి థ్యాంక్స్. మా సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్న ఆదినారాయణకి థ్యాంక్స్' అని తెలిపారు.



ఆద్యంతం నవ్వుతూనే ఉంటారు : హీరో నితిన్

హీరో నితిన్ నటించిన హైలీ యాంటిసిపేటెడ్ హీస్ట్ కామెడీ ఎంటర్‌టైనర్ 'రాబిన్‌హుడ్'. శ్రీలీల కథానాయికగా నటించింది. వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన ఈ సినిమాని మైత్రి మూవీ మేకర్స్ నిర్మించింది. ఈ సినిమా ఈ నెల 28న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది.

ఈ నేపథ్యంలో మేకర్స్ నిర్వహించిన మీడియా సమావేశంలో హీరో నితిన్ మాట్లాడుతూ, 'ఇప్పటికే రిలీజ్ అయిన మూడు పాటలు చాలా పెద్ద హిట్ అయ్యాయి. నిన్న వచ్చిన 'అది దా సర్‌ప్రైజ్' పాట కూడా చాలా పెద్ద హిట్ అయింది. దిల్ రాజు వల్ల ఆ వర్డ్ పాపులర్ అయింది కాబట్టి ఆయనకి థాంక్స్ చెప్తున్నాను. జీవి ప్రకాష్ చాలా అద్భుతమైన పాటలు ఇచ్చారు. డైరెక్టర్ వెంకీ, నేను నిన్న రాత్రి సినిమా చూసుకున్నాం. ఈ సినిమా మా కెరీర్‌కి హ్యూజ్ మూవీ కాబోతుందని చాలా కాన్ఫిడెంట్‌గా చెప్పగలను. నా బర్త్ డే ఈనెల 30. ఈ సినిమా వచ్చేది ఈనెల 28న. డైరెక్టర్ వెంకీ ఈ సినిమాతో నాకు బిగ్గెస్ట్ బర్త్ డే గిఫ్ట్ ఇవ్వబోతున్నారు. 'భీష్మ'కి డబుల్ ఎంటర్టైన్మెంట్ ఈ సినిమాలో ఉంటుంది. నేను, శ్రీలీల, రాజేంద్రప్రసాద్, వెన్నెల కిషోర్.. మా సీన్స్ చాలా ఎక్స్ట్రార్డినరీగా వచ్చాయి. పొట్ట చెక్కలయ్యేలా నవ్వుకుంటారు. చాలా క్లీన్ కామెడీ ఉంటుంది. ఎక్కడ అసభ్యకరమైన మాట ఉండదు. ఇంత ఆర్గానిక్ కామెడీ ఈ మధ్యకాలంలో నేనెక్కడ చూడలేదు. ఈనెల 28న వెంకీ కుడుముల విశ్వరూపం చూడబోతున్నారు. క్లైమాక్స్ చూసిన తర్వాత ఆడియన్స్ వావ్ అంటారు. మైత్రి మేకర్స్ లేకపోతే ఈ సినిమా ఇంత క్వాలిటీగా వచ్చేది కాదు. ఈ సినిమాతో వారు మరో సక్సెస్ చూడబోతున్నారు' అని తెలిపారు. 'ఈ సినిమాలో అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్. వెంకీ నుంచి కొరుకునే వినోదం ఇందులో ఉంటుంది. నా క్యారెక్టర్ మీరా చాలా స్పెషల్. చాలా ఎంజాయ్ చేస్తూ చేశాను. ఇది మీకు తప్పకుండా నచ్చుతుంది. ఈ సినిమా తప్పకుండా మీ అందరినీ అలరిస్తుంది' అని హీరోయిన్ శ్రీలీల చెప్పారు.

డైరెక్టర్ వెంకీ కుడుముల మాట్లాడుతూ,'సినిమా పై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాను. తప్పకుండా బ్లాక్‌బస్టర్ కొడుతున్నాం. నా బెస్ట్ వర్క్ ఇదే. ఈ సినిమా ఇంత బాగా రావడానికి కారణం మా ప్రొడ్యూసర్ నవీన్, రవి. ఎక్కడా రాజీ పడకుండా సినిమాని చాలా అద్భుతంగా నిర్మించారు. ఈ సినిమాకి బ్యాక్ బోన్ నితిన్. ఇందులో మంచి ఫన్ వుంది. మీరు సర్‌ప్రైజ్ అయ్యే ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. ఈ సినిమాలో క్యామియో చేసిన డేవిడ్ వార్నర్‌కి థ్యాంక్స్' అని తెలిపారు.

> ఇప్పటివరకు రిలీజ్ చేసిన 3 సాంగ్స్‌కి చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. టీజర్‌లో ఉన్న ప్రతి ఎలిమెంట్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాలో ఎంటర్టైన్మెంట్, యాక్షన్, ఫోటోగ్రఫీ అన్నీ అద్భుతంగా ఉంటాయి. ఈ ఫార్మేట్‌లో ఇంతకంటే బెస్ట్ కమర్షియల్ సినిమా రాదేమో అనిపించింది. దర్శకుడు వెంకీ మంచి కమర్షియల్ ప్యాకెట్ సినిమా ఇచ్చాడు. హిలేరియస్ ఎంటర్టైన్మెంట్ ఉంది.
>
> - నిర్మాత వై రవిశంకర్

పాజిటివ్‌గా తీసుకోండి..



'గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డులకు సంబంధించి విధి, విధానాలు ఖరారు అయ్యాయి. పైడి జయరాజ్, కాంతారావు పేరుతో గౌరవ పురస్కారాలను కూడా అందించనున్నాం. అలాగే తెలుగుతోపాటు ఉర్దూ సిని మాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆ సినిమాకు బెస్ట్ ఫిల్మ్ అవార్డుని ఇవ్వనున్నాం' అని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్‌డీసీ) ఛైర్మన్, నిర్మాత దిల్‌రాజు అన్నారు.

ఈ నేపథ్యంలో బుధవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ, 'తెలుగు సినీ పరిశ్రమను ప్రోత్సహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ఇవ్వనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఏప్రిల్ నెలలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అంటే 2014 నుంచి 2023 డిసెంబర్ 31వ తేదీ వరకు విడుదలైన సినిమాల్లో ప్రతి ఏడాది ఉత్తమ చిత్రాన్ని ఎంపిక చేసి, అవార్డు ఇవ్వాలని నిర్ణయించాం. అలాగే 2024కు సంబంధించి కొన్ని మార్పులు, చేర్పులతో పాత రోజుల్లోని నంది అవార్డుల ప్రక్రియనే కొనసాగించనున్నాం. వీటి కోసం వెంటనే దరఖాస్తులను స్వీకరిస్తున్నాం. వీటిని జ్యూరీతో స్క్రూటినీ చేయించి, ఏప్రిల్‌లో అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించ బోతున్నాం. గతంలో సింహా అవార్డుల కోసం దరఖాస్తుదారులు ఎఫ్‌డీసీకి కొంత డబ్బు పంపించారు. ఆ డబ్బును వారికి ఇప్పుడు తిరిగి ఇచ్చేస్తాం. దీన్ని దరఖాస్తుదారులు పాజిటివ్‌గా తీసుకోవాలి. అలాగే అందరూ దీన్ని పాజిటివ్‌గా తీసుకుంటే హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా ఈ అవార్డుల పండగను జరుపుకోవచ్చు' అని అన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886